తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 23.11.2025 | సంపుటి :12 సంచిక : 123 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


జూబ్లీ హిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ,స్పోర్ట్స్ యూనివర్సిటీ తో పాటు ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ముఖ్యమంత్రి వారికి వివరించారు.






## పెన్నుపై మన్నుగప్పితే.. గన్నులై మొలకెత్తి

# గడీలను కూల్చినయ్

### తెలంగాణ అంటేనే తిరుగుబాటుతత్వం
### కవులు, కళాకారులకు తెలంగాణ పుట్టినిల్లు

- తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారు
- వారివల్లే స్వరాష్ట్ర కల సాకారం
- ఉద్యమకారులను గత పాలకులు విస్మరించారు
- చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- ఆయన గీతం లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
- అందెశ్రీ సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌బ్యూరో(జనంసాక్షి):

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. మిగతా 2లో..

జయజయహే తెలంగాణ ముక్కోటి గొంతుకలను ఏకం చేసి ఈ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపితేనే రాష్ట్ర కల నిజమైంది. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలనే కాదు, ప్రపంచంలో ఏ మూలన ఉన్నా తెలంగాణ గుండెకు జయజయహే తెలంగాణ చేర్చి ఒక ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గొప్ప తెలంగాణ బిడ్డ అందెశ్రీ. బడి ముఖమే చూడని సహజకవి ఆయన. ప్రతి బడిలో ఈనాడు జయజయహే తెలంగాణ తెలంగాణ పాడుకునేంత గొప్ప ప్రభావాన్ని ఈ సమాజానికి అందించారు - సీఎం రేవంత్ రెడ్డి

## డీజీపీ ముందు 37 మంది మావోయిస్టులు లొంగుబాటు

### వారిలో రాష్ట్రకమిటీ సభ్యులు ఆజాద్ సహా పలువురు అగ్రనేతలు

- 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బుల్లెట్లు స్వాధీనం
- గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలి
- డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్(జనంసాక్షి): మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, మిగతా 2లో..



## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మరికొంత సమయం కోరనున్న దానం!

హనుమకొండ(జనంసాక్షి): ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈ నెల 23వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చినట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ నోటీసులపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా మిగతా 2లో..




## గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై జీవో

### సర్పంచి, వార్డు సభ్యులపై విధివిధానాలు ఖరారు చేస్తూ విడుదల చేసిన ప్రభుత్వం




- రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ
- 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, కులగణన ఆధారంగా
- బీసీలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్ల కేటాయింపు
- కులగణన ఆధారంగా వార్డు సభ్యుల ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. మిగతా 2లో..







## ప్రపంచ అభివృద్ధి పారామితులపై పునరాలోచన అవసరం


### ప్రపంచ పురోగతికి ఆఫ్రికా అభివృద్ధి కీలకం

- జీ20 సమావేశాల్లో భారత ప్రధాని మోదీ
- మూడు కీలక ప్రతిపాదలను గురించి వివరించిన ప్రధాని
- గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపోజిటరీ ఏర్పాటుకు పిలుపు

జొహన్నెస్‌బర్గ్(జనంసాక్షి):ప్రపంచ అభివృద్ధి పారామితులపై పునరాలోచన అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని మోదీ ముఖ్యంగా మూడు చొరవలను ప్రతిపాదించారు. డ్రగ్స్ ముఠాలను కట్టడి చేయడానికి, అంతర్జాతీయ ఆరోగ్య ప్రతిస్పందన బృందం, గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపోజిటరీ ఏర్పాటుకు జీ20లోని సభ్య దేశాలు చొరవ తీసుకోవాలని కోరారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జీ20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ప్రధాని ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. 'ప్రస్తుత సమయంలో మన అభివృద్ధి పారామితులను పునఃసమీక్షించాలి. సమ్మిత, స్థిరమైన వృద్ధిపై దృష్టి పెట్టాలి. సమగ్ర మానవతావాదం వంటి భారతీయ సాంప్రదాయ విలువలు సుస్థిర అభివృద్ధికి మార్గం చూపుతాయి. ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడం ఆందోళనకరం. డ్రగ్ రాకెట్లు, ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థల సంబంధాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జీ20 ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తుంది. ఈ మాదక ద్రవ్య- ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చాలి' అని ప్రధాని మోదీ తెలిపారు. గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపోజిటరీ ఏర్పాటుకు ప్రధాని మోదీ ప్రతిపాదించారు. మనందరి సమిష్టి జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంప్రదాయ జ్ఞానం, పర్యావరణ అనుకూల మిగతా 2లో..

## అవును.. ఢిల్లీ పేలుళ్లకు కుట్ర నిజమే..

- విచారణలో అంగీకరించిన డా. ముజమ్మిల్ షకీల్
- ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు నిధులు
- డాక్టర్లే నిధులు సమకూర్చారని గుర్తింపు
- కేసులో ముమ్మర దర్యాప్తు.. శ్రీనగర్‌లో మరొకరి అరెస్ట్



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ పేలుడు ఘటనలో ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది ఈ సమయంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జైషే ఉగ్రసంస్థతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు కుట్ర పన్నడం నిజమేనని సమాచారం. 2023లో ఈ ప్రణాళిక వేసినట్లు బాంబు పేలుడు అనుమానితుడు విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.ఢిల్లీ పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్‌ను ఉమర్ నబీగా గుర్తించిన సంగతి తెలిసిందే. అతడితో సంబంధాలున్న పలువురు అనుమానితులను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్త దాడుల కోసం రెండు మిగతా 2లో..

## తెలంగాణలో అన్ని జిల్లాలకు డీసీసీ అధ్యక్షుల నియామకం

- నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ
- పలుచోట్ల ఎమ్మెల్యేలకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణలో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఖాళీగా ఉన్న డిసిసి పదవులను భర్తీ చేసింది. క్షేత్రసత్యాయిలో ప్రజలను సమీకరించేందుకు ఎమ్మెల్యేలకు పలుచోట్ల బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో మిగతా 2లో..



### ఇసుక అక్రమ రవాణా

## ఏకంగా చెక్‌డ్యామ్‌నే కూల్చేశారు

### పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామం వద్ద మానేరు వాగులో దుండగుల దుశ్చర్య

పెద్దపల్లి (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామం వద్ద మానేరు వాగుపై ఉన్న చెక్ డ్యామ్‌ను దుండగులు కూల్చివేశారు. దీంతో నీరు దిగువకు వెళ్తోంది. శుక్రవారం రాత్రి దుండగులు చెక్‌డ్యామ్‌ను కూల్చివేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఘటనాస్థలికి చేరుకుని నీటిపారుదల శాఖ అధికారులు మిగతా 2లో..

## సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం

### విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి • పుట్టపర్తి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

పుట్టపర్తి(జనంసాక్షి):సత్యసాయిమహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న అనంతరం రాష్ట్రపతి ప్రసంగించారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని రాష్ట్రపతి అన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందని ప్రభావితం చేశాయని అన్నారు. లక్షలాది మందికి మార్గం చూపాయని వ్యాఖ్యానించారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు.



అనంతరం పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని మిగతా 2లో..

### భూ కుంభకోణం జరుగుతోందని చెప్పినా

## భాజపా స్పందించదేం?

పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది: హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి):పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటువ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర మిగతా 2లో..




## డ్రోన్‌ల ద్వారా భారత్‌లోకి పాక్ ఆయుధాలు..

భారీ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు




9లో..

## నైజీరియాలో దుండగుల దుశ్చర్య

### 300 మంది బడిపిల్లల అపహరణ

అబుజా(జనంసాక్షి):ఆఫ్రికా దేశం నైజీరియాలో సాయుధ దుండగులు బడి పిల్లల అపహరణకు తెగబడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కిడ్నాప్ అయిన విద్యార్థుల సంఖ్య 300 దాటినట్లు 'క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ నైజీరియా' వెల్లడించింది. 12 మంది ఉపాధ్యాయులనూ సాయుధులు అపహరించిట్లు తెలిపింది. కెబ్బీ రాష్ట్రంలో 25 మంది పాఠశాల విద్యార్థినుల్ని కిడ్నాప్ చేసి వారం రోజులు గడవక ముందే ఈ ఘటన జరిగింది.నైజర్ రాష్ట్రంలోని మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23.11.2025

## గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై జీవో

రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు

## తెలంగాణలో అన్ని జిల్లాలకు డీసీసీ అధ్యక్షులు

తెలంగాణ డీసీసీలకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. 30 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ వారి పేర్లు వెల్లడించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ – డాక్టర్ నరేష్ జాదవ్,ఆసిఫాబాద్ – ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం –దేవి ప్రసన్న, భువనగిరి – బీర్ల ఐలయ్య, గద్వాల – రాజీవ్ రెడ్డి, హన్మకొండ – ఇనిగాల వెంకట్రామి రెడ్డి, హైదరాబాద్ – సయ్యద్ ఖలీద్ సహిఫుల్ల జగిత్యాల – నందయ్య, జనగాం – ధన్వంతి, జయశంకర్ భూపాల పల్లి కరుణాకర్,కామారెడ్డి – మల్లికార్జున ఆలెలను నయిమించారు. ఇందులో కొందరు కార్పోరనేషన్ ఛైర్మన్లు కూడా ఉన్నారు

## సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం

ద్రౌపది ముర్ము పేర్కొన్నారు ఆమె వెంట ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి చంద్రబాబు, లోకేశ్ ఘన స్వాగతం పలికారు.

## భూ కుంభకోణం జరుగుతోందని చెప్పినా భాజపా స్పందించదేం?

సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.“ భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించి నప్పుడు.. ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100% నుంచి 200% అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతా నికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు? 7 రోజుల్లో ఆమోదాలు? 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ? ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన ప్రక్రియ? రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారు. మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే ప్రక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్ఆర్ అవతలకు పంపించాల నేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదు” అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు లొంగొద్దు

- సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్(జనంసాక్షి):** సైబర్ నేరాలను అడ్డుకునేందుకు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు.

# పెన్నుపై మన్ను గప్పితే.. గన్నులై మొలకెత్తి గడీలను కూల్చినయ్



అంతేగాకాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు.అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. . తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు.ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.’ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా

స్పందించినట్లు చెప్పారు. స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తానని వెల్లడించారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.“నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నాను. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. కడియం శ్రీహరి భయపడడు. ఉప ఎన్నికలు వచ్చిన పక్షంలో కచ్చితంగా మళ్లీ పోటీ చేస్తా. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకు ఉంది” అని కడియం అన్నారు.
అనర్హత నోటీసు.. మరికొంత సమయం కోరనున్న దానం!
హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసే అవకాశం ఉంది. స్పీకర్ ఇచ్చిన అనర్హత నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కోరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై ఏఐసీసీ పెద్దలతో దానం సంప్రదింపులు చేశారు. ఎమ్మెల్యేగా రాజీనామా, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. తాను రాజీనామా చేస్తే.. తిరిగి తనకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలుస్తోంది. అనర్హత వేటు వేసేందుకు అవకాశం ఉంటే రాజీనామా చేస్తానని సన్నిహితులకు దానం చెప్పినట్లు సమాచారం.పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు.

## ఇసుక అక్రమ రవాణా కోసం ఏకంగా చెక్‌డ్యామ్‌నే కూల్చేశారు

పరిశీలించారు. వాగులోని ఇసుకను అక్రమ రవాణా చేసేందుకే దుండగులు ఈ పనికి ఒడిగట్టారని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో చెక్ డ్యామ్‌కు చెందిన 3 ప్యానళ్లు ధ్వంసం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల రూ.23 కోట్లకుపైగా నిధులతో ఈ చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టారు.

## అవును.. ఢిల్లీ పేలుళ్లకు కుట్ర నిజమే..

సంవత్సరాలుగా సిద్ధం అవుతున్నానని, పేలుడు పదార్థాలు, రిమోట్లు, బాంబు తయారీ పదార్థాలను సేకరిస్తున్నానని అనుమానితుల్లో ఒకడైన డా. ముజమ్మిల్ షకీల్ జాతీయ దర్యాప్తు సంస్థ విచారణలో అంగీకరించినట్లు సమాచారం. యూరియా, అమ్మోనియా నైట్రేట్‌ను కొనుగోలు చేయడం తనకు అప్పగించిన పనని చెప్పినట్లు తెలుస్తోంది.“హరియాణాలోని గురుగ్రామ్, నూహ్ నుంచి రూ.3లక్షల పెట్టి, 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను ముజమ్మిల్ కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాద్‌లోని రెండు వేర్వేరు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఈ రసాయనాలను నిల్వ చేసేందుకు ఒక డీప్ ఫ్రీజర్‌ను అమర్చుకున్నాడు. ఈ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్థాల్లో వాడేలా ప్రాసెస్ చేయడం, ఇతర రసాయనాలను సమకూర్చడం బాంబర్ ఉమర్ పని” అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.ఢిల్లీ పేలుళ్ల కుట్రకు ఉగ్ర అనుమానితులే నిధులు సమకూర్చారని, పేలుడు పదార్థాల కొనుగోలుకు రూ.26 లక్షలు సేకరించారని సదరు వర్గాలు వెల్లడించాయి. ఆ మొత్తాన్ని బాంబర్ ఉమర్‌కు ఇచ్చారని.. అతడు కూడా స్వయంగా రూ.2లక్షలు ఇచ్చాడని పేర్కొన్నాయి. ఇక, అల్–ఫలా విశ్వవిద్యాలయంలో డబ్బు విషయంలో ఉమర్, ముజమ్మిల్ మధ్య గొడవ జరిగిందట. దానితర్వాత తన రెడ్ ఎకోస్పోర్ట్ కారును ముజమ్మిల్‌కు ఉమర్ ఇచ్చాడని తెలిపాయి.

### ఢిల్లీ పేలుళ్ల కేసులో ముమ్మర దర్యాప్తు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటనలో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీనగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారంనాడు అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని తు÷ల్ నియాజ్ భట్‌గా గుర్తించారు.గత అక్టోబర్‌లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. శ్రీనగర్ సీనియర్ ఎస్పీ డాక్టర్ జీవీ సుందీప్ చక్రవర్తి ఈ విచారణను పర్యవేక్షించి, సీసీటీవీ అనాలసిస్ చేపట్టడంతో మొదటి ముగ్గురి అనుమానితులు పట్టుబడ్డారు. ఆరిఫ్ నసీర్ దర్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రాఫ్, మక్సూద్ అహ్మద్ దర్ అలియా షాహిద్‌లను అరెస్టు చేశారు. వీరిని విచారించిన దర్యాప్తు సంస్థలు ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు.

## తరచూ విదేశాలకు రవి

### పైరసీ కింగ్‌కు విదేశాల్లో బృందాలు, ఆస్తులపై ఆరా

**హైదరాబాద్(జనంసాక్షి):** సినీ రంగాన్ని, పోలీసులను ఆరేళ్లపాటు ముప్పుతిప్పలు పెట్టిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసులో పోలీసుల విచారణ మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇవాళ.. పైరసీ కింగ్ పిన్ రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారు. ఎవరెవరు సహకరిస్తున్నారు, తెర వెనుక ఇంకెంతమంది ఉన్నారనే విషయాలపై ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ–బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసుల అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్లలో అప్‌లోడ్‌కి సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లో బృందాలు, ఆస్తులు, లింకులపై ఆరా తీశారు.

## ఓట్లేస్తేనే నిధులు..

**- లేకుంటే ఇచ్చేదిలేదు**

**- అజిత్ పవార్ వివాదాస్పద వ్యాఖ్యలు**

ముంబై(జనంసాక్షి):ఓటర్లను ఉద్దేశించి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను తిరస్కరిస్తే.. నిధుల కేటాయింపు విషయంలో తానూ అదే పనిచేస్తానని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బారామతిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు.“స్థానికంగా ఎన్సీపీకి చెందిన 18 మంది అభ్యర్థులను గెలిపిస్తే.. ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తాను. హామీలను నెరవేర్చే విషయానికి కట్టుబడి ఉన్నాను. మీ దగ్గర ఓట్లు ఉన్నాయి. నా దగ్గర నిధులు ఉన్నాయి. మీరు తిరస్కరిస్తే.. నేను కూడా తిరస్కరిస్తా” అని అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కూడా ఆయనే కావడం గమనార్హం. అజిత్ పవార్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆయన ఓటర్లపై బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపించాయి. “నిధులు అనేవి సామాన్య ప్రజలు కట్టిన పన్నుల నుంచి విడుదల చేస్తుంటారు. అజిత్ పవార్ ఇంటి నుంచి ఇవ్వరు. ఆయన ఓటర్లను బెదిరిస్తుంటే.. ఎన్నికల సంఘం ఏం చేస్తోంది?” అని శివసేన (యూబీటీ) నేత అంబాదాస్ ధన్వే ప్రశ్నించారు.

## డీజీపీ ముందు 37 మంది మావోయిస్టులు లొంగుబాటు



భారీగా బులెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. ’తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

### ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్న ఆజాద్


మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని పేర్కొన్నారు. స్టేట్ కమిటీలో ఉన్న ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాల సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్రా ఉన్నట్లు డీజీపీ తెలిపారు. మిగతా 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 25 మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు నగదుతోపాటు మరికొన్ని వెసులుబాట్లు కూడా కల్పిస్తామని చెప్పారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాసి నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులు అందరిపైనా కలిపి మొత్తం 1.41 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వారికే అప్పగిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు ఉన్నారని.. వారు కూడా తొందరగా లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సొనారో అరెస్టు



రియోడీజెనెరో(జనంసాక్షి):బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో అరెస్టయ్యారు. తిరుగుబాటు కుట్ర చేశారన్న అభియో గాలపై ఇప్పటికే ఆయనకు 27 సంవత్సరాలు శిక్ష పడగా.. మరికొన్ని రోజుల్లోనే జైలుకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ముందస్తుగా ఆయన్ను ఫెడరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఉదయం అరెస్టు చేశారని, రాజధాని బ్రెసిలియాలోని పోలీసు కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు బోల్సొనారో ప్రతినిధి వెల్లడించారు. మరోవైపు ఇదే అంశంపై ఫెడరల్ పోలీసులు స్పందిస్తూ.. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.2019 నుంచి 2022 వరకు బ్రెజిల్ అధ్యక్షుడిగా ఉన్న బోల్సొనారో.. 2022 ఎన్నికల్లో ఓడిపోయారు. అయినప్పటికీ ఫలితాలను అంగీకరించేందుకు నిరాకరించారు. ఆ సమయంలో వేల సంఖ్యలో ఆయన మద్దతుదారులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పదవిలో కొనసాగేలా తిరుగుబాటు కుట్రకు బోల్సొనారో ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు.. మాజీ అధ్యక్షుడికి 27 ఏళ్ల శిక్ష విధిస్తూ ఈ సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది.ఈ క్రమంలో కేసు విచారణ సమయం నుంచే (ఆగస్టు) బోల్సొనారో గృహ నిర్బంధంలో ఉన్నారు. న్యాయస్థానం విధించిన శిక్షపై అప్పీలుకు వెళ్లగా అక్కడ చుక్కెదురయ్యింది. జైలుకెళ్తే తీవ్ర ఇబ్బందులు ఉంటాయని, ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని మాజీ అధ్యక్షుడి తరఫు న్యాయవాదులు వాదించారు. ఆయన ఆరోగ్యం క్షీణించిందని, గృహనిర్బంధంలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఉపశమనం లభించలేదు.

## ప్రపంచ అభివృద్ధి పారామితులపై పునరాలోచన అవసరం



జీవన విధానాలు, మానవ సమాజాన్ని బలపరిచే పద్ధతులను భద్రపరచడానికి ఈ నాలెడ్జ్ రిపోజిటరీని ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రస్తుతం ప్రపంచానికి సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధి అవసరమని మోదీ ఉద్ఘాటించారు. అంతర్జాతీయ ఆరోగ్య ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేస్తే మహమ్మారులను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. అందుకోసం జీ20 సభ్య దేశాల్లోని వైద్య నిపుణులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుందామని ప్రధాని పిలుపునిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితికి వెంటనే ప్రతిస్పందించగల గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్ అవసరమని అన్నారు. ప్రపంచ పురోగతికి ఆఫ్రికా అభివృద్ధి కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ ఎల్లప్పుడూ ఆఫ్రికాకు మద్దతుగానే ఉందని తెలిపారు. 2023లో దిల్లీలో జరిగిన శిఖరాగ్ర సదస్సులోనే ఆఫ్రికా సమాఖ్యకు జీ20లో శాశ్వత సభ్యత్వం లభించిందని గుర్తుచేశారు. వచ్చే దశాబ్ద కాలంలో ఆఫ్రికాలో 10 లక్షల మంది సర్టిఫైడ్ ట్రైనర్స్‌ను తయారు చేసేందుకు సంయుక్తంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.సదస్సుకు ముందు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా చేతులు జోడించి మోదీకి నమస్కరిస్తూ, స్వాగతం పలికారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని మోదీ వరుస ద్వైపాక్షిక భేటీలతో బిజీబిజీగా గడిపారు. చైనా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా సహా పలు దేశాల అధినేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. మోదీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, అణు ఇంధనం సహా పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

## నైజీరియాలో దుండగుల దుశ్చర్య

సెయింట్ మేరీస్ కేథలిక్ గురుకుల పాఠశాలపై గుర్తుతెలియని సాయుధులు శుక్రవారం తెల్లవారు జామున దాడిచేశారు. తొలుత 52, ఆ తర్వాత 215 మంది వరకు విద్యార్థులు అపహరణకు గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే, స్కూల్‌లో తనిఖీలు, విద్యార్థుల లెక్కింపు అనంతరం ఈ సంఖ్య 303కు పెరిగినట్లు సీఏఎన్ ప్రతినిధి తెలిపారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్లు ఇంకా ఏ సంస్థ ప్రకటించలేదు. పిల్లలను రక్షించేందుకు అధికారులు రంగంలోకి దిగారు.ఈ ప్రాంతంలోని పాఠశాలలను భద్రత కారణాల దృష్ట్యా తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. స్కూల్‌ను తెరిచారని ప్రభుత్వం చేసిన వాదనలను సీఏఎన్ కొట్టిపారేసింది. నైజీరియాలో క్రైస్తవులకు వ్యతిరేకంగా సాగుతున్న మారణహోమాన్ని నిలిపేందుకు సైనిక చర్యకూ వెనకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఈ ఘటనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మహిళల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కొండ సురేఖ
- వరంగల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం
- వర్చువల్ గా ప్రారంభించిన మంత్రి..





**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 22(జనంసాక్షి):** మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అప్పుడే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ ప్రారంభించారు. ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ఆప్కాబ్ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆడిటోరియంలో వరంగల్ జిల్లాకు సంబంధించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం చేపట్టిన "మహిళల ఉన్నతి – తెలంగాణ ప్రగతి"' కార్యక్రమంలో భాగంగా ఈ పంపిణీ జరిగింది.పండుగ సందడి వాతావరణం లో మహిళలు హర్షాతిరేకాలతో కార్యక్రమం సాగింది.హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారారాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండా సురేఖ పాల్గొనగా, హన్మకొండ డిసిసిబి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ఆప్కాబ్ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిలు మహిళ సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన అద్భుతమైన రంగు తో చీరలు తయారు చేయించినందుకు మంత్రులు సితక్క, తుమ్మల నాగేశ్వరరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్క సారలమ్మ త్యాగలగడ్డ ఓరుగల్లు అని, మహిళలు అనుకున్నది సాధిస్తారని అన్నారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రతి మహిళ ఉక్కు మహిళగా ఎదగాలని కోరారు. మహిళాల ధైర్యం నాయకత్వం పట్టుదల దేశాభివృద్ధికి కీలకమని అన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ స్వయం సహాయక కార్యక్రమాలు మహిళలను మరింత శక్తివంతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సంకల్ప దిశగా సాగుతున్నదని స్పష్టం చేశారు.ఇందిరమ్మ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందని, మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకొనేలా ప్రోత్సహించామని, ఆర్టీసీలో వెయ్యి బస్సులను మహిళలకు యజమానులను చేశామని, వడ్డి లేని రుణాలు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ పంప్ ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ,మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. రాజకీయాల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారీ పెట్టి గౌరవించాలని ఉద్దేశంతో కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు.మొదటి విడతలో గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, పంపిణీ చేస్తున్నట్లు వచ్చే మార్చి నెలలో రెండవ విడతలో పట్టణ ప్రాంతం మున్సిపాలిటీలోని 35 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తామన్నారు. మహిళా సంఘాల్లో సభ్యత్వం లేని మహిళలను సంఘాల్లో చేర్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు 18 ఏళ్లు నిండిన దారిద్ర్యరేఖకు దిగువనన్న ప్రతి మహిళకు చీర అందించాలని మంత్రి కోరారు. ఇలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా పంపిణీకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో రామిరెడ్డి, డిఆర్డీఓ, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

# కార్మిక కోడ్‌ల అమలు నిర్ణయం దారుణం

- పత్రికా స్వేచ్ఛ, మీడియా హక్కులకు తీవ్రమైన ముప్పు అని హెచ్చరిక : టీయుడబ్ల్యుజె

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాలుగు కార్మిక కోడ్‌లను ఏకపక్షంగా అమలు చేసిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యుజె) తీవ్రంగా ఖండించింది. ఈ చర్య భారతదేశంలో జర్నలిస్టులు, మీడియా కార్మికులు, అలాగే పత్రికా స్వేచ్ఛ పై దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లు అభిప్రాయపడ్డారు.

కొత్తగా అమల్లోకి వచ్చిన ఈ కోడ్‌లు 1955లోని వర్కింగ్ జర్నలిస్ట్స్ మరియు ఇతర న్యూస్‌పేపర్ ఎంప్లాయీస్ (కండిషన్స్ ఆఫ్ సర్వీస్) అండ్ మిసలేనియస్ ప్రొవిజన్స్ యాక్ట్ మరియు 1958లోని వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఫిక్సేషన్ ఆఫ్ రేట్స్ ఆఫ్ వేజెస్) యాక్ట్ అనే రెండు చారిత్రక చట్టాలను మాయం చేశాయన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు దశాబ్దాల పాటు చేసిన పోరాటాల ద్వారా సాధించిన ఈ చట్టాలు, మీడియా యజమానులు, ప్రకటనదారులు, రాజకీయ ప్రభావ కేంద్రాల నుండి జర్నలిజాన్ని స్వతంత్రంగా ఉంచే రక్షణాత్మక వ్యవస్థగా ఇంతకాలం పనిచేశాయని నేడు వాటిని ఏకపక్షంగా రద్దు చేయడం అన్యాయమన్నారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా కార్మికులను కూడా ఈ చట్టాల పరిధిలోకి తీసుకురావాల్సిందిగా జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్న సమయంలో, ప్రభుత్వం రక్షణలను విస్తరించాల్సింది పోయి మరింత కుదించే ప్రక్రియను ఎంచుకోవడం 29 చట్టాల స్థానంలో నాలుగు కోడ్ లు తీసుకువచ్చి జర్నలిస్టులను కలపడం అన్యాయమన్నారు. "ఇది పత్రికా స్వేచ్ఛపై నేరుగా దాడి చేసినట్లే. వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ఒక సాధారణ కార్మిక చట్టం మాత్రమే కాదుమీడియా స్వతంత్రతకు రాజ్యాంగపరమైన హామీ అని దాన్ని కార్మిక కోడ్‌లలో విలీనం చేయడం జర్నలిస్టుల కష్టపడి సాధించిన హక్కులను హరించడమే కాక, ప్రజాస్వామ్యంలో మీడియా పోషించే కీలక పాత్రను బలహీనపరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ కోడ్‌లు మీడియా రంగ నిపుణులతో గానీ, జర్నలిస్ట్ సంఘాలతో గానీ సరైన సంప్రదింపులు జరపకుండా బలవంతంగా అమలు చేశారని,ఈ కార్మిక వ్యతిరేక మరియు మీడియా వ్యతిరేక కోడ్‌లకు ప్రతి వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఖచ్చితంగా ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. జాతీయ కనీస వేతనం, ప్రమాద పరిహారం వంటి అంశాలను,వేతనాల భద్రత,పనివేళల నియంత్రణ గురించి కోడ్ లో ప్రస్తావించినప్పటికీ జర్నలిస్టులకు ప్రత్యేక చట్టం రూపంలో ఉంచి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర కార్మిక సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, కార్మిక నిపుణులు వ్యక్తం చేసిన అనేక అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఈ చర్య చేపట్టిందని ఆరోపించారు. నాలుగు కార్మిక కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాలను పునరుద్ధరించి బలపరచాలని, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులకు న్యాయ పరిరక్షణలను విస్తరించాలి. వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తించాలని, ప్రజాస్వామ్య చర్చల కోసం భారతీయ కార్మిక సదస్సును తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు స్వేచ్ఛా, స్వతంత్ర జర్నలిజానికి పునాది అయిన హక్కులను కాపాడేందుకు అప్రమత్తంగా, ఐక్యంగా ఉందామని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం పిలుపునిస్తోందన్నారు.

# మేడారం జాతర పనులను యజ్ఞంలా చేపట్టాలి

- గిరిజన సంప్రదాయాలను ఉట్టి పడేలా ఏర్పాట్లు ఉండాలి
- నాణ్యతా ప్రమా ణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క




**ములుగు ప్రతినిధి, నవంబర్ 22(జనంసాక్షి) :** మేడారం జాతర పనులను యజ్ఞంలా చేపట్టాలని, గిరిజన సంప్రదాయాలను ఉట్టి పడేలా ఏర్పాట్లు ఉండాలని, నాణ్యతా ప్రమా ణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలనిరాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం దేవాలయం అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఐటిడిఏ గెస్ట్ హౌస్ లో మంత్రి సీతక్క, కలెక్టర్, పిఓ తో కలిసి నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పిఆర్, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్టీసీ, ఆర్ డబ్ల్యు ఎస్, ఇరిగేషన్, విద్యుత్, టూరిజం, ఫారెస్ట్, అధికారులతో మేడారం జాతర పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు మేడారం లోని గిరిజన మ్యూజియం, మిషన్ భగీరథ ఓహెచ్ఆర్ఎస్ వాటర్ ట్యాంకులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మల్లంపల్లి, కటాక్షపూర్ జాతీయ రహదారి మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మంగపేట బస్టాండ్ నిర్మాణ పనులు డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని అన్నారు. మహాజాతరకు ముందు వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు తరలివస్తున్న క్రమంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దని అన్నారు. మహా జాతరను విజవంతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. శ్రీ సమ్మక్క– సారలమ్మల కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తం గా తెలిసే విధంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని అన్నారు. అదనపు లేబర్, యంత్రాలు, నిపుణులను సమకూర్చుకొని నిర్ణీత సమయానికి పనులన్నీ పూర్తి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఏపిఓ వసంతరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టను సందర్శించిన ఏపీ మంత్రి పార్థసారథి

- మనవరాలికి అన్నప్రాశన నిర్వహణ

**యాదగిరిగుట్ట, నవంబర్22 (జనంసాక్షి) :** యాదాద్రిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ఇదో అదృష్టమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె. పార్థసారథి అన్నారు. ఇక్కడికి రావడం నిజంగానే అదృష్టమన్నారు. దేవాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె. పార్థసారథి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పూజారులు సంప్రదాయబద్ధంగా మంత్రి కుటుంబానికి స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభూ పంచనారసింహులను మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన మనవరాలికి అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దైవారాధనలో పాల్గొన్న మంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులకు పూజారులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# రహస్య సమావేశాలతో పీఎల్‌జీఏ వారోత్సవాలు

- డిసెంబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా 25వ వార్షికోత్సవాలు
- పీడిత జాతుల్ని విప్లవోద్యమంలో మరింత భాగస్వామ్యం చేస్తాం
- దండకారణ్యం నుంచి ఇతర ప్రాంతాలకు రీట్రీట్ చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం
- సోను, సతీష్ పార్టీకి తీరని ద్రోహం చేశారు
- పార్టీ వ్యూహాలు, ఎత్తుగడ లోపాలు, తప్పులను ఆత్మవిమర్శ చేసుకున్న మావోయిస్టు పార్టీ
- 16 పేజీల డాక్యుమెంటరీ విడుదల చేసిన సెంట్రల్ మిలటరీ కమిషన్



**చర్ల, నవంబర్ 22 (జనంసాక్షి) :** విప్లవ ప్రతిఘాత కగార్ యుద్ధం నుంచి పార్టీని, పీఎల్‌జీఏను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం అని భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలని కోరింది. ఈ నేపథ్యంలో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యానికి (పీఎల్‌జీఏ) డిసెంబర్ 2 నాటికి 25 ఏళు నిండుతాయని, డిసెంబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో విప్లవోత్సాహంతో, దృఢసంకల్పంతో రహస్య సమావేశాలతో వారోత్సవాలు నిర్వహించాలని పేర్కొంది. పార్టీ అనుసరించిన వ్యూహాలు, ఎత్తుగడలో లోపాలు, తప్పులను ఆత్మవిమర్శ చేసుకున్న మావోయిస్టు పార్టీ.. 16 పేజీల డాక్యుమెంటరీని విడుదల చేసింది. ఈ సందర్భంగా యావత్ పార్టీకి, పీఎల్‌జీఏకు, ప్రజా నిర్మాణాలకు, పీడిత ప్రజలకు సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ, సీపీఐ (మావోయిస్టు) పార్టీ సందేశం పంపింది.

గత ఏడాది కాలంగా సాగుతున్న కగార్ యుద్ధాన్ని సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ అసువులు బాసిన వీర గెరిల్లాలకు తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తోందని పేర్కొంది. దండకారణ్యం నుంచి పీఎల్‌జీఏ బలగాలను ఇతర ప్రాంతాలకు రీట్రీట్ చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, సోను, సతీష్ పార్టీకి తీరని ద్రోహం చేశారని తెలిపింది. గత 11 నెలల కాలంలో దేశవ్యాప్తంగా 320 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని, వారిలో 183 మంది పురుషులు, 117 మంది మహిళా కామ్రేడ్స్, వివరాలు తెలియని మరో 20 మంది ఉన్నారని తెలిపింది. 8 మంది కేంద్ర కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను కూడా కోల్పోయినట్టు వెల్లడించింది. కీలక నేతల్ని కోల్పోయి తీవ్ర నష్టాల స్థితిలో ఉన్న సమయంలో సోను, సతీష్‌ల ముఠా శత్రువుకు ఆయుధాల్ని అప్పగించి మరింత నష్టం చేసిందని, ఈ తరుణంలో పీఎల్‌జీఏ వారోత్సవాలను విప్లవ శిబిరంలో ఆత్మవిశ్వాసాన్ని కల్పించేలా జరపాలని పిలుపునిచ్చింది. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో బహిరంగ – రహస్య పోరాట నిర్మాణ రూపాలను సమన్వయ పరిచి వర్గపోరాటం నడపాలని, పీడిత జాతుల్ని విప్లవోద్యమంలో మరింత భాగస్వామ్యం చేయాలని సూచించింది.


### శత్రుసాయుధ బలగాలూ నష్టపోతున్నాయ్..!

ఆపరేషన్ కగార్ తీరని నష్టం కలిగిస్తున్నా.. పీఎల్‌జీఏ బలగాలు, విప్లవ ప్రజలు చేస్తున్న ఆత్మరక్షణ యుద్ధంలో శత్రుసాయుధ బలగాలు కూడా గణనీయంగా నష్టపోతున్నాయని మావోయిస్టు పార్టీ తన ప్రకటనలో తెలిపింది. గతేడాది కాలంలో వివిధ ప్రాంతాల్లో 116 మంది పోలీసులు నిర్మూలించబడ్డారని, 208 మంది గాయపడ్డారని, అదేవిధంగా కొందరు గోపనీయ సైనికులను, పోలీసు ఇన్‌ఫార్మర్లను, బీజేపీకి చెందిన ప్రజా శత్రువులైన రాజకీయ నాయకులను పీఎల్‌జీఏ బలగాలు మట్టుబెట్టాయని తెలిపింది. అయినప్పటికీ ఈ నష్టాల్ని ప్రకటిస్తే మోరల్ దెబ్బతింటుందని ప్రకటించడం లేదని, ఇది మానసిక యుద్ధంలో భాగమని, ఈ ప్రభావానికి గురికావొద్దని సూచించింది. 50 వేల కేంద్ర, రాష్ట్ర బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టినప్పటికీ ప్రతిఘటిస్తూ శత్రుసాయుధ బలగాలకు గణనీయమైన సంఖ్యలో నష్టాలు కలిగించడం సకారాత్మక అంశాలను పేర్కొంది.

### ద్రోహులు సృష్టించిన సంక్షోభాన్ని అధిగమించాలి

విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధం నుంచి పార్టీని కాపాడుకోవడం కోసం రాజకీయ, నిర్మాణ, సైనిక కర్తవ్యాల సాధన కోసం కృషి చేయాలని మావోయిస్టు పార్టీ కోరింది. స్వీయాత్మక బలగాల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, నష్టాన్ని నివారించుకోవాలని సూచించింది. సోను, సతీష్ విప్లవ ద్రోహుల ముఠా సృష్టించిన సంక్షోభాన్ని అధిగమించాలని పేర్కొంది. ఫాసిస్టు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రచార, ఆందోళన, పోరాట కార్యక్రమాల్ని చేపట్టి ప్రజా పునాదిని పెంచుకోవాలని,దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ప్రజాపునాదిని పెంచుకుంటూ దాని ఆధారంగా గెరిల్లా యుద్ధాన్న కొనసాగించాలని సూచించింది. అందులో భాగంగా ఉద్యమ ప్రాంతలంతటా పోస్టర్లు వేసి, కరపత్రాలు పంచి ప్రజల్లో పీఎల్‌జీఏను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తింపజేయాలని, తగిన అర్హతలున్నవారిని భర్తీ చేసుకోవాలని పేర్కొంది.

# తెలంగాణ ఓపెన్ బ్యాడ్మింటన్‌ను ప్రారంభించిన ఉప్పల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చెంగిచర్లలో శాలీని సురేష్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఏపూరి స్వరూప రాణి మెమోరియల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ 4 రోజుల పాటు జరిగే పోటీలను ప్రారంభించడం సంతోషం అని గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది అని, త్వరలోనే స్పోర్ట్స్ పాలసీ రాబోతుంది అని రాష్ట్ర వ్యాప్తంగా వున్న 33 జిల్లాల్లో స్టేడియం లు వస్తున్నాయి అని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు ప్రభుత్వ స్థలం , ఉద్యోగం అలాగే పారితోషకం ఈవ్వనున్నట్లు ఆయన తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు అలాగే ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ గారు ఆధ్వర్యంలో పల్లె నుండి పట్నం వరకు ప్రతి క్రీడాకారులకు అండగా వుంటుంది అని అలాగే ఉప్పల ఫౌండేషన్ ద్వారా హెల్త్ చేస్తానని ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. మతాలకు అతీతంగా అందరూ కలిసే చోటు క్రీడామైదానం ఒక్కటే. యువత వ్యసనాల జోలికి పోకుండా క్రీడలవైపు మళ్లాలని, విశ్వ క్రీడల్లో మెడల్స్ సాధించాలని, మీకు అవసరమైన సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుంది అని ఆయన అన్నారు. ఈ పోటీల్లో అండర్ 13 ,15, 17 విభాగాల నుండి బాయ్స్, మహిళ విభాగం నుండి 670 మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు శాలిని సురేష్ శ్రీ యూవీఎన్ బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్టేట్ కోశాధికారి వంశీ మేడ్చల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి హర్ష క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో నకిలీ లేడీ ఖాకీ పట్టివేత


**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో నకిలీ ఖాకీ వ్యవహారం వెలుగుచూసింది. జీడిమెట్ల పోలీసు పరిధిలో నకిలీ లేడీ కానిస్టేబుల్‌గా వ్యవహరించిన ఉమాభారతి అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కానిస్టేబుల్ పోస్టుకి సెలెక్ట్ కాలేకపోయినా, తాను పోలీసు సిబ్బందిలోనే పనిచేస్తున్నట్లు చాటుకునేలా ఖాకీ డ్రెస్ కొనుగోలు చేసి, పలు వీఐపీ కార్యక్రమాలకు బందోబస్తు డ్యూటీలు చేసిన విషయం బయటపడింది. తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, పోలీసులలో పనిచేయాలనే కోరికతో ఉమాభారతి ముందుగా డ్రెస్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాదులో జరిగిన కీలక వీఐపీ కార్యక్రమాల్లో.. సచివాలయంలో జరిగిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ఖైరతాబాద్ గణెళిష్ ఉత్సవాల ఊరేగింపు వంటి ఈవెంట్లలో బందోబస్తుల పేరుతో తిరిగినట్లు వెల్లడైంది. సైబరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి కూడా వెళ్లి, అక్కడి క్యాంటీన్‌లో గడిపి వెళ్లిపోయిన విషయం విచారణలో బయటపడింది. అంతేకాకుండా పలు కాలేజీల్లోకి వెళ్లి 'సైబర్ క్రైమ్ అవేర్‌నెస్' పేరుతో లెక్చర్లు ఇచ్చిందని కూడా పోలీసులు గుర్తించారు. ఒక దశలో ఉమాభారతి ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను ప్రశ్నించడంతో మొత్తం నకిలీ ఖాకీ డ్రామా బట్టబయలైంది.

## ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అర్బన్ ఫామింగ్ ట్రైనింగ్

**హైదరాబాద్, (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యానశిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో అర్బన్ ఫామింగ్ పథకం కింద హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలలో ఇంటి ఆవాసాలు, బాల్కానీలపై కూరగాయాల పెంపకంపై ఈనెల 23న శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగుతుందని, ఆసక్తి గలవారు ఫీజు రూ. 100/ చెల్లించి నేరుగా హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు అర్బన్ ఫామింగ్ విభాగము పబ్లిక్ గార్డెన్, నాంపల్లి, హైదరాబాద్ లేదా ఫోన్ : 8977714411/8688848714ను సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

# గవాయి చివరి తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం!

*భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పదవీకాలం ఈ ఆదివారంతో ముగుస్తుంది. శని, ఆది వారాలు సుప్రీం కోర్టుకు సెలవు, శుక్రవారం నాడు వీడ్కోలు సమావేశాలు గనుక, గురువారమే ఆయన బెంచి మీద కూచుని వాదనలు వినడానికి, విచారణ చేయడానికి, తీర్పులు చెప్పడానికి చివరి రోజు. ఆ చివరి రోజున ఆయన నాయకత్వంలోని ద్విసభ్య ధర్మాసనంలో ఒక తీర్పు, ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో మరొక తీర్పు చెప్పారు. ఆ రకంగా ఆ రెండూ జస్టిస్ బిఆర్ గవాయి చివరి తీర్పులు అనవచ్చు.*




వాటిలో మొదటి తీర్పు 2021 ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ యాక్ట్ అనే చట్టం చెల్లదు అని ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ఇచ్చినది. అంతకు ముందు ప్రభుత్వం అదే విషయం మీద ఒక ఆర్డినెన్సు జారీ చేసి, ఆ ఆర్డినెన్సును కోర్టు కొట్టివేసిన తర్వాత, దాన్నే యథాతథంగా చట్టంగా మార్చిందని, అది చెల్లదని సుప్రీం కోర్టు ఇప్పుడు తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ట్రిబ్యునళ్లలో సభ్యులుగా ఎవరిని నియమించాలి, ఆ సభ్యులకు ఏ అర్హతలుండాలి, వారి పదవీకాలం ఎంత ఉండాలి, ఒకసారి పదవీకాలం ముగిసిన తర్వాత పునర్నియామకం చేయవచ్చునా అని విషయాలను చర్చించే చట్టాన్ని కొట్టివేయడానికి సంబంధించినది ఆ తీర్పు. ఇది కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసే ట్రిబ్యునళ్లకు, అందులో నియామకం అయ్యే సభ్యులకు మాత్రమే సంబంధించినది.

కాగా రెండో తీర్పుకు కారణమైన కేసు, భవిష్యత్తులో తీవ్రమైన రాజకీయ పరిణామాలకు దారి తీయగలిగినది. అసలు రాజ్యాంగ స్ఫూర్తినే, దేశపు సమాఖ్య స్వభావాన్నే ధ్వంసం చేయగలిగినది. రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరించి కేంద్ర ప్రభుత్వానికి మితిమీరిన నిరంకుశ అధికారాలను కట్టబెట్టేది. కాని ఆ కేసులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి, ఐదుగురు సభ్యుల ధర్మాసనం అన్యాయమైన, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే తీర్పు ఇచ్చింది. చాలా తీవ్రమైన దుష్పరిణామాలకు పునాది వేస్తున్న, లేదా ఉన్న పునాదిని బలోపేతం చేస్తున్న ఈ తీర్పు ఏమిటో, ఏ సందర్భంలో వెలువడిందో, దానివల్ల జరగబోయే దుష్పరిణామాలేమిటో వివరంగా తెలుసుకోవాలి.

దేశంలో గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్ర ప్రభుత్వ నిరంకుశాధికారానికి ఒక పనిముట్టుగా ఉందని దశాబ్దాలుగా చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాధికారం భిన్నమైన పార్టీ చేతిలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వాధికారం ఉన్న రాజకీయ పార్టీ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి తన పార్టీ నాయకులను గవర్నర్‌గా రాష్ట్రానికి పంపి, రాజ్ భవన్‌ను రాజకీయాల కేంద్రంగా మారుస్తున్నదని ఎన్నో ఏళ్లుగా విమర్శలున్నాయి. ఈ పని దేశంలోని అన్ని పార్టీలూ చేశాయి. ఎవరికీ మినహాయింపు లేదు.

దేశంలో 1967 దాకా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నాయి గనుక కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్ పదవిని ఇలా వినియోగించవలసిన అవసరం రాలేదు. కాని ఆ తర్వాత నుంచీ కేంద్రంలో ఉన్న అధికారంలో ఉన్న పార్టీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ భిన్నంగా ఉన్నప్పుడు, కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచడానికి, చెవి మెలిపెట్టడానికి గవర్నర్ వ్యవస్థను వాడుకోవడం మొదలుపెట్టింది. కాంగ్రెస్, జనతా పార్టీ, యునైటెడ్ ఫ్రంట్, యూపీఏ అన్ని ప్రభుత్వాలూ ఈ పని చేశాయి. ప్రస్తుతం ఎన్ డి ఎ పేరుతో ఉన్న సంఘ్ పరివార్ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను ఇలా వినియోగించడాన్ని ఒక కళగా అభివృద్ధి చేసింది. సంఘ్ పరివార్ నాయకులను గవర్నర్లుగా నియమించి, భిన్నమైన పార్టీల రాష్ట్ర ప్రభుత్వాల మీద నిఘాకూ, వేధింపులకూ, ఒత్తిడికీ, క్షుద్ర రాజకీయాలకూ వాడుకుంటున్నది.

ఆ క్రమంలోనే తమిళనాడులోని ద్రవిడ మున్నేట్ర కళగం ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి రవీంద్ర నారాయణ్ రవి అనే మాజీ పోలీసు అధికారి, భావజాలపరంగా సంఘ్ పరివార్ కార్యకర్తను అక్కడికి గవర్నర్ గా పంపారు. 2021లో ఆయన అక్కడికి చేరినప్పటి నుంచీ చెన్నై రాజ్ భవన్ ను సంఘ్ పరివార్ కార్యకలాపాల కేంద్రంగా మార్చడం మాత్రమే కాదు, ఎన్నికైన డిఎంకె ప్రభుత్వ చర్యలకు, విధానాలకు అడుగడుగునా అడ్డు తగలడం ప్రారంభించాడు. శాసనసభ ఆమోదించిన బిల్లుల మీద గవర్నర్ సంతకం చేస్తేనే అవి చట్టాలుగా మారుతాయనే రాజ్యాంగ నిబంధనను అడ్డు పెట్టుకుని, శాసనసభ పంపిన బిల్లుల మీద సంతకం చేయకుండా తాత్సారం చేయడం మొదలుపెట్టాడు.

రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ముందు బిల్లును ఆమోదించడం, బిల్లును తిరస్కరిస్తూ, సవరణలు సూచిస్తూ శాసనసభకు, ప్రభుత్వానికి వెనక్కి తిప్పి పంపడం, సలహా కోరుతూ రాష్ట్రపతికి పంపడం అనే మూడు అధికారాలు మాత్రమే ఉన్నాయి. ఆమోదించడానికి గానీ, తిరస్కరించి తిప్పి పంపడానికి గానీ రాజ్యాంగం నిర్ణీత గడువు విధించలేదు గాని, "వీలయినంత త్వరగా" అని రాసింది. ఈ మాటకు అర్థం ఏమిటో ఇంతవరకూ న్యాయస్థానాలు కూడా వివరించలేదు.

తమిళనాడు ప్రభుత్వం పంపిన పది బిల్లులను గవర్నర్ ఆర్ ఎన్ రవి మూడు సంవత్సరాల పాటు తొక్కిపెట్టాడు. సంతకం చేయలేదు. తిప్పి పంపలేదు. ఒకవేళ తిప్పి పంపితే, దాన్ని శాసనసభ, మార్పులు చేసి గాని, యథాతథంగా గాని మళ్లీ ఆమోదించి పంపితే అప్పుడు గవర్నర్ సంతకం చేయక తప్పదు అని కూడా రాజ్యాంగంలో ఉంది గనుక, ఆర్ ఎన్ రవి తిప్పి పంపడం కూడా చేయలేదు.

మూడు సంవత్సరాలు వేచి చూసిన తర్వాత తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ, వాదప్రతివాదాలు జరుగుతుండగా గవర్నర్ ఆ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. రాష్ట్రపతి దగ్గర కూడా ఆ బిల్లులు నెల రోజులు వేచి చూస్తుండగా, ఏప్రిల్ 8న జస్టిస్ జె బి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ల ద్విసభ్య ధర్మాసనం ఒక చరిత్రాత్మకమైన, సంచలనాత్మకమైన తీర్పు ఇచ్చింది. శాసనసభ ఆమోదించిన బిల్లుల మీద సంతకం చేయకుండా, తిప్పి పంపకుండా తాత్సారం చేయడం సరికాదని, ఇంతకాలం గడిచింది గనుక ఆ బిల్లులు సంతకం అయినట్టే భావించాలని ప్రకటించింది. ఇకనుంచి గవర్నర్, రాష్ట్రపతి బిల్లుల మీద సంతకం పెట్టడానికి, తిప్పి పంపడానికి మూడు నెలల నిర్ణీత గడువు ఉండాలని ఆదేశించింది.

ఒక రకంగా ఆ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ అధికారం మీద అవసరమైన దెబ్బ. ఆ తీర్పు నిజమైన సమాఖ్య స్వభావానికి చిహ్నం. ఒక రాష్ట్రంలో ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఒక శాసనం చేయడానికి అధికారం కలిగి ఉన్నారా లేదా, వారి ఆ అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించిన గవర్నర్ అడ్డుకోవచ్చునా అనే కీలకమైన ప్రశ్నలకు ఆ తీర్పు ఒక సముచితమైన సమాధానం. ఆ తీర్పు కేవలం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి సవాల్ ఎంత మాత్రమూ కాదు. కేంద్రంలో ఏ పార్టీ అయినా అధికారానికి రావచ్చు. రాష్ట్రాలలో వేరే పార్టీలు అధికారానికి వస్తే, వారిని వేధించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే అధికారాన్ని మాత్రమే ఆ తీర్పు ప్రశ్నించింది.


కాని, ఈ తీర్పును భారతీయ జనతా పార్టీ తన అధికారం మీద ప్రశ్నగా భావించింది. ఆ తీర్పు వచ్చిన నెల లోగా, రాష్ట్రపతి కార్యాలయం నుంచి సుప్రీం కోర్టుకు, ప్రధాన న్యాయమూర్తికి పద్నాలుగు ప్రశ్నల లేఖ వచ్చింది. ఆ లేఖకు జవాబు ఇచ్చే క్రమంలో తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం కూడా తమ వాదనలు వినిపించాయి. ఆ వాదనలన్నీ విని సుప్రీం కోర్టు సెప్టెంబర్ 7న తీర్పు రిజర్వ్ చేసింది. ఈ గురువారం నాడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయి, న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి ఎస్ నరసింహ, జస్టిస్ ఎ ఎస్ చందూర్కర్ ప్రకటించిన ఈ తీర్పు రాజ్యాంగంలోని 200, 201, 361 అధికరణాలను పాటిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ వాస్తవంగా అన్యాయంగా, సమాఖ్య స్వభావానికి విరుద్ధంగా, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకు వ్యతిరేకంగా, రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ సాగింది.

బిల్లు మీద సంతకం పెట్టదలచుకోకపోతే గవర్నర్ దాన్ని వెనక్కి తిప్పి పంపాలని ఈ తీర్పు మాటవరుసకు చెప్పింది గాని, ఎంత సమయంలో ఆ పని చేయాలో చెప్పే అధికారం న్యాయస్థానానికి లేదని అంది. మంత్రి మండలి సలహా మీద గవర్నర్ పని చేయాలి అనే రాజ్యాంగపు ఆదేశానికి, ఆ సలహాను తప్పకుండా పాటించాలని అర్థం చెప్పలేమని, గవర్నర్ తన విచక్షణ ప్రకారం పని చేయవచ్చునని ఆ తీర్పు అంది. బిల్లులు సంతకం అయినట్టే అనే మాట అనడానికి న్యాయస్థానానికి అధికారం లేదని అంది. గవర్నర్, రాష్ట్రపతి తీసుకునే చర్యలను ప్రశ్నించే, సమీక్షించే అధికారం న్యాయస్థానానికి లేదని అంది. గవర్నర్ చర్యలు, రాష్ట్రపతి చర్యలు న్యాయవ్యవస్థ పరిధికి మించినవని, న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడానికి వీలు లేనివని (నాట్ జస్టిసియబుల్) అంది.

ఈ సాంకేతిక చట్టపరమైన భాషను మామూలు భాషలోకి అనువదిస్తే, ఈ దేశంలో గవర్నర్, రాష్ట్రపతి అనే రెండు పదవుల్లో ఉండేవారు ఏమి చేసినా అడగడానికి, సమీక్షించడానికి న్యాయవ్యవస్థకు కూడా అధికారం లేదని సుప్రీం కోర్టు చెప్పిందన్నమాట! అధికరణం 361లో సుప్రీంకోర్టు అభిప్రాయానికి ఆధారం ఉన్నమాట నిజమే. కాని ఆ అధికరణాన్ని కూడా సమీక్షించే, సవరించే, వ్యాఖ్యానించే అధికారం సుప్రీం కోర్టుకు ఉంటుంది. ఇప్పుడు సందర్భం వచ్చినప్పుడైనా ఆ పని చేయకుండా సుప్రీంకోర్టు తన బాధ్యత నుంచి తప్పుకుంది.


'రాష్ట్రపతి, గవర్నర్, రాజప్రముఖ్ ల రక్షణ' అనే అధికరణం 361 నుంచి 1956లో రాజప్రముఖ్ అనే మాటను తొలగించి యథాతథంగా ఉంచారు గాని అది ఒక అన్యాయమైన, అప్రజాస్వామికమైన, నిరంకుశమైన అధికరణం. అది రాజ్యాంగ ప్రవేశికలో చెప్పిన పౌరులందరి మధ్య సమానత్వం అనే భావనకు, అధికరణం 14లో చెప్పిన చట్టం ఎదుట పౌరులందరి సమానత్వం అనే సూత్రానికి పూర్తిగా వ్యతిరేకం. కేవలం మధ్యయుగ రాచరిక పాలనలలో మాత్రమే చక్రవర్తికి, రాజుకు అటువంటి ప్రశ్నాతీత అధికారం ఉండేది. అటువంటి నిరంకుశ అధికారాన్ని ఒక ఆధునిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యంలో రెండు పదవులకు ఇవ్వడం నిరంకుశత్వం తప్ప మరేమీ కాదు.

ఇప్పుడు అధికారంలో ఉన్న సంఘ్ పరివార్ కు రాష్ట్ర ప్రభుత్వాలను తొక్కివేయడానికి ఈ తీర్పు అవసరమని అనిపించి ఉండవచ్చు. కాని, ఈ దేశపు బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని, వాటి వల్లనే రూపొందిన సమాఖ్య స్వభావాన్ని ధ్వంసం చేసే తీర్పు ఇది. అంటే రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్నే కూలదోసే తీర్పు ఇది.



ఎన్ వేణుగోపాల్
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# నిత్య జీవితంలో తత్వశాస్త్రం, జ్ఞాన మీమాంస




సాధన ద్వారా పొందిన జ్ఞానం అధ్యయనం ద్వారా పెరిగే జ్ఞానంఅవకాశాలు మరియు శిక్షణ ద్వారా అభివృద్ధి చెందే సామర్థ్యాలు

ఇటీవలి కాలంలో, నిర్వహణ నైపుణ్యాలు మరియు వ్యక్తిత్వ వికాసంపై పుస్తకాలు "స్వయం సహాయ సిరీస్" అపారమైన ప్రజాదరణ పొందాయి. సివిల్ సర్వీసెస్, గ్రూప్ పరీక్షలు మరియు ఇంటర్మీడియట్ తర్వాత ప్రవేశ పరీక్షల కోసం లెక్కలేనన్ని పుస్తకాలు మరియు కోచింగ్ కేంద్రాలు పుట్టుకొచ్చాయి. ఇవన్నీ కలిసి దేశవ్యాప్తంగా లక్షల కోట్ల టర్నోవర్ను సృష్టిస్తాయి. ఎంపికైన తర్వాత, అభ్యర్థులు IAS, IPS, బ్యాంక్ మేనేజ్మెంట్ మొదలైన రంగాలలో ప్రత్యక్ష, ఉద్యోగ శిక్షణ పొందుతారు. వారికి నిజమైన, ఆచరణాత్మక పనులు కేటాయించబడతాయి. ఉపాధ్యాయ శిక్షణలో, ఒకరు వాస్తవానికి పాఠాలు బోధించాలి మరియు సామర్థ్యాన్ని ప్రదర్శించాలి. ఒకరు ఎంత చదివినా, చివరికి ప్రత్యక్ష అభ్యాసం తప్పనిసరి అవుతుంది.

అభ్యాసం ద్వారా జ్ఞానం అంచెలంచెలుగా పెరుగుతుంది

కొంతమంది వ్యక్తులు సర్పంచ్గా ప్రారంభమై, పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ఎదిగి, ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కూడా అయ్యారు. ఐదవ తరగతితో అధికారిక విద్య ఆగిపోయిన పుప్పాల ఆశాలు భవన నిర్మాణ కార్మికుడిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, ఇళ్ల నిర్మాణం కోసం కాంట్రాక్ట్ పనులు చేపట్టి, క్రమంగా ప్రధాన కాంట్రాక్టర్గా ఎదిగి, చివరికి జగిత్యాల మునిసిపాలిటీ చైర్మన్ అయ్యారు. చాలా మంది ఉన్నత విద్యావంతులు ఆయన నాయకత్వంలో పనిచేశారు.

"అందే శ్రీ" కి అంత తక్కువ చదువు కూడా రాలేదు. వ్యక్తిగత కృషి ద్వారా, అతను గొప్ప కవి (మహాకవి), ప్రజా కవి (లోక కవి) మరియు తెలంగాణ రాష్ట్ర గీత రచయితగా ఎదిగాడు. కోట్లాది మంది విద్యావంతులు ఇప్పుడు ఆ గీతాన్ని భక్తితో పాడుతున్నారు. అవకాశం వచ్చినప్పుడే బంగారం తనను తాను వెల్లడిస్తుందిఅవకాశాలు వచ్చినప్పుడే సామర్థ్యాలు పెరుగుతాయి. ఉద్యమాలు మరియు అవకాశాల వల్లనే గద్దర్, గూడ అంజయ్య, బిఎస్ రాములు, గోరటి వెంకన్న మరియు అందె శ్రీ ఎదగగలిగారు. ఉద్యమాలు లేదా ఇతర అవకాశాలు లేకుండా, అనుభవం లేదా పెరుగుదల సాధ్యం కాదు. కలెక్టర్గా పనిచేయకుండా ఐఏఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ద్వారా కలెక్టర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోలేరు. ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం పొందకుండా ముఖ్యమంత్రి అనుభవం మరియు సామర్థ్యాలను పొందలేరు. ఎవరైనా ఆ పాత్రను పోషిస్తే, అది కేవలం నటనగానే ఉంటుంది – వాస్తవం కాదు.

### జ్ఞాన ప్రవాహం X నిలిచిపోయిన నీటి

పాఠాలు, నైపుణ్య శిక్షణలు మరియు కదలికలు అన్నీ ఆచరణాత్మక పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. అయినప్పటికీ, సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం, ప్రేమలో పడటం, శారీరక సాన్నిహిత్యం, ప్రసవం లేదా మాతృత్వం గురించి ఒకరు ఎంత చదివినా లేదా సినిమాలు చూసినా లేదా ఇతరులను గమనించినా – చివరికి, ఇవి ప్రత్యక్ష వ్యక్తిగత అనుభవం ద్వారా మాత్రమే నిజంగా తెలుసుకోగల విషయాలు.

ఒక వ్యక్తి "నాకు తగినంత తెలుసు" అని అనుకుని అక్కడే ఆగిపోతే, వారు ఆ స్థానంలోనే చిక్కుకుపోతారు. తక్కువ జ్ఞానమే సర్వస్వం అని వారు నమ్మితే, వారిని "బావిలో కప్ప" అని పిలుస్తారు. ప్రజలు అలాంటి సగం కాల్చిన జ్ఞానాన్ని ఉపరితలం అని పిలుస్తారుబీ ప్రాపంచిక జ్ఞానం మరియు చాకచక్యం లేని వారిని అర్థం తెలియని అమాయకులు లేదా "రెక్కలు లేని చెదపురుగులు" అని పిలుస్తారు.

### జ్ఞానం అనేక రూపాల్లో మరియు ప్రవాహాలలో వస్తుంది

. ఈ విధంగా, జ్ఞానం అనేక విధాలుగా పొందబడుతుంది. దేశవ్యాప్తంగా ప్రయాణం మరియు విద్యా ప్రయాణాలు మనస్సును విశాలం చేస్తాయి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మరియు శిక్షణా కేంద్రాలు ప్రపంచం అప్పటి వరకు సేకరించిన జ్ఞానం మరియు అనుభవాలను అందిస్తాయి. పుస్తకాలు మరియు సాహిత్యం మేధో వృద్ధి, జ్ఞానం మరియు ఇంద్రియ అవగాహనను పెంపొందిస్తాయి. ఒక వ్యక్తి గ్రహించే సామర్థ్యం ఎంత ఎక్కువగా పెరుగుతుందో, అవి అంతగా పెరుగుతాయి. సామర్థ్యం పెరగకపోతే, ఒక శక్తివంతమైన నది నుండి కూడా ఒక గ్లాసు నీరు మాత్రమే తీసుకోవచ్చు.

### ప్రత్యక్ష జ్ఞానం, పరోక్ష జ్ఞానం

ప్రత్యక్ష జ్ఞానం (ప్రత్యక్ష జ్ఞానం) లేకుండా, పరోక్ష జ్ఞానం (పరోక్ష జ్ఞానం) ఉండదు. ఒక వ్యక్తి పొందిన ప్రత్యక్ష జ్ఞానం ఇతరులకు పరోక్ష జ్ఞానంగా మారుతుంది. సాధన మరియు చర్య ద్వారా పొందిన జ్ఞానం ప్రత్యక్ష జ్ఞానం. బోధన మరియు అధ్యయనం ద్వారా పొందిన జ్ఞానం పరోక్ష జ్ఞానం.

ప్రత్యక్ష జ్ఞానం ప్రత్యక్ష అనుభవంతో పుడుతుంది. పరోక్ష జ్ఞానంలో ప్రత్యక్ష అనుభవం మరియు వ్యక్తిగత ఇంద్రియాలు ఉండవు. ప్రత్యక్ష జ్ఞానం అనుభవాలు, భావాలు మరియు అంతర్గత ప్రతిస్పందనలతో నిండి ఉంటుంది.

సాహిత్యం, కళలు, సినిమా మరియు నాటకం ప్రత్యక్ష అనుభవంగా భావించి నిజమైన భావోద్వేగ ప్రతిస్పందనలను ఉత్పత్తి చేసే పరోక్ష జ్ఞానాన్ని సృష్టించగలవు, అయినప్పటికీ అది ఇప్పటికీ పరోక్ష జ్ఞానంగానే ఉంటుంది.

తెలుసుకునే ప్రక్రియ (జ్ఞాన ప్రక్రియ లేదా "ఎరుక క్రమం") ఇంద్రియాల ద్వారా పొందిన అనుభూతులు, భావాలు మరియు అనుభవాల ద్వారా మాత్రమే ప్రారంభమవుతుంది – సాంప్రదాయకంగా ఐదు (పంచేంద్రియాలు), కానీ వాస్తవానికి ఎనిమిది (అస్తేంద్రియాలు) లేదా అంతకంటే ఎక్కువ.

ప్రత్యక్ష జ్ఞానం ఓడిపోయి పరోక్ష జ్ఞానం విజయం సాధించినప్పుడు, పరాయీకరణ, ఆధిపత్యం మరియు పాలక అధికార నిర్మాణాలు పుడతాయి.

### భారతీయ, పాశ్చాత్య జ్ఞానశాస్త్ర స్రవంతి

వేల సంవత్సరాలుగా, భారతదేశంలో అనేక జ్ఞాన సిద్ధాంతాలు ఉద్భవించాయి. గ్రీకు తత్వశాస్త్రం మరియు భారతీయ తత్వశాస్త్రం సమాంతర పోటీలో పెరిగాయి. పాశ్చాత్య తత్వశాస్త్రం గ్రీకు రచనలను మొదట అరబిక్లోకి మరియు తరువాత యూరోపియన్ భాషలలోకి అనువదించడం ద్వారా ముందుకు సాగింది. కాంట్, హెగెల్, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో మరియు ఇతరులు ఈ పాశ్చాత్య సంప్రదాయంపై మరింత నిర్మించారు. వారు భారతీయ తత్వశాస్త్రం, భారతీయ జ్ఞాన సిద్ధాంతాలు, బౌద్ధ తర్కం లేదా బౌద్ధ జ్ఞానశాస్త్రాన్ని ఎప్పుడూ తాకలేదు. భారతదేశంలో, నక్సలైట్లు, మావోయిస్టులు, %ఝా×% మరియు CPIM ఈ పాశ్చాత్య తాత్విక మరియు జ్ఞానశాస్త్ర చట్రాలను గట్టిగా అంటిపెట్టుకున్నారు.

### జ్ఞానం యొక్క కొన్ని సిద్ధాంతాలు


మావో పోరాటం ద్వారా చైనా ప్రజలను సమీకరిస్తున్నప్పుడు, అతను సోవియట్ రష్యన్ పాఠ్యపుస్తకాల నుండి "ఆన్ కాంట్రాడిక్షన్" మరియు "ఆచరణపై" అనే రెండు అధ్యాయాలను తీసుకొని, వాటిని అనువదించి, అనేక కొత్త అంశాలను జోడించి, వాటిని అసలు వ్యాసాలుగా మార్చాడు. పీపుల్స్ వార్ పార్టీ (PWG) ఈ రెండు వ్యాసాలకు అపారమైన ప్రాముఖ్యతను ఇచ్చిందిబీ వాటిని పదేపదే అధ్యయనం చేసి చర్చించారు.

1960లలో, రష్యా మరియు చైనా మధ్య విభేదాలు తీవ్రమైనప్పుడు, ప్రసిద్ధ "గ్రేట్ డిబేట్" తొమ్మిది ప్రధాన పత్రాలను రూపొందించింది. ఈ రెండు వ్యాసాలు కూడా పరస్పర విమర్శలకు గురయ్యాయి. జ్ఞాన సిద్ధాంతంపై కూడా తీవ్రమైన పోరాటం జరిగింది.

జ్ఞానశాస్త్రం విషయంలో, రష్యా మరియు చైనా రెండు శిబిరాలుగా విడిపోయాయి. పీపుల్స్ వార్ పార్టీ మావో జ్ఞాన సిద్ధాంతాన్ని స్వీకరించి వైరుధ్య నియమాన్ని ప్రాథమికంగా ప్రకటించింది. రష్యన్లు విభేదించారుబీ వారు వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారు. వ్యక్తిని ప్రాథమికంగా చేసినందుకు మావో సిద్ధాంతాన్ని వారు విమర్శించారు. సామాజిక ఉనికిలో భాగంగా వ్యక్తిగత స్పృహ అభివృద్ధి చెందుతుందని రష్యన్లు చెప్పారు (మార్క్స్ చెప్పినట్లుగా). కమ్యూనిస్ట్ సమాజంలో రాష్ట్రం క్షీణిస్తుందని మార్క్స్ అంచనా వేశాడు. ఆ రాష్ట్రం నిర్మూలించబడుతుందని మావో చెప్పాడు.

దీనికి విరుద్ధంగా, మార్క్స్, సామాజిక స్పృహ వ్యక్తిగత స్పృహలో భాగంగా అభివృద్ధి చెందుతుందని మావో చెప్పాడు. తరగతిలో ఒకే పాఠం బోధించినప్పుడు కూడా, కొంతమంది విద్యార్థులు 100 మార్కులు సాధిస్తారు, మరికొందరు విఫలమవుతారు – ఇది విద్యార్థుల స్థాయి

తరువాయి సంచికలో..



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## ప్రకృతి నుండి మనిషిని దూరం చేస్తే

# భవిష్యత్తు అంధకారమే!

మనిషి ఉనికిలో ఆది నుండి చివరి వరకూ ప్రకృతి ఒక అస్తిత్వాధార శక్తి. ఆహారం, నీరు, గాలి, నివాసం, జీవవైవిధ్యం, ఋతు చక్రాలు ౧ ఈ అన్నింటి మూలం ప్రకృతి. అయితే ఆధునిక రాష్ట్రాల విధానాలు, లాభాల పట్ల మొగ్గుచూపే అభివృద్ధి నమూనాలు, వనరులపై నియంత్రణకు ప్రయత్నించే శక్తి రాజకీయాలు పర్యావరణాన్ని మనిషి నుండి వేరు చేయడానికి దారితీశాయి. ప్రకృతి మనిషికి శ్వాసను ఇస్తే, రాజ్యం దాన్ని లాభదాయక వస్తువుగా చూస్తోంది. ఈ విరుద్ధ దృక్పథం భూమిని మాత్రమే కాదు, మనిషి భవిష్యత్తునే ప్రమాదంలోకి నెడుతోంది.



ప్రస్తుతం జరుగుతున్న ప్రకృతి వినాశనంతో ప్రజల ఆరోగ్యానికి, ఉపాధికి, ఆర్థిక స్థిరత్వానికి తీవ్రమైన నష్టం కలుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ప్రకృతి విపత్తుల వల్ల మొత్తం జనాభాలో దాదాపు 3.3 బిలియన్ మంది ౧ అంటే ప్రపంచ జనాభాలో సుమారు 42% మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నష్టపోతున్నారు అని ఐపీసీసీ నివేదిక పేర్కొంటుంది. భారతదేశంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వరదలు, ఎండబార్లు, అకాల వర్షాలు, ఉష్ణోగ్రతల తీవ్రత, గాలి కాలుష్యం, నేల హ్రాసం ఇవన్నీ కలిసి దేశ జనాభాలో సుమారు 60% మందిని ప్రభావితం చేస్తున్నాయి. వ్యవసాయ ఆధారిత మన దేశంలో ప్రకృతి మార్పుల ప్రభావం మొదట రైతులపై పడుతుంది. భారత వ్యవసాయదారుల్లో 70% మంది వాతావరణ మార్పుల వల్ల ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్నారు, 50% మందికి పైగా పంటలు తగ్గడం లేదా పూర్తిగా నష్టం చెందడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.ప్రకృతి నుండి మనిషికి లభించే వనరులు అమోఘమైనవి. త్రాగునీరు నుంచి గాలి వరకు, వ్యవసాయానికి అవసరమైన నేల నుంచి వర్షాలు వరకు, అడవుల్లోని ఔషధ మొక్కల నుంచి అడవి జంతువుల వరకు, నదుల నుంచి సముద్రాల వరకు ౧ ప్రతి జీవికి అవసరమైన ఏ మూలవనరైనా ప్రకృతి ఆస్తే. ప్రపంచ పర్యావరణ వనరుల విలువను ఐక్యరాజ్యసమితి సుమారు 125 ట్రిలియన్ అమెరికన్ డాలర్లుగా అంచనా వేసింది. భూమి మీద ఉన్న జీవరాశి 100% ప్రకృతిపైనే ఆధారపడుతోంది. భారతదేశానికి లభించే ముఖ్య ప్రకృతి వనరుల్లో 23% అటవీ కవర్, 4% తాజా నీటి వనరులు, 17% సాగు భూమి, 7,500 కి.మీ తీరరేఖ, 20% ఖనిజ వనరుల సామర్థ్యం ఉన్నాయి. ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక వ్యవస్థకు సుమారు 30–35% ప్రత్యక్ష ఉత్పాదక విలువనిస్తోంది.

ఈ వనరులను నాశనం చేయడం వల్ల కలిగే నష్టం ఊహించని విధంగా తీవ్రం. అటవీ నాశనం దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.5 బిలియన్ టన్నుల మట్టిని గాలికి, వర్షానికి కొట్టుకుపోయేలా చేస్తోంది. ఇది వ్యవసాయ ఉత్పత్తిని కనీసం 20–25% వరకు తగ్గిస్తోంది. గాలి కాలుష్యం వల్ల భారతదేశంలో సంవత్సరానికి 16 లక్షల మంది ముందస్తుగా మరణిస్తున్నారు. నీటి కాలుష్యం వల్ల దాదాపు 7 కోట్ల మంది ప్రమాదంలో ఉన్నారు. నదుల పరుపు తగ్గడం, వర్షాల అస్థిరత, వృక్ష సంపద తగ్గడం, జంతు జీవనం క్షీణించడం ౧ ఇవన్నీ భూగర్భ జలాలు 40%–%60% మేర తగ్గడానికి దారితీశాయి. నేల నాణ్యత క్షీణత వల్ల వ్యవసాయ భూమిలో సుమారు 29% ప్రాంతం బీడుబారిన నేలగా మారిపోతుంది. సహజ వనరుల వినాశనం భారత ఆర్థిక వ్యవస్థకు సంవత్సరానికి సుమారు 5.7% జిడిపి నష్టం కలిగిస్తోంది.

ఇలా ప్రకృతిపై దాడులు కొనసాగిస్తే భవిష్యత్తు అంధకారమే. ప్రకృతి తనపై దాడి చేసినప్పుడు ప్రతీకారం తీసుకోదు, కానీ ప్రతిఫలం చూపిస్తుంది. వేడిగాలులు, వరదలు, అకాల వర్షాలు, తుఫానులు, కరువు, భూమి చిట్లిపోవడం ౧ ఇవన్నీ ప్రకృతి ప్రతిస్పందనలు. శ్వాస కోసం గాలి లేకపోతే, నీటి కోసం నదులు లేకపోతే, ఆహారం కోసం నేల లేకపోతే మనిషి నాగరికత ఎంత శక్తివంతమైనా నిలబడలేదు. ప్రకృతి మనకోపం చూపితే మనిషి నిలువునా దహించిపోతాడు. ఇది హెచ్చరిక మాత్రమే కాదు, నిజమైన ప్రమాదం. ఈ దిశలోనే శాస్త్రవేత్తలు చెబుతున్నారు ౧ ప్రస్తుతం ఉన్న ధోరణిలో వనరులు దెబ్బతింటే 2050 నాటికి భారతదేశ జనాభాలో 45% మంది నీటి, ఆహార, పర్యావరణ సంక్షోభంలో అడుగుపెడతారు.

ప్రకృతి మనిషి జీవనానికి అవిచ్ఛిన్నమైన ఆధారం. అయితే ఆధునిక పాలన వ్యవసాయం, అటవీ, నదులు, గాలి, నేల వంటి సహజ వనరులను లాభాల దృష్టితో మాత్రమే చూసే పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి నుండి మనిషిని వేరు చేయడం అనేది అతని శ్వాసనుండి విడిపించడమే అని అర్థం చేసుకోని వ్యవస్థలు విధ్వంసపథంలో నడుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి నష్టంతో దాదాపు 42% జనాభా ప్రభావితమవుతుండగా, భారతదేశంలో అయితే సుమారు 60% మంది వాతావరణ మార్పుల వల్ల ప్రత్యక్షంగా నష్టపోతున్నారు. వ్యవసాయం ఆధారంగా జీవించే ప్రజల్లో 70% మంది ప్రకృతి అస్థిరత వల్ల ఆదాయ నష్టం, పంట వైఫల్యం, నీటి కొరత వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వనరుల విలువ ప్రపంచవ్యాప్తంగా 125 ట్రిలియన్ డాలర్లకు పైగా ఉండగా, వీటిని నాశనం చేయడం దేశ ఆర్థిక వ్యవస్థకు సుమారు 5.7% జిడిపి నష్టాన్ని కలిగిస్తోంది. గాలి కాలుష్యం వల్ల భారతదేశంలో ప్రతి సంవత్సరం 16 లక్షల మంది మరణిస్తుండగా, నేల హ్రాసంతో 29% ప్రాంతాలు బీడుగావుతున్నాయి. అటవీ నాశనం కారణంగా 1.5 బిలియన్ టన్నుల మట్టి సంవత్సరానికి పోతుండటం వ్యవసాయం మరియు జీవవైవిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ప్రకృతి నాశనం భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని శాస్త్రవేత్తల హెచ్చరికలు స్పష్టంగా చెబుతున్నాయి. మానవ చర్యలు మారకపోతే 2050 నాటికి ప్రజల్లో 45% మంది నీటి–ఆహార–పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటారని అంచనాలు సూచిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో అడవుల తొలగింపు, నదుల మార్పు, గనుల పేలుళ్లు, చెట్ల నరికివేత, నియంత్రణలేని పరిశ్రమల విస్తరణ ౧ ఇవన్నీ తిరుగులేని నష్టాలకు కారణం అవుతున్నాయి. ప్రకృతి మనిషి శ్వాస, నీరు, ఆహారం, జీవవైవిధ్యం, ఋతు చక్రం యావత్తూ మనిషి భవిష్యత్తును నిర్ణయించే శక్తి. దానిని కాపాడడం అంటే మనల్ని మనమే కాపాడుకోవడం. ఇప్పుడు వ్యవస్థలు మారకపోతే రానున్న తరాలకు శాంతి, ఆరోగ్యం, ఆహారం అన్నీ సంక్షోభాలుగా మారతాయి. ప్రకృతి మనిషిని నిలువునా దహించేప్పుడు దాని ముందు ఏ అధికారం, ఏ అభివృద్ధి, ఏ సంపద నిలబడదు.

ఈ నిజం గ్రహించకపోతే మన భవిష్యత్తు చీకటి లోయలోకి జారిపోతుంది.అందుకే ఈ సమయంలో పాలకులు మాత్రమే కాదు ప్రజలంతా ప్రకృతిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలి. అభివృద్ధి పేరుతో అడవులను తొలగించడం, నదులను మార్చడం, గనుల కోసం పర్వతాలను పేల్చేయడం, నగరాల్ని విస్తరించడానికి చెట్లను నరికేయడం, పరిశ్రమలను మోతాదుకన్నా ఎక్కువగా నిర్మించడం ౧ ఇవన్నీ తిరుగులేని నష్టాన్ని మిగుల్చుతాయి. ప్రకృతిని కాపాడే విధానాలు కేంద్రంగా పెట్టని పాలన భవిష్యత్తును కాల్చేసే నిప్పుకుండే. ఇప్పటికైనా మార్పు రాకపోతే రానున్న తరాలు శ్వాసించే గాలి కూడా విషం అవుతుంది.

ప్రకృతిని పరిరక్షించడం అంటే మనిషి జీవితాన్ని కాపాడుకోవడం. ప్రకృతి పతనాన్ని ఆపడం అంటే భవిష్యత్తుకు వెలుగు చూపడం. ఇది మానవతకు సంబంధించిన శాశ్వత బాధ్యత. అది మరిచి ముందుకు నడిస్తే మనం నడిచేది చీకటినే.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలి

- సిఐటియు వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్

**తాండూరు, నవంబర్ 22 (జనంసాక్షి) :** కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్ ల అమలుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో తాండూర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ జిల్లా సహాయ కార్యదర్శి సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి టీ శరణప్ప మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులని హరించే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లని తీసుకువచ్చి కార్పొరేట్లకు పెట్టుబడుదారులకు యజమానులకు కార్మికుల



శ్రమ దోసి పెట్టే విధంగా 8 గంటలనుండి 12 గంటల పని విధాన్ని తీసుకొచ్చి, కార్మికుల యొక్క కడుపు కొడుతూ తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించకుండా, గుర్తింపు కార్మిక సంఘాలతో చర్చించకుండా, కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా చట్టాలను హక్కులని రద్దు చేయడం తీవ్రంగా ఖండించారు .అదేవిధంగా కార్మిక వ్యతిరేక చట్టాలకు లేబర్ రైతు వ్యతిరేక విధానాలు ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా నవంబర్ 26న సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూర్ నియోజకవర్గ ఇన్చార్జి సాదిక్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే రాములు. వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, కార్యదర్శి వెంకటేష్, సిఐటియు తాండూర్ నాయకులు కృష్ణ, గ్రామపంచాయతీ కార్మిక నాయకులు షబ్బీర్, హరీఫ్, రామకృష్ణారెడ్డి, కార్మికులు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు ఆటో డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ధర్నా




**అల్వాల్, నవంబర్ 22 (జనంసాక్షి) :** ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర పిలుపుతో అల్వాల్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక కోడ్‌లను ఉపసంహరించాలంటూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను శాశ్వతీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని కోరారు. 26వ తేదీన రాష్ట్ర సిడిఎంఏ వద్ద రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్, మహేందర్ తదితరులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**రాజేంద్రనగర్, నవంబర్ 22 (జనంసాక్షి) :** శంషాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రూ. 5 కోట్ల వ్యయంతో హెచ్ఎండిఏ నిధులతో నిర్మించనున్న 50 పడకల హాస్పిటల్ భవనానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అలాగే ఐజిఆర్ఎస్ నిధులతో ఎయిర్‌పోర్ట్ కాలనీ- కొత్వాల్ గూడ ల మధ్య నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హాస్పిటల్ పూర్తయ్యే సరికి శంషాబాద్ పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త రహదారి ప్రజల రాకపోకలను సులభతరం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుమన్ రావు, మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, మాజీ చైర్ పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, అధ్యక్షుడు సంజయ్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్ట్‌పై అడ్డంకులు తొలగిస్తున్నాం

- మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, నవంబర్ 22 (జనం సాక్షి) :** గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్నీ ప్రధాన అడ్డంకులు తొలగుతున్నాయని, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు వేగవంతం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జలసౌధలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గౌరవెల్లి ప్రాజెక్ట్‌పై జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ప్రాంత రైతాంగానికి శాశ్వత ప్రయోజనం చేకూర్చే గౌరవెల్లి ప్రాజెక్ట్‌పై నెలకొన్న లీగల్ సమస్యను సుప్రీం కోర్టు ఇటీవల పరిష్కరించడం ముఖ్యమైన ముందడుగు అని తెలిపారు. ప్రాజెక్ట్‌లో నీటిని నిల్వ చేయడం, కాలువలు తవ్వడం కోసం కావలసిన భూసేకరణ, నిధుల కేటాయింపులపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి అంగీకారం తెలిపారని చెప్పారు. ప్రాజెక్ట్‌లో పునరావాసానికి సంబంధించిన 55 ఎకరాల భూభాగంపై ఇంకా సమస్య ఉన్నప్పటికీ, సంబంధిత కుటుంబాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వద్దకు తీసుకువచ్చి సమస్యను వివరించామని, వారికి త్వరలోనే పరిష్కారం కల్పిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కాలువల కోసం భూసేకరణలో రైతులు సహకరించాలని కోరుతూ, పనులు వేగవంతం చేస్తే గ్రామ గ్రామానికీ గౌరవెల్లి నుండి గోదావరి నీళ్లు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఇప్పటికే బండ్ పనులు పూర్తయ్యాయని, ఇక కాలువల తవ్వకం పూర్తి చేస్తే వ్యవస్థ మొత్తం సిద్ధం కానుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పరంగా అన్ని అంశాలు వెంటనే పరిష్కరించే దిశగా తన కార్యాచరణ కొనసాగుతోందని మంత్రి పునరుద్ఘాటించారు. లక్ష ఎకరాలపైగా ఆయకట్టు కలిగిన ఎత్తైన పీఠభూమిలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. "వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్ట్‌ను గత పది సంవత్సరాలుగా కేవలం హామీలతోనే కొనసాగించిన కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. ఎవరినీ నిందించకుండా, మా మాట ప్రకారం ఈ ప్రాంత రైతాంగానికి గౌరవెల్లి నీళ్లను అందించేందుకు కట్టుబడి ఉన్నాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## బుల్కాపూర్ నాలా పరిరక్షణపై బీఆర్ఎస్ నేతల ఆందోళన



**రాజేంద్రనగర్, నవంబర్ 22 (జనంసాక్షి) :** శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన బుల్కాపూర్ నాలా జన్వాడ నుంచి మణికొండ వరకు 22 కిలోమీటర్ల మేర విస్తరించి మూసీ నదికి కలుస్తుందని బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో ప్లకార్డులు చేత్తో పట్టుకొని అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల సర్వే ప్రకారం నాలా అనేక ప్రాంతాల్లో కబ్జాలకు గురైనట్లు బయటపడిందని, మణికొండలో అధికారుల నిర్లక్ష్యంతో నాలా పరివాహక ప్రాంతంలో హైరైజ్ భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారనే విషయంపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలా మూసుకుపోతే భవిష్యత్తులో మణికొండ, పంచవటి కాలనీ, సెక్రెటేరియట్ కాలనీ, అల్కాపూర్, నెక్నంపూర్ తదితర ప్రాంతాలు వరద ముప్పుకు గురయ్యే అవకాశముందని, ఈ నేపథ్యంలో నాలాపై ఉన్న కబ్జాలను తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మణికొండ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, గుట్ట మీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి,అందే లక్ష్మణ్, యాలాల కిరణ్, భానుచందర్, మహమ్మద్ అరీఫ్, సుమ నళిని బొడ్డు శ్రీధర్, బిందు రేఖ, రమేష్, షకీలా తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, నవంబర్ 22 (జనంసాక్షి) :** మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో తాండూర్ మండలం వారికి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలకు నాసిరకం చీరలను అంటగడితే వాటిని రైతులు అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు పొలాలకు కంచెల మాదిరిగా వాడుకునేలా మిగిలిపోయాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల చేనేత వారి వద్ద నాణ్యమైన చీరలను తయారు చేసి పంపిణీ చేస్తోందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మహిళ శక్తి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, గృహజ్యోతి వంటి తదితర సంక్షేమా పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మహిళ సంఘాల ద్వారా కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. మహిళలు ముందుకు వస్తే కందిపప్పు, రైస్ మిల్లను ఏర్పాటు చేసుకునేందుకు తోడ్పాటు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, డీసీసీబీ జిల్లా వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఉత్తమ్ చంద్, మండల పార్టీ అధ్యక్షులు జన్నె నాగప్ప, ఎం పీడీఓ విశ్వప్రసాద్, తహసిల్దార్ తారాసింగ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, విజయ భాస్కర్ రెడ్డి, గడ్డం -నర్సిరెడ్డి, ఉప్పరి రాజు, ఏపీఎం బాలయ్య, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి భావాలను బలోపేతం చేయాలి

- మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్



**మహేశ్వరం, నవంబర్ 22 (జనంసాక్షి) :** యువతలో దేశభక్తి భావాలను బలోపేతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు.వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మహేశ్వరం మండలం మన్సాన్ పల్లి చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదిష్ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ... వందేమాతరం గీతం భారత స్వాతంత్ర పోరాటానికి ప్రేరణ ఇచ్చిందన్నారు. జాతీయత, దేశభక్తిని కాపాడటానికి బీజేపీ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి,నాయకులు కుండే వెంకటేష్, వనంపల్లి శ్రావణ్, ఉపేందర్, దేవేందర్ నాయక్, మల్లేష్ యాదవ్, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలకు సొంత భవనాలు నిర్మించండి



**చేవెళ్ల, నవంబరు 22 (జనంసాక్షి) :** చేవెళ్ల నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని భాజపా చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. 2016లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించినప్పటికీ, ఇప్పటికీ వీటికి పక్కా భవనాలు నిర్మించక అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో గురుకులాలకు సొంత భవనాలు నిర్మించిన ప్రభుత్వం, చేవెళ్లలో మాత్రం నిర్లక్ష్యం వహించడం ఆశ్చర్యకరమని అనంతరెడ్డి ప్రశ్నించారు. అద్దె భవనాల్లో కనీస విద్యా%-%వసతి సౌకర్యాలు లేక పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గురుకులాల అభివృద్ధిపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చీర శ్రీనివాస్, పెద్దోళ్ల మహేందర్, పత్తి సత్యనారాయణ, బండారి చంద్రశేఖర్ రెడ్డి, అల్లాడ అభిశేఖర్ రెడ్డిలు ఉన్నారు.

## మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**వెల్దండ, నవంబర్ 22 (జనంసాక్షి) :** మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ప్రధానంగా అమలవుతున్న పథకాలలో ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఆదర్శ పాఠశాలలో మహిళ అధ్యక్షురాల నియామకం, ఆర్టీసీ బస్సుల కొనుగోలు లో మహిళా సమాఖ్యల భాగస్వామ్యం, వడ్డీ రహిత రుణాలు , ఈ కార్యక్రమాల ద్వారా మహిళలను ఆర్థికంగా స్వావలంబన ,సామాజికంగా బలపర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కమిటీ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట.వెంకటయ్య గౌడ్ ,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఎర్ర శీను ముదిరాజ్, మండల సూపరిండెంట్ మోహన్ లాల్, కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, గుద్దేటి కిష్టాల్, మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేసిన ఎమ్మెల్యే



**మల్దకల్, నవంబర్ 22 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి డిసెంబర్ 6 వరకుజరగనున్న జాతర బ్రోచర్లను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. గద్వాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు,ఈఓ సత్య చంద్రారెడ్డిఎమ్మెల్యేను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నడిగడ్డ భక్తులే కాక ఇతర రాష్ట్రాల నుండి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా త్రాగునీరు పరిశుభ్రత బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి,సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, ప్రభాకర్ రెడ్డి,సత్యరెడ్డి, మధుసూదన్ రెడ్డి,చక్రధర్ రెడ్డి,వీరన్న, సీతారాంరెడ్డి,గడ్డంకృష్ణారెడ్డి, చంద్రశేఖరరావు,నరేందర్ నాయకి మధు,వెంకటన్న, సవరన్న,నారాయణ,వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల ముఠా అరెస్ట్

- ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లక్ష యాభై వేల నగదు స్వాధీనం
- ఆటో, ద్విచక్ర వాహనాలు, లాప్టాప్, మొబైల్ ఫోన్స్ సీజ్
- దువ్వగడ్డ తాండ కేంద్రంగా సైబర్ క్రైమ్
- మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి వెల్లడి




**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 22 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి సమీప దూరంలో ఉన్న పువ్వగడ్డ తాండ కేంద్రంగా సైబర్ నేరం జరగడం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది. ఫేక్ ధనలోన్ యాప్స్ ఇస్తామని నమ్మవలసిన ముఠా కలకత్తాలో శిక్షణ పొందినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నారు. దాదాపు వెయ్యి మంది అమాయకుల నుండి రూపాయలు మూడు కోట్ల వరకు ఘరానా మోసం చేసిన ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ జానకి మాట్లాడుతూ ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులను అభినందించారు. ఇతర శిలకు వివార్డు ప్రకటించారు. సైబర్ నిరాకాండ ఉచ్చులో పడిన బాధితుడైన వాకిటి వంశీకృష్ణ 2 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ ఫిర్యాదు ఆధారంగా సైబర్ నేరగాళ్ల కోపి లాగిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. ధన ఫైనాన్స్ పేరుతో కనిపించిన ప్రకటన నమ్మి తన పాన్ కార్డు, ఆధార్ కార్డ్ అప్లోడ్ చేయగా నిందితులు వాటిని డౌన్లోడ్ చేసి నకిలీ ఫేక్ లోన్ మంజూరు రూపొందించి పంపారు. లోన్ మంజూర అయిందంటూ బాధితుడికి నిందితులు ఫోన్ చేసి ప్రాసెసింగ్ ఫీజు ఇన్సూరెన్స్ జీఎస్టీ మొదటి ఇఎంఐ పేర్లతో మొత్తం 75 వేల రూపాయలు తీసుకున్నట్లు ఎస్పి తెలిపారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.లోతుగా దర్యాప్తు చేసిన తర్వాత ఏడుగురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. మామ్ నగర్ రూరల్ మండల పరిధిలోని తువగడ్డ తాండకు చెందిన జర్పుల సురేందర్, కాట్రావత్ హనుమంతు, వర్త్య రాజా, భాస్కర్, కాట్రావత్ నరేష్, రత్నావత్ సంతోష్, రాత్లవత్ సోమల, మీరంతా ఒక గ్యాంగ్ గా ఏర్పడి సైబర్ నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సాంకేతిక విశ్లేషణ ద్వారా నిందితులను అరెస్టు చేసి డిమాండ్ కి పంపిస్తున్నట్లు ఎస్పి జానకి పేర్కొన్నారు. సైబర్ నేరాల ముఠా గుట్టు రట్టు చేసిన వారిలో పోలీస్ అధికారులైన అడిషనల్ ఎస్పీ ఎన్వి రత్నం, సిఐలు ఎజారుద్దీన్ గాంధీ నాయక్, రత్నం, ఎస్సైలు విజయ్ కుమార్, రవి ప్రకాష్ చంద్రమోహన్ శ్రావణ్ కుమార్, సిబ్బంది సాయి మహేందర్ మహేష్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23 నవంబర్ 2025

# మహిళా ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ లక్ష్యం

- కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా చర్యలు
- గ్రామ గ్రామాన ఇందిరమ్మచీరల పంపిణీ కార్యక్రమం
- ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని, మహిళా ఆర్థిక స్వావలంబనను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలలో మహిళలను భాగస్వామ్యం చేస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి జంగమయ్యపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పనులు చేపట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు, ఆదర్శ పాఠశాలలో మహిళా అధ్యక్షురాలు, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడం, ఆర్టిసి బస్సుల కొనుగోలులో మహిళా సమాఖ్యల భాగస్వామ్యం, వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు వసతి మెస్ చార్జీల పెంపు లాంటి అనేక పథకాలను మహిళలకు ఉపయోగపడే విధంగా అనునిత్యం మహిళా అభ్యున్నతి కోసం



ప్రభుత్వం పాటుపడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ క్రమంలోనే ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రం లోని కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. సొంత కూతురికి, సొంత చెల్లెలికి విలువ ఇవ్వకుండా మాట్లాడే బిఆరెస్ నాయకులు నేడు నీతులు వల్లించడం విడ్డూరమన్నారు. పదేళ్ల కాలంలో మహిళలను పట్టించుకోని పట్టించుకోని నాయకులు నేడు గ్రామాల్లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించి తనకు బలంగా నిలవాలని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి సులభం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే వారు అభివృద్ధికి ఆటంకాలుగా మిగులుతారని ఏ ఒక్కరికి అవకాశం ఇవ్వకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప,మాజీ జడ్పిటిసి లు వెంకటస్వామి, రమేష్ గౌడ్, వేణుగోపాల్, నాయకులు మణిగిల్ల తిరుపతి రెడ్డి, శ్రీశైలం యాదవ్, మహిళా సమాఖ్య సభ్యురాలు అధికారులు దళితులు పాల్గొన్నారు.

### పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శనివారం చిట్యాల శివారులోని ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన చిన్నారి హవీష సాయి మొదటి పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. వనపర్తి మున్సిపల్ మాజీ వైస్ పాకనాటి కృష్ణయ్య మనవరాలు మొదటి పుట్టినరోజును ప్రత్యేక నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పిల్లల ముఖ్యమైన రోజులను ఈ విధంగా నిర్వహించుకోవడం వారి జీవితంలో గుర్తుండిపోతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, లక్కాకుల సతీష్, మంచి కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి

- కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, నవంబర్ 22 (జనం సాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని మహిళా సమైక్య భవనంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. మహిళల సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. గ్రామాలలోని ప్రతి ఆడబిడ్డకు చీరలు అందిస్తామని మంత్రి సీతక్క ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చీరలు పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుదలతో ఉందని తెలిపారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట నాణ్యతతో లేకుండా 200 రూపాయల చీర పంపిణీ చేసిందని కానీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కో ఆడబిడ్డకి 800 రూపాయలతో నాణ్యతతో కూడిన చీరలు పంపించేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ చీరల పంపిణీ కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ గుమకొండ రాములు, మాజీ కౌన్సిలర్లు గోరేటి శ్రీనివాసులు, ఏజాస్, మాజీ సర్పంచ్ దామోదర్ గౌడ్, వివిధ గ్రామాల మహిళా సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో రోడ్ల మరమ్మతు చేపట్టండి

- అదనపు కలెక్టర్ కు బిజెపి వినతి




**నారాయణపేట, నవంబర్ 22 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో అధ్వాన్నంగా తయారైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని బిజెపి నాయకులు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ,బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య,పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి నక్క సత్య నారాయణ,ఓబీసీ సెల్ కన్వీనర్ ఉమాకాంత్ మాట్లాడుతు పట్టణంలోని సెంటర్ చౌక్, సరాఫ్ బజార్,శివాజీ నగర్,పళ్ల రోడ్డు పూర్తిగా ధ్వసం అయిందని వాహనాలు కాదుకదా ప్రజలు నడిచి వెళ్ళే పరిస్థితి లేదనీ తెలిపారు. వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు. అదనపు కలెక్టర్ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌పై అవగాహనా కల్పించండి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 22 (జనం సాక్షి) :** ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ ఆప్స్, సైబర్ క్రైమ్స్ గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. శనివారం నారాయణఖేడ్ నియోజకవర్గంలోని సిర్గాపూర్ పోలీసు స్టేషన్ ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డ్ లను తనిఖీ చేస్తూ.. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి గ్రామాన్ని సందర్శించి, మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలలో అవగాన కల్పించాలని ఎస్.హెచ్.ఓ కు సూచనలు చేశారు. సరిహద్దు ప్రాంతాల నుండి ప్రభుత్వ నిషేధిత గంజాయి, అక్రమ మద్యం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్ట్ లను నిర్వహిస్తూ నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాలలో, ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యస్.హెచ్.ఓ కు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంట నారాయణఖేడ్ డియస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సిఐ వెంకట్ రెడ్డి ఉన్నారు.

# యువజనోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) :** జిల్లాలోని యువత తమలో దాగి ఉన్న కళను ప్రదర్శించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు జిల్లా స్థాయి ,యువజనోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శనివారం యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనవరి, 12న జరిగే స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాల్లోని యువత కళను వెలికి తీసి ఉత్తమంగా రాణించిన కళాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పంపించేందుకు నిర్వహిస్తున్న యువజనోత్సవ కార్యక్రమంలో ఫోక్ డ్యాన్స్, చిత్ర లేఖనం, పాటలు, వక్తృవ, ఉపన్యాస పోటీలు తదితర 7 రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని అలుపెరగకుండా సాధన వైపు దూసుకెళ్లాలని సూచించారు. జిల్లాలోని యువత తమ అత్యుత్తమ కళా ప్రదర్శన ద్వారా డిసెంబర్ లో జరిగే రాష్ట్ర స్థాయి, జనవరి 12న జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవ వేడుకల్లో రాణించి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉన్న ఇండోర్ స్టేడియాన్ని యువత సద్వినియోగం చేసుకొని, శారీరక దృఢత్వంతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అధికారి సుధీర్ రెడ్డి యువజనోత్సవాల ప్రాధాన్యతను యువతకు వివరించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డిప్యూటీ కలెక్టర్ శ్రావ్య, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్, పి.డి సురేందర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే యువత తగిన వ్యాయామాలు చేస్తూ, క్రీడలు ఆడుతూ ఆరోగ్యంగా స్ఫూర్తివంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం ఆత్మకూరు మండలం, మూలమల్ల గ్రామంలో దేశాయి సరళాదేవి లక్ష్మా రెడ్డి క్రీడా ప్రాంగణంలో జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణా తరగతులకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అదేవిధంగా కబడ్డీ క్రీడాకారులు ఆటలు ఆడేటప్పుడు దుమ్ము తగలకుండా, గాయాలపాలు కాకుండా జిల్లా కలెక్టర్ నిధులతో బహూకరించిన నూతన సింథటిక్ మ్యాట్ ను వినియోగంలోకి తెచ్చారు. ఒకరోజు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించి వెంటనే యువజన క్రీడల అధికారిని పంపించి క్రీడాకారులకు కావలసిన మౌలిక సదుపాయాల పై నివేదిక కోరగా వారి నివేదిక మేరకు సింథటిక్ మ్యాట్ మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రణాళికబద్ధంగా బోధించాలని కలెక్టర్ అధ్యాపకులను ఆదేశించారు. శనివారం ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలకు మంజూరు చేసిన నిధుల నుండి విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, విద్యా బోధనల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి సుధీర్ రెడ్డి, ఆత్మకూరు తహసిల్దార్ చాంద్ పాషా, ఎంపీడీఓ, గ్రామ పెద్దలు, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లు వెంటనే రద్దు చేయాలి

- నోటిఫికేషన్ కాపీలు దగ్ధం చేసిన సిఐటియు నాయకులు
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్



**సదాశివపేట, నవంబర్ 22 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ అమలు చేస్తామని విడుదల చేసిన నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని , కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు ఆఫీస్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ కాపీలను నేడు దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుంది అన్నారు. అనేక సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడుదాలకు అనుకూలంగా తయారు చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు నర్సింలు ,కృష్ణమూర్తి, హరికృష్ణ, మోహన్ చారి ,శ్రీనివాస్ మూర్తి, నాగరాజు చౌదరి, మహేష్, రుక్కమ్మ, లక్ష్మి ,మొగులమ్మ పాల్గొన్నారు.

## చెరుకు రైతులను ఆదుకోండి

**సదాశివపేట, నవంబర్ 22 (జనం సాక్షి) :** చెరుకు రైతులను ఆదుకొని, వారి సమస్యలను పరిష్కరించాలని చెరుపు రైతు నాయకులు కోరారు. శనివారం మెదక్ ఎంపీ సురేష్ షెట్కర్, తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలికల సదుపాయన సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి లతో కలిసి ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబులు కలిసి చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని, రైతు పక్షపాతి అయినటువంటి రాష్ట్ర ప్రభుత్వం చెరుకు రైతులకు టన్నుకు 500 బోనస్ ప్రకటించి, యాంత్రికరణ, హార్వెస్టర్ డ్రీప్ పరికరాల సబ్సిడీ అందించే నిర్ణయాన్ని చెరుకు రైతులకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. చెరుకు రవాణా సమయంలో టోల్గేట్ల వద్ద రుసుము మాఫీ చేయాలని, సీడీసీలకు సొంత భవనాల నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, చెరుకు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## మత్స్య సహకార సంఘం భవన నిర్మాణానికి కృషి

- మంత్రి వాకిటి శ్రీహరి



**మాగనూర్, నవంబర్ 22 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ముదిరాజ్‌ల మత్స్య సహకార సంఘం భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని మత్స్య,పాడి పరిశ్రమ, క్రీడలు యువజన శాఖా మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి మత్స్య సహకార సంఘం భవన నిర్మాణానికి కృషి చేయాలని ముదిరాజ్‌లు మంత్రిని కలిసి విన్నవించారు. అందుకు స్పందించిన మంత్రి త్వరలోనే శంకుస్థాపన చేసి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభం చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మాగనూర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షులు పూంజనూర్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు దండు ఆనంద్, ప్రధాన కార్యదర్శి గడ్డం నరేష్ (బివియన్), సంఘం డైరెక్టర్ దండు బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, నవంబర్ 22 (జనంసాక్షి) :** వచ్చే నెల డిసెంబర్ 1 వ తేదిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ కు విచ్చేయుచున్న సందర్భంగా రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం మక్తల్ లో సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. డిసెంబర్ 1వ తేదీన ముఖ్యమంత్రి మక్తల్ మండలంలోని గొల్లపల్లి శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన, భూమిపూజ చేసే దాదాపు 20 ఎకరాలలోని స్థలాన్ని మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. అలాగే కాట్రేపల్లి వద్ద మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు భూమిపూజ, మక్తల్ నుంచి నారాయణ పేట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సీఎం భూమిపూజ చేయనున్నారు. ఆయా పనులకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. అనంతరం మక్తల్ తహసిల్దార్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి సీఎం మక్తల్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. గొల్లపల్లి వద్ద సీఎం హెలిప్యాడ్ ఏర్పాట్లను చూసుకోవాలని ఆర్ అండ్ బీ



అధికారులకు సూచించారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమి పూజ ఏర్పాట్లు, అక్కడి నుంచి సీఎం బై రోడ్ నుంచి వస్తారని, రహదారి పొడవునా భద్రత, రహదారుల వెంబడి చెట్ల పొదలు తొలగించాలని చెప్పారు. కాట్రేపల్లి వద్ద మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పై లాన్ ఏర్పాటు, ఆ తర్వాత మక్తల్ – నారాయణపేట బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ ఏర్పాట్లపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. భూమిపూజ అనంతరం ముఖ్యమంత్రి మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారని, ఆలయం వద్ద ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. గొల్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ కు సీఎం హాజరు అవుతారని, బహిరంగ సభకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చే ప్రజాప్రతినిధులు, ప్రజల వాహనాలను నిలిపేందుకు అవసరమైన స్థలాన్ని, వీఐపీల వాహనాల పార్కింగ్, మైక్ సెట్, ఎల్ ఈ డీ తెరల ఏర్పాటు, బహిరంగ సభకు అవసరమైన మిగతా ఏర్పాట్లపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి మినిట్ టూ మినిట్ పర్యటన షెడ్యూల్ ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనలో ఎక్కడా ప్రోటోకాల్ తప్పవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్, ఎస్ డి సి రాజేందర్ గౌడ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, డిఆర్డిఏ మొగులప్ప, ఇరిగేషన్ ఎస్ ఈ శ్రీధర్, ఆర్ అండ్ బి ఈఈ వెంకట రమణయ్య, పంచాయత్ రాజ్ ఈ ఈ హిర్యా నాయక్, విద్యుత్తు శాఖ ఎస్.ఈ. వెంకటరమణ, డీ. వై.ఎస్.ఓ వెంకటేష్, డీపీఆర్ ఓ రషీద్, మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రగతిపై ప్రతివారం సమీక్ష

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రగతిపై ప్రతివారం సమీక్ష ఉంటుందని, గతవారం సమీక్షలో చేసిన సూచనల మేరకు, ఈ వారం సాధించిన పురోగతిని సమీక్షించుకోవడం జరుగుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పంట కాలువలకు భూసేకరణ, ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రగతిపై శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మెగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కాలువల నిర్మాణానికి ఎంత భూమి అవసరం ఉంది, ఎంత మంది రైతులు భూములు కోల్పోతున్నారు, ఎన్ని ఎకరాలు అవసరం అవుతుందనే అంశాలపై సమగ్రంగా వివరించారు. సర్వేలో ప్రభావిత గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల వారీగా భూ వివరాలు, పంటలసాగుపై స్పష్టమైన అవగహన కలిగి ఉండాలని సూచించారు. పంట కాలువల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా సాగేందుకు, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్డీసి రమేష్, మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాల తహసీల్దార్లు, మెగా కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

### పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

10వ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం ఐడిఓసి సమావేశ మందిరంలో 10వ తరగతి ఫలితాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు, యుడైస్, ఆధార్, అపార్ జారీ, పాఠశాలల్లో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరం జిల్లాస్థాయిలో 93.55 శాతం ఫలితాలు సాధించామని, ఈ సంవత్సరం నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని మెరుగుపరచడానికి ప్రతి పాఠశాలలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు ప్రస్తుతం 68.30 శాతం మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉంటే విద్యార్థుల హాజరు ఎలా పెరుగుతుందని అని ప్రశ్నించారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు 62 శాతంగా ఉండటంతో, దీన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్లస్టర్ స్థాయి సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి, వివరాలను తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. గత నెల జరిగిన సమావేశంలో 32 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్మెంట్ ఉందని, ప్రస్తుతం వాటికి అదనంగా 7 పెరిగి 39 అయ్యాయని పేర్కొంటూ, తగ్గాల్సిన సంఖ్య పెరగడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన 943 పనులకు 634 పనులు పూర్తి అయ్యాయని, సంవత్సరన్నర కాలం గడిచినా ఇంకా ఎందుకు పెండింగ్ ఉన్నాయని సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తెచ్చి నెల రోజుల్లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనంగా ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు ప్రతి పాదనలు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఇందిరమ్మ చీరలు పంపిణీ



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 22 (జనం సాక్షి) :** హనుమకొండ మహిళా సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ లోని హరిత కాకతీయ కాన్ఫరెన్స్ హాలులో మహిళా ఉన్నతి -తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళా శక్తి, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్ పర్తి, ఐనవోలు మండలాలకు చెందిన చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఎంపీ కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఇందిరా గాంధీ అంటేనే ఉక్కు మహిళా అని పేర్కొన్నారు. ఇందిరమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో మహిళలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన చేసుకుంటూ ముందుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిందన్నారు. హసన్ పర్తి, ఐనవోలు మండలాలకి చెందిన మహిళా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చీరలు చాలా బాగున్నాయని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ కో ఆపరేటీవ్ బ్యాంక్ రాష్ట్ర ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, డీఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, హసన్ పర్తి, ఐనవోలు మండలాల ఎంపీడీవోలు సుమన వాణి, నర్మద, ఇతర అధికారులు, హసన్ పర్తి, ఐనవోలు మండలాల మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి
- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఫాక్స్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య



**మల్హర్, నవంబర్ 22(జనం సాక్షి) :** రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవా లని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, ఫాక్స్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. శనివారం తాడిచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొయ్యూరు, వల్లెంకుంట, ఎడ్లపల్లి, కొండం పేట, గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి కలిసి పిఎసిఎస్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ సన్నాలకు రూ 500 రూపాయల బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్, ఎడ్ల నారాయణ, కో ఆప్షన్ మెంబర్ కటకం శ్రీనివాస్ , మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం పోచయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బడితల రాజయ్య, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లకావత్ సవేందర్, తాజా మాజీ సర్పంచ్ రమేష్, మండల వ్యవసాయ అధికారిని బొల్లపెల్లి శ్రీజ పాల్గొన్నారు.

# మున్సిపల్ సఫాయి కార్మికుడు మృతిపై పెల్లుబికిన నిరసన

- న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయానికి మృతదేహం
- భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఉద్రిక్తత
- పోలీసుల లాఠీచార్జి
- మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో విధులకు వెళ్లిన ఓ సఫాయి కార్మికుడు ఆకస్మికంగా మృతి చెందడంపై ఒక్కసారిగా నిరసనలు పెల్లుబికాయి.. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.. మృతుని కుటుంబసభ్యులు, బంధువులు భారీగా చేరుకొని, మృతదేహాన్ని కలెక్టరేట్‌కు తరలించి ఆందోళనకు దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి, లాఠీచార్జి చేశారు.. జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి మున్సిపాలిటీలో సఫాయి కార్మికునిగా పనిచేస్తున్న బొల్లి రాజయ్య(45) శనివారం విధులకు వెళ్లి చెట్లు నరికి వేస్తుండగా కిందపడి మృతి చెందాడు. సఫాయి కార్మికుడు రోజు లాగానే ఉదయం విధుల్లోకి వెళ్ళగా సఫాయి పనులు కాకుండా చెట్లు కొట్టేందుకు వెళ్లాలని మున్సిపల్ సిబ్బంది ఆదేశించడంతో రాజయ్య ఒక్కడే ఆరవగని యాదవ కాలనీలో కట్టర్ తో చెట్లను నరికి వేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశత్తు రాజయ్య కిందపడి మృతి చెందాడు. స్థానికుల సహకారంతో ఈ విషయం కుటుంబసభ్యులు, బంధువులకు తెలియడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రాజయ్య మృతదేహాన్ని భూపాలపల్లిలోని వందపడకల ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుని బంధువులు సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, కుడుజుల వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు గండ్ర హరీష్ రెడ్డి, మురళీధర్ తదితరులు అక్కడికి చేరుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక మృతుడి బంధువులు, వామపక్షాల నాయకులు ఆసుపత్రి నుండి పక్కనే ఉన్న కలెక్టర్ కార్యాలయానికి మృతదేహాన్ని ట్రక్చర్ పై తరలించుకు వెళ్లారు. రాజయ్య మృతికి అధికారులే కారణమని జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయంలో నిరసనకు దిగడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలిసి జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డిఎస్పి సంపత్ రావు, తమ సిబ్బందితో వచ్చి బాధితులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా శాంతించలేదు. దీంతో పోలీసులు కలెక్టర్ కార్యాలయంలో శవాన్ని తరలించి ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని లాటిచార్జి చేస్తూ కొంతమందిని అదుపులోకి తీసుకెళ్లారు. అనంతరం మెయిన్ గేట్ ముందు మృతుని కుటుంబ సభ్యులు బంధువులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. చివరికి అధికారులు మృతుని కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు రాజయ్యకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

# కోతుల తరిమి కొట్టడానికి రైతుల వినూత్న ఆలోచన



**పాలకుర్తి, నవంబర్ 22 (జనంసాక్షి)** జనగామ జిల్లా,పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామ రైతు అర్కల సమ్మయ్య తాను వేసిన మూడు ఎకరాల మొక్కజొన్న. వేరుశెనగ పంటను కోతులు గుంపుగా వచ్చి నాశనం చేస్తున్నాయని. చేతిలో కుక్కను పట్టుకొని పులి బొమ్మ. పులి వేషధారణతో కోతులను తరిమి కొడుతున్నాడు. రైతుల కష్టాలను ఎవరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని. కష్టపడి పండించిన పంట మొత్తం కోతుల పాలవుతుందని. నానాటికి కోతుల సంఖ్య పెరుగుతుందని రైతు వాపోయాడు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి. కోతుల బారి నుండి రైతులను కాపాడాలని విన్నవించారు.

# అర్హులందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**దస్తురాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పేరిట చీరలు పంపిణీ చేస్తున్నామని, నియోజకవర్గంలో చీరలు పంపిణీ మొట్టమొదట దస్తురాబాద్ మండలంలో ఎంపిక చేసుకున్నామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు ఇస్తామని స్పష్టం చేశారు.మహిళా సంఘాలలో లేని వారికి కూడా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 200 యూనిట్లకు ఉచిత విద్యుత్,ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత బస్సు సౌకర్యం,ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంచడం జరుగుతుంది అని ఆయన అన్నారు. నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు.స్వంత ఇంటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, నియోజకవర్గంలో నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్, పీఏసీఎస్ ఛైర్మన్ శైలజ రమేష్ రావ్, పడిగేలా భూషణ్, తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతో పాటు ప్రకృతి పట్ల అవగాహన పెంచాలి



**ఆత్మకూరు, నవంబర్ 22 (జనం సాక్షి):** విద్యార్థులకు విద్యతో పాటు ప్రకృతి పట్ల అవగాహన పెంచి చిన్ననాటి నుండి చెట్లను నాటడమే గాక వాటిని పరిరక్షణ చేసే బాధ్యత కూడా వారిదేనని, వనాలు మన పాలిట వరాలు అనే సందేశాన్ని ఇచ్చే చిత్రమే “కలివి వనం”అని ప్రముఖ సామాజికవేత్త ప్రకృతి ప్రేమికులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. రసాయనాలు వాడి పండించిన పంటలు మానవ శరీరానికి హానిక చేస్తాయని అదే సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని చేయాలని సందేశాన్ని కూడా దర్శకులు అద్దం పట్టేలా చిత్రంలో చూపించాలని, వనాల్ని పెంచడమే కాక వాటిని రక్షించుకునే బాధ్యత కూడా ప్రజలందరి పై ఉందని చిత్రంలో అద్భుతంగా చిత్రీకరించాలని, ఇందులో నటించిన బాల నటుల నటన అద్భుతంగా ఉందని ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి ప్రోత్సహించాలని ఆయన అన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక రాయితీపై ఈ చిత్రాన్ని ప్రదర్శించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- ఇంటింటికి ఇందిరమ్మ చీర
- ఇందిరమ్మ ఉక్కు సంకల్పం ప్రతి మహిళలో ఉండాలి
- ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలి
- ములుగు, వెంకటాపూర్, గోవిందరావు పేట తాడ్వాయి మండలాల్లో మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, నవంబర్ 22(జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వం రాష్ట్రం లోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని, ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతీఅని, మహిళలు వ్యాపార రంగంలో రాణించడానికి వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. శనివారం ములుగు, వెంకటాపూర్, గోవిందరావు పేట తాడ్వాయి మండలాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ లతో కలిసి మంత్రి సీతక్క మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. అనంతరం ములుగు మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 370 సంఘాలకు నలభై ఆరు కోట్ల యాభై లక్షల రూపాయల ఋణాల చెక్కను అందచేయడంతో పాటు 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను మంత్రి అందచేశారు. అనంతరం వెంకటాపూర్ మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 195 సంఘాలకు ఇరువై ఆరు కోట్ల యాభై లక్షల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు. అనంతరం వెంకటాపూర్ మండల పరిధిలోని 43 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/ షాది ముభారక్ చెక్కులను మంత్రి అందచేశారు. అనంతరం గోవిందరావు పేట మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 283 సంఘాలకు ఇరువై తొమ్మిది కోట్ల ఎనభై ఆరు లక్షల యాభై వేల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు. అనంతరం తాడ్వాయి మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 120 సంఘాలకు ఎనిమిది కోట్ల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు. అనంతరం తాడ్వాయి మండల పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/ షాది ముభారక్ చెక్కులను మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిర మహిళా శక్తి సంఘాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజు నుంచి కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయాలని సంకల్పించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంఘాలలో మొత్తం 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, రాబోయే రోజుల్లో సంఘాలలో కోటి మందిని పెంచి వారిని కోటీశ్వరులను చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించుకుందని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను గౌరవించాలి, మహిళల్ని కాపాడాలి, మహిళలను ఆర్థికంగా ఎదిగించే విధంగా సహాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇన్సూరెన్సులు, వంటి అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, పిఎస్ సి ఎస్ ఛైర్మన్లు సత్తి రెడ్డి, రాములు, డిఆర్డీఓ శ్రీనివాస్ రావు, ఏపిడి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

- నూతన ఎస్పీగా శ్రీ నితిక పంత్



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 22 ( జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు అధికారిగా శ్రీ నితిక పంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా 32 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు శ్రీ ని తిక పంత్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇక్కడ జిల్లాపోలీసు అధికారిగా విధులు నిర్వహించిన కాంతిలాల్ పార్టీలను కాంతిలాల్ పాటిల్ ను కేవలం 5 నెలల వ్యవధిలోనే ట్రాన్స్ఫర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ మొదటి ప్రాధాన్యంగా పేర్కొన్నారు. అసాంఘిక శక్తులను సహించలేదని, బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# పటేల్ నాయకత్వ లక్షణాలను పునికి పుచ్చుకోవాలి


- మహారాష్ట్ర రాజ్యసభ సభ్యులు అనిల్ సుఖ్‌దేవ్ రావ్ బోండే




**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) :** మై భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా యూనిటీ మార్చ్ ను ఎన్టీఆర్ స్టేడియం నుండి కోర్టు వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో 500 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర రాజ్యసభ సభ్యుడు అనిల్ సుఖ్‌దేవ్ రావ్ బోండే హాజరై మాట్లాడుతూ పటేల్ దూర చూపుతోనే దేశం ఐక్యంగా ఉన్నదని, సుమారు 562 సంస్థానాలను స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో విలీనం చేసిన ఘనత పటేల్ కు దక్కుతుందని అన్నారు. యువత పటేల్ నాయకత్వ లక్షణాలను పుణికిపుచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నేటి యువత పటేల్ ను స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలి, పటేల్ దేశానికి చేసిన సేవలను గురించి వాలంటీర్లు అవగాహన తెలుసుకోవాలని అన్నారు.

# జిల్లాలో మరింత చురుకుగా పోలీసు సేవలు

- అదనపు ఎస్పీ పి మౌనిక



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లా అదనపు ఎస్పీగా పీ మౌనిక శనివారం తన పదవీ బాధ్యతలను చేపట్టారు. బదిలీలో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏసీపీగా విధులు నిర్వహించి ఆదిలాబాద్ అదనపు ఎస్పీ పరిపాలన గా బదిలీ అయిన పి మౌనిక పోలీసు ముఖ్య కార్యాలయం లో అదనపు ఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పోలీసు విధులను మరింత చురుకుగా జరిగేలా చర్యలు చేపడతామని తెలియజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23 నవంబర్ 2025

## మహిళలు స్వయం సహాయక శక్తి గ్రూపుల్లో చేరాలి



**చంద్రుగొండ, నవంబర్ 22 (జనం సాక్షి) :** మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో చేరటం ద్వారా ప్రభుత్వ పథకాలు అందుకోగలుగుతారని ప్రతి ఒక్కరు స్వయం సహాయ శక్తి సంఘాల లో చేరి ప్రభుత్వం అందించే రుణాలను అందిపుచ్చుకోవాలని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలియజేశారు. శనివారం చంద్రుగొండ మండలం తుంగారంలో ఇందిరా గాంధీ ఇందిరా చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని స్వశక్తితో ఎదగాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అనేక పథకాలను అమలు చేస్తూ తన మార్కు పాలన అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో తెలంగాణ దూసుకుపోతుందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాలలో స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు,తాసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్,ఏపిఎం శ్రీనివాసరావు, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, నల్లమోతు వెంకటరమణ, ఫజల్ బక్ష్, బొర్రా సురేష్, చిట్టెం శెట్టి మహేష్,రాముడు తదితరులు పాల్గొన్నారు.


# గ్రామాల్లో మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి

- ఏ నోట విన్నా రిజర్వేషన్లపై జోరుగా చర్చ

**కొండమల్లేపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి) :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు చేసింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. కులగణన ఆధారంగా వార్డు సభ్యుల ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. కులగణన ఆధారంగా బీసీలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్లు ఇస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లను ఆర్డీఓలు ఖరారు చేయనున్నారు. సాధారణంగా పదవులు అంటే ఎంతో గౌరవప్రదంగా ఉంటాయి. చిన్న పదవి నుంచి పెద్ద పదవులను ప్రతిష్టాత్మకంగా తీసుకునేవారు ఎందరో ఉంటారు. గ్రామ సర్పంచ్ పదవికి అంతే ప్రాధాన్యత ఉంటుంది. గ్రామాల అభివృద్ధికి సర్పంచుల పదవి ఎంతో కీలకం. గ్రామ పంచాయతీలకు సర్పంచులను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. సర్పంచుల పదవీ కాలం ఐదేళ్లు. సర్పంచ్ కావాలనే తాపత్రయం చాలా మందిలో ఉంటుంది. గ్రామాల్లో సర్పంచ్ గా గెలవాలని ధనిక, పేద, తండా, గ్రామం, పట్టణం అనే భేదం లేకుండా విపరీతంగా ఖర్చులు పెడుతూ ఉచిత హామీలు కురిపిస్తుంటారు. కొండమల్లేపల్లి మండలంలో 27 గ్రామాలకుగాను 27 మంది సర్పంచులు అయ్యే అవకాశం ఉంది. మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచులుగా కావాలనే ఆశతో ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పంచాయతీ, వార్డుల్లో ఏ రిజర్వేషన్ వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఉప ఎన్నికలో బిజీ బిజీగా ఉన్న నాయకులు ఇకనుంచి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కాక తప్పడం లేదు. ఎన్నికల సమయం రోజు రోజుకూ దగ్గర పడుతుండడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే యువతను మచ్చిక చేసుకోవడానికి విందులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏమవ్వా బాగున్నావా.. ఏం తాత బాగున్నావా.. మీ ఇంట్లో పెన్షన్స్ వస్తున్నాయా.. పిల్లల చదువులు ఎలా ఉన్నాయి.. మీ ఆరోగ్యం బాగుందా.. అంటూ ఆప్యాయతతో పలకరింపులు మొదలయ్యాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రం ఒక్కో ఓటుకు రూ.2 వేల నుంచి 5 వేలు ఖర్చు చేయడానికి నేతలు తగిన వనరులను సమకూర్చుకుంటున్నట్లు సమాచారం.

### సర్పంచ్ అభ్యర్థికి కావలసిన అర్హతలు

గ్రామ పంచాయితికి పోటీ చేసే వ్యక్తి భారతదేశ పౌరుడై ఉండాలి. అదే పంచాయితిలో ఓటు హక్కును కలిగి ఉండాలి. 21 సంవత్సరాలు నిండి ఉండాలి. గ్రామ పంచాయతికి




సర్పంచితో పాటు ఎన్నుకోబడిన మెంబర్లలో ఒకరిని ఉపసర్పంచిగా ఎన్నుకుంటారు. ఉపసర్పంచిని మెజారిటీ పరంగా మెంబర్లే ఎన్నుకుంటారు, ఇద్దరు పిల్లలు ఉన్న వారికే సర్పంచ్ పదవి అర్హత. ముగ్గురు పిల్లలున్న అభ్యర్థులకి ఎలక్షన్ కమిషన్ ఎలాంటి నిబంధనను అధికారికంగా తొలగించలేదు. సర్పంచ్ అభ్యర్థులకి ప్రత్యేక విద్యా అర్హత అంటూ ఏమీ లేదు. ఉపసర్పంచి పదవికి పోటీ పడిన అభ్యర్థులలో ఎవరికి స్పష్టమైన మెజారిటీ లేని పక్షంలో వారిలో ఒకరిని ఉపసర్పంచిగా సర్పంచ్ ఎన్నుకుంటారు. రిజర్వేషన్ కేటాయించిన స్థానాలలో రిజర్వేషన్ ఉన్నవారు ఎవరు లేనట్లయితే, లేక రిజర్వేషన్ ఉన్నా వారు సర్పంచి పదవికి పోటీ చేయనట్లయితే ఉప సర్పంచిగా ఎన్నుకోబడిన వ్యక్తే సర్పంచిగా బాధ్యతలు స్వీకరిస్తారు. ఎన్నికలకు సంబంధించిన నేరాలకు పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం శిక్ష విధిస్తే ఆ వ్యక్తి శిక్ష విధించిన రోజు నుంచి ఆరేండ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయటానికి అనర్హుడు.

## కోటి మంది మహిళలని కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు, నవంబర్ 22 (జనంసాక్షి) :** మునుగోడు మండల కేంద్రంలోని అధికార క్యాంపు కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.మహిళల ఆత్మవిశ్వాసం,ఆత్మగౌరవం నిలబడేలా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని,కోటి మంది మహిళలని కోటీశ్వరులను చేయడమే ఈ ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీరుస్తూనే మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకుంది అందుకే ఇప్పుడు ఈ పరిస్థితి దాపురించిందన్నారు. మహిళలకు ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్,హరీష్ రావు




అంటున్నారని, మాట తప్పడానికి కారణం ఎవరు ఈ రాష్ట్రం అప్పుల పాలవడానికి కారణం ఎవరు మొదట మీరు చెప్పండని ప్రశ్నించారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన బకాయిలు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు మీరు అధికారం లో ఉన్నప్పుడు చేసిన పాపాలకు ఈరోజు మేము అనుభవిస్తున్నామన్నారు.

### మద్యం నియంత్రణపై మహిళల హర్షం

2014 నుండి బెల్ట్ షాపులు గ్రామాలలో విచ్చలవిడిగా తయారయ్యాయని దానికి కారణం కేసీఆర్ అని అన్నారు.కానీ పొద్దంతా మద్యం తాగే విధానానికి వ్యతిరేకం అని మరోసారి స్పష్టం చేశారు.ఉదయం నుండి సాయంత్రం వరకు పొద్దంతా పనిచేసుకొని సాయంత్రం పూట కొద్దిగా తాగాలే కానీ విచ్చలవిడిగా తాగొద్దని సూచించారు. ఇంటి యజమాని ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని,కుటుంబం ఆరోగ్యం ఉన్నప్పుడే చదువు విషయంలో ఉద్యోగ విషయంలో వ్యాపారం విషయంలో రాణిస్తారని అన్నారు.మద్యం నియంత్రణపై మహిళలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీవో శ్రీదేవి,ఎంపీడీవో యుగంధర్ రెడ్డి,ఇంచార్జ్ ఎమ్మార్వో నేలపట్ల నరేష్,మహిళా సంఘాల గ్రూపు లీడర్లు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



**హాలియా, నవంబర్ 22 (జనం సాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో మహిళా ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నాగర్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శనివారం హాలియా మున్సిపాలిటీలోని లక్ష్మీ నరసింహ గార్డెన్ లో జరిగిన నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి, తాను ఎమ్మెల్యేగా, తన అన్న రఘువీర్ ఎంపీగా గెలవడానికి మహిళలు ఇచ్చిన సపోర్టే కారణమన్నారు. గడిచిన రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళల ఆర్థిక, ఆరోగ్యం వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు గాను అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకం పై సీఎం రేవంత్ రెడ్డి తొలి సంతకాన్ని పెట్టి వారి పట్ల ఉన్న గౌరవాన్ని చాటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను అన్ని విధాలుగా గౌరవించి, వారి అభివృద్ధికి, అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్లు కర్నాటి లింగారెడ్డి, ఇరిగి పెద్దులు, డీఇఓ బిక్షపతి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలసాని చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి తాసీల్దార్ రఘు, మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, ఎంపీడీవోలు సుజాత, విజయలక్ష్మి, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఆర్ ఐ నవీన్, నాయకులు కాకునూరి నారాయణ గౌడ్ షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**దేవరకొండ, నవంబర్ 22 (జనం సాక్షి) :** మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి, కుటుంబ ఆర్థిక శ్రేయస్సును బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధుల సమక్షంలో అర్హత కలిగిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు. అందులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగు అని ఆయన తెలిపారు.నియోజకవర్గంలో 68,000కు పైగా చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీ కార్యాలయాల్లో నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి మహిళకు చీరలు అందజేయబడతాయని ఆయన తెలిపారు.ఈ చీరలను రాజన్న సిరిసిల్ల హ్యాండ్‌లూమ్ నూలు రంగంలోనే తయారు చేయించడం వల్ల వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.ఇందిరమ్మ చీరలు తెలంగాణ సంస్కృతికి చిహ్నమని, ఈ కార్యక్రమం ద్వారా మహిళల గౌరవం, సాంస్కృతిక గుర్తింపు మరింత వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, మహిళాశక్తి కార్యక్రమాలు, గృహలక్ష్మి వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణా రెడ్డి, ఎంపీడీవో లు డానియల్, చంద్రమౌళి, ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి, పార్లమెంట్ కో- ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, శిరందాసు లక్ష్మమ్మ కృష్ణయ్య, హనుమత్ వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**బోనకల్, నవంబర్ 22 (జనం సాక్షి) :** మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి బోనకల్ లో కోటి 75 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఇందిర మహిళా డెయిరీ ప్రహారీ గోడ, గ్రౌండ్ లెవెలింగ్ పనులకు భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు బాగు పడతాయని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రత్యేకంగా ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ప్రతి ఒక్కరికి చీర తప్పకుండా ఇంటికి అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈ ఈ మహేష్ బాబు జె ఈ నవీన్ కుమార్ డి ఆర్ డి ఎ పి డి సన్యాసయ్య , హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు జిల్లా కాంగ్రెస్ నేత కొండ బాల కోటేశ్వరరావు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్ కుమార్ , ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గాలి దుర్గారావు, ఎర్రం శెట్టి సుబ్బారావు, సుధీర్ బాబు, చేబ్రోలు వెంకటేశ్వర్లు బిపి నాయక్ ,చావా వెంకటేశ్వరరావు, పాసంగులపాటి కోటేశ్వరరావు,యార్లగడ్డ కృష్ణయ్య , మరీదు శ్రీనివాసరావు, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి వెంకటేశ్వర్లు, పలువురు మండల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయాలి



**శామీర్‌పేట, నవంబర్ 22 (జనం సాక్షి) :** మాలలకు జరిగిన అన్యాయాలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి, తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు మాలలంతా సంఘటితం కావాలని మాల మహానాడు పిలుపునిచ్చింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండల తహసీల్దార్ కార్యాలయం ప్రక్కన అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకులు సమావేశాన్ని నిర్వహించారు.మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మోహన్ కృష్ణ పిలుపు మేరకు ఆదివారం నవంబర్ 23వ తేదీన హైదరా బాద్‌లోని సరూర్ నగర్ స్టేడియం గ్రౌండ్‌లో తలపెట్టిన..మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయ్యాలని మాల సోదరులకు విజ్ఞప్తి చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన భూగర్భగనులు ఫ్యాక్టరీల శాఖా మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ అనంతరం రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్ 3 లో మాలలకు 5% కేటాయించినప్పటికీ, గ్రూప్ 1 లోని ఇతర ఎస్సీ కులాలకు 1% ఉన్న రిజర్వేషన్ శాతం కారణంగా విద్యా, ఉద్యోగాలలో మాలలకు తక్కువ అవకాశాలు వస్తున్నాయని, ఇది తీవ్రమైన అన్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాల మహానాడు వజ్జల మురళి, నీరుడు బాలేష్, భరత్, ప్రకాష్, నరేష్, వేణు, హేమంత్, అభి, బొక్క సాయి, నరేష్, ఆంజనేయులు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి స్విమ్మింగ్‌లో మెరిసిన గిరిజన బిడ్డ

- టేకులపల్లి మండలంలో మరో ఆణిముత్యం
- ఈఎంఆర్ఎస్ టేకులపల్లి విద్యార్థి కిరణ్ నాయక్
- జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి
- సీఎం చేతులు మీదుగా బెస్ట్ ఎక్సలెంట్ ఛాంపియన్షిప్ అవార్డ్

**టేకులపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి) :** ఏజెన్సీ ప్రాంతంలోని లంబాడ గిరిజన తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ గిరిజన ముద్దుబిడ్డ స్విమ్మింగ్ లో పలు బహుమతులను పొందుతూ అంచలంచెలుగా ఎదుగుతూ జాతీయస్థాయి స్విమ్మింగ్ లో ప్రథమ బహుమతిని పొంది ముఖ్యమంత్రి చేతులు మీదుగా బహుమతిని పొంది జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువుతున్న పాఠశాలకు, మండల ప్రజలకు ఆనందంతోపాటు ఏజెన్సీ మండలానికి తన ప్రతిభను కనబరిచిన ఆణిముత్యానికి



అభినందనలు వెల్లువెత్తుతున్నారు జాతీయస్థాయిలో స్విమ్మింగ్ పోటీలో ప్రతిభను కనబరిచిన ఆ విద్యార్థి వివరాల్లోకి వెళితే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ప్రెగల్లపాడు (ముత్యాలంపాడు) ఉమ్మడి పంచాయతీలోని పాత తండాకు చెందిన పాల్టీయా ప్రసాద్, హీరాని దంపతుల కుమారుడు ఆణిముత్యం 'పాల్తియ కిరణ్ నాయక్' ఒరిస్సాలో జరిగిన నేషనల్ లెవెల్ స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించి మొదటి బహుమతి సాధించారు. ఈ ప్రతిభను కనబరిచినందుకు గాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా"బెస్ట్ ఎక్సెంట్ ఛాంపియన్షిప్ అవార్డు"ను గురువారం(20-11-25) నాడు హైదరాబాదులో అందుకున్నారు.పూణేలో జరగనున్న ఖేలో ఇ ఒడియా క్రీడలలో పాల్గొనే అర్హత కూడా సాధించడం అభినందనీయం. కిరణ్ నాయక్ ఒక సామాన్యమైన రైతు కుటుంబంలో జన్మించి, చాలా పేద కుటుంబానికి చెందినప్పటికీ, అతని విద్యాభ్యాసం ఒకటి,రెండవ తరగతులు ఎంపీపీ ఎస్ ముత్యాలంపాడు లో, 3,5వ తరగతి వరకు సత్తుపల్లి లోని ఒమేగా పాఠశాలలో, ఆరవ తరగతి నుండి ప్రస్తుతం చదువుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (బైపిసి) టేకులపల్లి లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్నాడు. చిన్నతనం నుండి స్విమ్మింగ్లో అతని ప్రతిభను గుర్తించి ఎల్లప్పుడూ ప్రోత్సహించిన అతని మేన మామ భూక్య హీరాలాల్ కి ప్రత్యేక అభినందనలు మండల ప్రజలు తెలుపుతున్నారు. త్వరలో పూణేలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో కూడా మొదటి బహుమతిని గెలుచుకోవా లని కోరుకుంటూ, టేకులపల్లి మండలానికి ఎంతో అరుదైన జాతీయస్థాయిలో అవార్డులుపొందుతున్న కిరణ్ నాయక్ కు మండల ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.

## శివారు వాగు నుండి అక్రమ ఇసుక రవాణా

- ప్రకృతి సంపద ధ్వంసం



**కేశంపేట, నవంబర్ 22 (జనం సాక్షి) :** ఇసుక దిబ్బల మధ్య సెలయేర్ల ప్రవాహంతో కళ కళ లాడుతూ ప్రవహిస్తున్న వాగు తన ఉనికిని కోల్పోతుంది. ప్రకృతి సంపదకు ముప్పు వాటిల్లుతుంది. మండల పరిధిలోని బోదునం పల్లి, లేమామిడి, కాకునూరు, తొమ్మిది రేకుల, నిర్ధవెల్లి, లింగందన గ్రామాల శివారు మీదుగా వాగు ప్రవహిస్తూ ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉదృతంగా ప్రవహించి వాగులోకి పెద్ద ఎత్తున ఇసుక వచ్చి చేరింది. ఇదే అదనుగా భావించిన కొందరు ఇసుక వ్యాపారులు తమ అక్రమ ఇసుక వ్యాపారానికి తెరలేపారు. రాత్రి పగలు తేడా లేకుండా వాగు నుండి ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు ఇచ్చిన అనుమతులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులుఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక వ్యాపారులు ఒక్క ట్రాక్టర్ ఇసుకకు 6 వేల నుండి 7 వేల రూపాయల వరకు ఇండ్లు నిర్మించుకునే వారి నుండి వసూలు చేస్తున్నారు. అనుమతుల పేరుతో కొనసాగుతున్న ఈ దందాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

# విపణి

## 50/30/20 రూల్..

### పొదుపు చేయడానికి ఉత్తమ మార్గం!



**న్యూఢిల్లీ:**డబ్బు ఎవరైనా ఖర్చు పెట్టేస్తారు.. కానీ పొదుపు చేయడం బహుశా అందరికీ సాధ్యం కాకపోవచ్చు. పెరిగిపోతున్న ధరల వల్ల ఎక్కడ, ఎంత ఖర్చు పెట్టాలనే విషయంలో ఒక క్లారిటీ లేకుండా పోతోంది.అయితే 50/30/20 ఫార్ములాను అనుసరిస్తే ఎవరైనా.. డబ్బు పొదుపు చేయవచ్చు. ఈ ఫార్ములా గురించి ఈ కథనంలో వివరంగా చూసేద్దాం.ఒక వ్యక్తి బ్యాచిలర్ లైఫ్ గడుపుతున్నప్పుడు పెద్దగా ఖర్చులు ఉండకపోవచ్చు. ఆ వ్యక్తి పెళ్లి చేసుకుని, పిల్లలను కంటే?, ఖర్చులు ఆటోమాటిక్‌గా పెరిగిపోతాయి. ఈ ఖర్చుల కోసం.. సంపాదించిన మొత్తం వెచ్చిస్తే?, భవిష్యత్ కోసం ఏమీ మిగలదు. కాబట్టి పొదుపు అవసరం.50/30/20 ఫార్ములా.. మీ ఆదాయాన్ని మూడు ఖర్చు భాగాలుగా విభజిస్తుంది. 50 శాతం అవసరాలకు, 30 శాతం కోరికలు (సరదా ఖర్చులు), 20 శాతం పొదుపు. ఈ ఫార్ములాను యూఎస్ సెనెటర్ ఎలిజబెత్ వారెన్ తన పుస్తకం "ఆల్ యువర్ వర్త్: ది అల్టిమేట్ లైఫ్‌టైమ్ మనీ ప్లాన్"లో వెల్లడించారు.వివరంగా చెప్పాలంటే.. మీరు నెలకు లక్ష రూపాయలు సంపాదిస్తున్నారనుకుందాం. అందులో 50 శాతం లేదా రూ. 50వేలు అవసరాలకు, అంటే రూమ్ రెంట్, కిరాణా సామాగ్రి, బీమా ఆరోగ్య సంరక్షణ వంటి వాటికి ఉపయోగించుకోవచ్చు. 30 శాతం లేదా రూ. 30వేలు సరదా ఖర్చులకు, అంటే.. హ్యాండ్‌బ్యాగులు, గడియారాలు, నగలు వంటివన్న మాట. 20 శాతం లేదా రూ. 20వేలు పొదుపు (స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ మొదలైనవి, మీ నైపుణ్యాన్ని బట్టి) చేయాలి. ఇలా విభజించుకుంటే.. మీరు తప్పకుండా పొదుపు చేయొచ్చు.మీరు సంపాదించే డబ్బులో మీరు తప్పకుండా పొదుపు చేయొచ్చు.మీరు సంపాదించే డబ్బులోఇంకా కొంత ఎక్కువ పొదుపు చేయాలంటే.. అనవసరమైనవి కొనుగోలు చేయడం లేదా ఖర్చు పెట్టడం మానేయాలి. ఆలా మిగిలిన డబ్బును కూడా మీరు సేవింగ్స్ చేసుకుంటూ పోతే.. పొదుపు తప్పకుండా పెరుగుతుంది. అయితే ఎక్కడైనా ఇన్వెస్ట్ చేస్తే.. దాని గురించి తప్పకుండా కొంత సమాచారం తెలుసుకుండాలి, అనుభవం కూడా ఉండాలి. లేకుంటే నష్టాలను చవిచూసే అవకాశం ఉంటుందన్న విషయం మర్చిపోవద్దు.

# బైజూస్ రవీంద్రన్‌కు షాక్..

### 1 బిలియన్ డాలర్ల చెల్లింపునకు యూఎస్ కోర్టు ఆదేశం


**న్యూఢిల్లీ:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు గట్టి షాక్ తగిలింది. బైజూస్ ఆల్ఫా, అమెరికాకు చెందిన రుణదాత గ్లాస్‌ట్రస్ట్ కంపెనీ ఎల్ఎల్‌సీ దాఖలు చేసిన పిటిషన్‌పై అమెరికా కోర్టు డిఫాల్ట్ జడ్జిమెంట్ (వాదనలకు ఆస్కారం లేకుండా) వెలువరించింది. పిటిషనర్లకు 1 బిలియన్ డాలర్లను వ్యక్తిగతంగా చెల్లించాలని బైజూస్ రవీంద్రన్‌ను ఆదేశిం చింది. ఈ మేరకు నవంబర్ 20న తీర్పు వెలువరిం చింది. తమ తీర్పును రవీంద్రన్ ఉల్లంఘించడం, పట్టించుకోకపోవడంతో ఈ ఆదేశాలు ఇస్తున్నట్లు డెలావేర్ దివాలా పరిష్కార కోర్టు తన తీర్పులో పేర్కొంది.బైజూస్ పేరిట సేవలందిస్తున్న సమయంలోనే బైజూస్ ఆల్ఫాను 2021లో నెలకొల్పారు. అంతర్జాతీయ రుణదాతల నుంచి నిధుల సమీకరించే ఉద్దేశంతో ఈ కంపెనీని ఏర్పాటు




చేశారు. దీనిద్వారా బైజూస్ ఆల్ఫా 1 బిలియన్ టర్మ్‌లోన్-బిని బైజూస్ పొందింది. అయితే, బైజూస్ ఆల్ఫా టర్మ్‌లోన్ నిబంధనలను ఉల్లంఘించిందని, మొత్తం అప్పులో 533 మిలియన్ డాలర్లు అమెరికా నుంచి చట్టవిరుద్ధంగా తరలించినట్లు రుణదాతలు ఆరోపించారు. ఈ క్రమంలోనే గ్లాస్‌ట్రస్ట్ డెలావేర్ కోర్టును ఆశ్రయించింది. దీంతో బైజూస్ ఆల్ఫాను స్వాధీనం చేసుకునేందుకు గ్లాస్ ట్రస్ట్‌కు కోర్టు అనుమతించింది. బైజూస్ ఆల్ఫా, గ్లాస్ ట్రస్ట్ 533 మిలియన్ డాలర్లకు సంబంధించిన నిధుల లావాదేవీల కోసం మరోసారి కోర్టును ఆశ్రయించాయి. దీంతో సంబంధిత వివరాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిస్కవరీ ఆదేశాల గురించి తెలిసి కూడా రవీంద్రన్ చూసీచూడనట్లు వ్యవహరించారని కోర్టు పేర్కొంది. ఈ విషయంలో కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదని తెలిపింది. ఉద్దేశపూర్వకంగానే రవీంద్రన్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన కోర్టు.. డిఫాల్ట్ ఆదేశాలు జారీ చేసింది. బైజూస్ ఆల్ఫాకు సంబంధించి 533 మిలియన్ డాలర్లు, క్యామ్‌షాఫ్ట్ హెడ్జ్ ఫండ్ ఇంట్రెస్ట్‌కు సంబంధించిన 540.6 మిలియన్ డాలర్ల నిధులను వెంటనే చెల్లించాలని బైజూస్‌ను ఆదేశించింది. ఆల్ఫా ఫండ్లను ఎలా ఖర్చు చేసిందీ వెల్లడించి పూర్తి అకౌంట్ వివరాలు సమర్పించాలని పేర్కొంది. ఈ ఆదేశాలను బైజూస్ రవీంద్రన్ తోసిపుచ్చారు. అప్పీల్‌కు వెళతామని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని బైజూస్ తరఫు లాయర్లు తెలిపారు.

## డార్క్ ప్యాటర్న్స్‌పై 26 సంస్థల సెల్ఫ్ డిక్లరేషన్


వినియోగదారులను మోసపుచ్చేలా, తప్పుదోవ పట్టించే సమాచారం, అసమంజస వాణిజ్య విధానాలకు (డార్క్ ప్యాటర్న్స్) తమ ప్లాట్‌ఫాంలలో తావు లేదంటూ 26 టాప్ ఈ-కామర్స్ కంపెనీలు స్వచ్ఛందంగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినట్లు కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) వెల్లడించింది.ఇలాంటి ధోరణులను గుర్తించేందుకు, తొలగించేందుకు సదరు సంస్థలు అంతర్గతంగా లేదా బైటి ఏజెన్సీలతో ఆడిట్ నిర్వహించాయని పేర్కొంది. సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చిన సంస్థల జాబితాలో జెప్టో, బిగ్‌బాస్కెట్, జొమాటో మొదలైనవి ఉన్నాయి. ఇతర ఈ-కామర్స్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్లు, యాప్ డెవలపర్లు కూడా నిబంధనలను పాటించడంపై దృష్టి పెట్టాలని సీసీపీఏ సూచించింది. డార్క్ ప్యాటర్న్స్ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.



## ఏ రంగమైనా.. హైదరాబాద్ టాప్!



ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫుడ్ అండ్ బేవరేజెస్.. రంగమేదైనా సరే.. హైదరాబాదే టాప్ లీడర్. అవునండీ.. గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ అడ్డాగా మారింది.దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, చెన్నై, పుణె, ఢిల్లీ, ముంబైని దాటేసి బహుళ జాతి సంస్థలు హైదరాబాద్‌లో జీసీసీల ఏర్పాటుకు జై కొడుతున్నాయి. కొత్త జీసీసీల ఏర్పాటే గానీ ఇప్పటికే ఉన్న జీసీసీల విస్తీర్ణంలో గానీ భాగ్యనగరాన్నే తొలి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయి.అందుబాటు ధరలు, తక్కువ జీవన వ్యయం, మెరుగైన మౌలిక వసతులు, నైపుణ్య కార్మికుల లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు, కాస్మోపాలిటన్ కల్చర్ వంటివి ఇందుకు ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి-నవంబర్ మధ్య కాలంలో దేశంలో 88 జీసీసీలు ఏర్పాటు, విస్తరణ కాగా.. ఇందులో 46 శాతం వాటాతో భాగ్యనగరం తొలి స్థానంలో నిలిచింది. మన తర్వాతే 33 శాతం వాటాతో బెంగళూరు నగరం రెండో స్థానంలో నిలిచింది. వచ్చే ఏడాది ముగింపు నాటికి రాష్ట్రంలో 120 జీసీసీలు, 1.2 లక్షల ఉద్యోగాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణలోని మొత్తం జీసీసీ నైపుణ్య కార్మికులలో 59 శాతం మంది, అంటే సుమారు 1.82 లక్షల మంది ఐటీ, ఐటీఈఎస్ రంగంలోనే కేంద్రీకృతమై ఉన్నారు. బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, తయారీ రంగాల జీసీసీలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జీసీసీ నిపుణులలో మహిళలు 33 శాతం మంది ఉండగా.. 19 శాతం మంది నాయకత్వ ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. రాష్ట్రంలోని మొత్తం జీసీసీ ఉపాధిలో ఇంజనీరింగ్, ఐటీ రంగాలు 57 శాతం వాటాతో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి.




## వందలాది ఇంజినీర్ల తొలగింపు

### 2026లో మళ్లీ లేఆఫ్‌లే..

ప్రముఖ ఈ కామర్స్ కంపెనీ అమెజాన్ 2025 అక్టోబర్ నెలలో 14,000 కంటే ఎక్కువ తొలగింపులను ప్రకటించింది. ఈ ప్రభావం క్లౌడ్ సర్వీసెస్, గ్రోసరీ, రిటైల్, ప్రకటనలకు సంబంధించిన విభాగాలపై మాత్రమే కాకుండా..ఇంజినీర్ బృందాలపై కూడా పడింది. అమెజాన్ తొలగింపులలో 1,800 మంది ఇంజినీర్లు ఉన్నారని.. న్యూయార్క్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్ లేఆఫ్స్ రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఈ రాష్ట్రాల్లో మొత్తం ఉద్యోగుల తొలగింపులు 4,700 కంటే ఎక్కువగా ఉన్నాయి. కానీ ఇందులో 40 శాతం ఇంజినీర్లే ఉన్నట్లు.. వర్కర్ అడ్జస్ట్‌మెంట్ అండ్ రీట్రైనింగ్ నోటిఫికేషన్ ఫైలింగ్‌ల ద్వారా అమెజాన్ వెల్లడించింది. కాగా జనవరి 2026లో కూడా మరోసారి ఉద్యోగుల తొలగింపులు ఉంటాయని కొందరు చెబుతున్నారు.కంపెనీ ఖర్చులను తగ్గించడంలో భాగంగానే.. అమెజాన్ ఈ ఉద్యోగుల తొలగింపును చేపట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగం పెరగడం వల్ల.. మరిన్ని ఉద్యోగాల కోతలకు దారితీసే అవకాశం ఉందని 2025 జూన్‌లో సంస్థ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ కంపెనీలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల సంఖ్య 15.5 లక్షలు.

# ఎయిరిండియాలో వింత సంఘటన

### 13 ఏళ్లుగా షెడ్డులోనే పాత బోయింగ్ విమానం • గుర్తించి విక్రయించిన ఎయిరిండియా అధికారులు

**న్యూఢిల్లీ:**ఎయిరిండియాలో ఒక వింత సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక పాత బోయింగ్ 737-200 కార్గో విమానాన్ని 13 ఏళ్లుగా అసలు అలాంటి ఒక విమానం ఉందన్నవిషయాన్నే మర్చిపోయింది.గత వారమే దీన్ని విక్రయించింది. మరి గత దశాబ్దంన్నర కాలంగా పట్టించుకోకుండా వదిలేసిన విమానం గురించి ఎలా తెలిసింది? ఎలా విక్రయించింది?"పాత విమానాలను అలా వదిలేయడం అసాధారణం కానప్పటికీ, ఇటీవలి దాకా ఇలాంటి విమానం ఒకటి ఉందీ అనేది తెలియదు! కాలక్రమేణా, అది జ్ఞాపకంగా మిగిలిపోయింది. కోల్‌కతా విమానాశ్రయంలోని రిమోట్ పార్కింగ్ బేలో ఉన్న దీని గురించి చెప్పి, దానిని తీసివేయమని అడిగినప్పుడు మాత్రమే వెలుగులోకి వచ్చింది! నిజంగా అది మనదేనా ధృవీకరించిన తర్వాత, విక్రయించాం అని విల్సన్ సిబ్బందికి పంపిన సందేశంలో చెప్పారు. గత 13 ఏళ్ల కోల్‌కతా విమానాశ్రయంలోని రిమోట్ పార్కింగ్ బేలో అలా పడి ఉంది. గత 13 ఏళ్లకుపైగా ఉనికిని మరచిపోయింది. ప్రైవేటీకరణ తర్వాత దాదాపు మూడు సంవత్సరాల తర్వాత కార్గో విమానం బయటపడింది,




అధికారులు టాటా గ్రూప్ కంపెనీని కోల్‌కతా విమానాశ్రయ ప్రాంగణం నుండి దానిని తీసివేయమని కోరారు. దీంతో ఈ విమానాన్ని సేల్ చేసింది ఎయిరిండియా. కాగా 2012లో తన కార్గో వ్యాపారాన్ని మూసివేసింది ఎయిరిండియా. గతంలో బోయింగ్ 737-200 కార్గో విమానాలను నిర్వహించింది. వ్యాపారాన్ని మూసి వేసిన నేపథ్యంలో ప్రస్తుతం కార్గో విమానాలను ఉపయోగించడం లేదు.విమాన ట్రాకింగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 43.2 సంవత్సరాల కంటే పాతది మరియు సెప్టెంబర్ 1982 లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు డెలివరీ చేయబడింది. ఈ విమానాన్ని ఫిబ్రవరి 1998 లో అలయన్స్ ఎయిర్ లీజుకు తీసుకుంది. జూలై 2007 లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు తిరిగి సరుకు రవాణాకోసం దీన్ని ఉపయోగించరాఉ. రెండు విమానయాన సంస్థలు విలీనం తరువాత ఇది ఎయిరిండియాకు వచ్చింది.


## చైనా ఎంబసీకి యూకే ప్రధాని పచ్చజెండా

**లండన్:** లండన్ నడిబొడ్డున చైనా నిర్మించతలపెట్టిన వివాదాస్పద సూపర్ ఎంబసీకి బ్రిటిష్ ప్రభుత్వం అనుమతించనుంది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మరికొద్ది నెలల్లో చైనాలో పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఎంబసీ ప్రణాళికకు ఆమోదం తెలపాలని నిర్ణయించింది.స్టార్మర్ ప్రతిపాదనకు హోం శాఖ, విదేశాంగ శాఖలు అడ్డుచెప్పే అవకాశాలు లేవని ది టైమ్స్ కథనం పేర్కొంది.అయితే, జాతీయ భద్రతా ప్రయోజనాలకు లోబడి ఇందులో కొన్ని మినహాయింపులుండొచ్చని తెలిపింది.జాతీయ భద్రతా ప్రయోజనాలకు లోబడి ఇందులో కొన్ని మినహాయింపులుండొచ్చని తెలిపింది. డిసెంబర్ 10వ తేదీలోగా అధికారికంగా అనుమతి లభించవచ్చని పేర్కొంది. చైనా నిర్మించాలనుకుంటున్న భారీ దౌత్య కార్యాలయం తమ దేశంలో గూఢచర్యానికేనని యూకే అనుమానిస్తోంది. అయితే, ఎంబసీ ప్రణాళికను ఆమోదించకుంటే తీవ్ర పరిణామాలుంటాయని చైనా హెచ్చరికలు చేయడం గమనార్హం.

## ఉద్యోగుల గ్రాట్యుటీకి ఇక ఏడాది చాలు..

**న్యూఢిల్లీ:**కార్మిక చట్టాలలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులను ప్రవేశపెట్టింది. కొత్త లేబర్ కోడ్‌ల ప్రకారం.. అన్ని రంగాల్లోని ఉద్యోగులు ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం సర్వీస్ ఉంటే చాలు గ్రాట్యుటీకి అర్హులు అవుతారు.దేశంలో ఇప్పటివరకూ ఉన్న 29 కార్మిక చట్టాలను ప్రభుత్వం నాలుగు సరళీకృత లేబర్ కోడ్‌లుగా ఏకీకృతం చేసింది.కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం.. ఉద్యోగులకు మెరుగైన వేతనాలు, విస్తృత సామాజిక భద్రతా కవరేజ్, మెరుగైన ఆరోగ్య రక్షణ అందించడమే ఈ మార్పుల లక్ష్యం. ఈ సంస్కరణలు అనధికారిక కార్మికులు, గిగ్ , ప్లాట్‌ఫామ్ వర్కర్లు, వలస కార్మికులు, మహిళా ఉద్యోగులు వంటి విభిన్న వర్గాలకు వర్తిస్తాయి. పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారం.. ఇప్పటిదాకా ఒక ఉద్యోగి ఐదు సంవత్సరాల నిరంతర సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాతే గ్రాట్యుటీకి అర్హుడు. అయితే, కొత్త లేబర్ కోడ్‌ల అమలుతో నిర్ణీత కాలానికి అంటే రెండేళ్లకో.. మూడేళ్లకో ఒప్పందంపై చేరే ఉద్యోగులు (ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయీస్ (%ఖీజుం%) కూడా ఇప్పుడు ఏడాది సర్వీస్ అనంతరం గ్రాట్యుటీకి అర్హత పొందుతారు.మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం.. ఈ మార్పు ఫిక్స్డ్ టర్మ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులతో సమాన హోదాలోకి తీసుకురావడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఫిక్స్డ్ టర్మ్ ఉద్యోగులు కూడా శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే జీతాలు, సెలవు సదుపాయాలు, వైద్య ప్రయోజనాలు, సామాజిక భద్రతా పరిరక్షణలు పొందుతారు.గ్రాట్యుటీ అనేది ఉద్యోగి దీర్ఘకాలిక సేవకు గుర్తింపుగా కంపెనీల యాజమాన్యాలు చెల్లించే ఆర్థిక ప్రయోజనం. సాధారణంగా, ఒక ఉద్యోగి రాజీనామా చేసినప్పుడు, పదవీ విరమణ చేసినప్పుడు లేదా అర్హతగల సర్వీస్ కాలాన్ని పూర్తి చేసినప్పుడు ఈ మొత్తం చెల్లిస్తారు.ఉద్యోగికి చెల్లించే గ్రాట్యుటీ మొత్తం ఈ ఫార్ములాతో లెక్కిస్తారు.గ్రాట్యుటీ = (చివరిగా అందుకున్న వేతనం) ఐ (15/26) ఐ (సర్వీస్ కాలం సంవత్సరాల్లో) ఇక్కడ చివరిసారిగా అందుకున్న వేతనం అంటే బేసిక్ పే, డియర్నెస్ అలవెన్స్ కలిపి తీసుకోవాలి.ఉదాహరణకు ఒక ఉద్యోగి 5 సంవత్సరాలు పనిచేసి చివరిగా బేసిక్, డీఏ కలిపి రూ.50 వేలు అందుకున్నారనుకుంటే.. గ్రాట్యుటీ రూపంలో సదరు ఉద్యోగి అందే మొత్తం రూ.1,44,230 అవుతుంది.

## గర్ల్‌ఫ్రెండ్‌తో జూ. ట్రంప్ స్టెప్పులు



జైపూర్:రాజస్థాన్‌లోని ఉదయ పూర్‌లో రాయల్ వెడ్డింగ్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఓర్లాండోకు చెందిన బిలియనీర్ పద్మజ , రామరాజు మంతెన దంపతుల కుమార్తె నేత్ర మంతెన, మరో వ్యాపారవేత్త సూపర్ ఆర్డర్ సహ వ్యవస్థాపకుడు , వంశీ గదిరాజు ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో అమెరికా అధ్యక్షుడి డొనాల్డ్ ట్రంప్ కుమారుడు జూ.డొనాల్డ్ ట్రంప్ ,ఆయన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్ ఉత్సాహంగా స్టెప్పులు వేయడం విశేషంగా నిలిచింది.దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.ఉదయపూర్‌లో జరుగుతున్న వివాహ వేడుకల్లో భాగంగా జూ. ట్రంప్ బాలీవుడ్పాట బీట్‌లకు డ్యాన్స్‌చేశారు. బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ తన హిట్ పాట 'వాట్ ఝుమ్కా?'కి సాంగ్‌కు వీళ్లద్దిరనీ ఆహ్వానించి మరీ స్టెప్పులు వేయించడం అందరి దృష్టిని ఆకర్షించింది.అటు వధూవరులు నేత్ర, వంశీ కూడా రణ్‌వీర్‌తో కలిసి డ్యాన్స్ చేశారు. లేక్స్ సిటీలో నేత్ర మంతెన, వంశీకి పెళ్లి సందడి మొదలైంది. సంగీత వేడుక నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ స్టార్-స్టడెడ్ ప్రీ వెడ్డింగ్ వేడుకలో భాగంగా శుక్రవారం (నవంబర్ 21) సంగీత్ వేడుక జరిగింది. కరణ్ జోహార్ హోస్ట్ చేసిన ఈ సంగీత్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్, కృతి సనన్ ,వరుణ్ ధావన్‌లతో సహా బాలీవుడ్ తారలు సందడి చేశారు. "ఆంఖ్ మారే", గల్లీ బాయ్ "అప్నా టైమ్ ఆయేగా" పాటలతో వేదికపై ఉన్న ప్రతి ఒక్కరినీ స్టెప్పులేయించి, అతిథులందరినీ అలరించారు.

## 17 ఏళ్ల తరువాత ఇండియాకు ఎన్ఆర్ఐ జంట..

### ఆరోగ్య, బీమా ఖర్చులు భరించలేకే...

**న్యూఢిల్లీ:**డాలర్ల వేటలో చాలామంది విదేశాల బాటపడతారు. కానీ అన్ని దేశాల్లోనూ, అన్ని రకాలుగా మనకు సౌకర్యంగా ఉండదు. కొన్నిచోట్ల కొన్ని సమస్యలు తప్పవు. ఇందులో అక్కడి నిబంధనలు, భాషా సంస్కృతి, వాతావరణ పరిస్థితులు, జీవన స్థితిగతులు, ఆరోగ్యం ఇలా ఈ జాబితాలోనే చాలానే ఉంటాయి.కొన్ని కావాలంటే కొన్ని సర్దుబాట్లు తప్పవు అని ఎడ్జస్ట్ అయిపోతూ ఉంటారు. కానీ అమెరిలో ఒకటిన్నర దశాబ్దానికి పైగా ఉన్న జంట ప్రవాస భారతీయ జంట ఇండియాకు తిరిగి వచ్చేసింది.ఎందుకు? అనుకుంటున్నారా? పదండి తెలుసుకుందాం ఈ కథనంలో అమెరికాలో ఆరోగ్య ఖర్చులు బీమా భారం కావడంతో దాదాపు 17 ఏళ్ల తరువాత అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేసింది భారతేదేశానికి చెందిన ఎన్ఆర్ఐ జంట. వీరికి కవల పిల్లలు. యూఎస్‌లోని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ తమ ఆర్థిక స్థితిపై ఒత్తిడి తెస్తోందని, బీమా చాలా ఖరీదైనదని, దీంతో అక్కడ హాస్పిటల్‌కి వెళ్లాలంటేనే భయం వేస్తోందని ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు.అమెరికాలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఆరోగ్య బీమా సేవలకంటే ముందు, మీ జేబుకు చిల్లు తప్పదు. అంటే ఏ డాక్టర్ దగ్గరికెళ్లినా, ఎలాంటి పరీక్షలు చేయించుకున్నా, మినిమం డిడక్టబుల్ ఎమౌంట్ కట్టాల్సిందే అంటూ తమ ఇబ్బందుల గురించి చెప్పుకొచ్చారు.తాము ఎంచుకున్న చౌకైన పథకం నెలకు 1,600 డాలర్ల ప్లాన్. ఇందులో 15వేల డాలర్లు డిడక్టబుల్ ఎమౌంట్. అయితే ఈ కవర్‌లో ట్విన్స్ యాడ్ అవ్వలేదు.దీంతో పిల్లలకి ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన ఖర్చులు విపరీతం, దీనికి ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. అందుకే ఇండియాకు తిరిగి వెళ్లాలని నిర్ణయించు కున్నాం. మంచి వైద్యులు, వేగవంతమైన సంరక్షణ, చికిత్స అందుబాటులో ఉండేలా చక్కటి వ్యవస్థ ఉంది. మేం ఇండియాకు రావడం అంటే సమస్య నుంచి పారిపోవడం కాదు, ఆరోగ్య సంరక్షణ భరించేదిగా ఉండటంతోపాటు, ఒంటరిగా మాతృత్వ భారాన్ని భరించాల్సిన అవసరం లేని జీవితం వైపు పరుగెత్తడం అని వివరణ ఇచ్చారు. తాము కోల్పోతున్న సమన్వయం, మనశ్శాంతిని వెదుక్కోవడం అని పేర్కొన్నారు.దీంతో నెటిజన్లు ఈ జంటతో ఏకీభవించారు. వారికి మద్దతుగా నిలిచారు. చక్కటి నిర్ణయం తీసుకున్న మీకు అభినందనలు అంటూ ప్రశంసించారు. అలాగే కొంత సర్దుబాటు అవవసరం అని కొందరు వ్యాఖ్యానిస్తే. ఇండియాలో 30వేలతో అయిపోయే అపెండిక్స్ ఆపరేషన్‌కు రూ. 3.74 కోట్లు అయిందంటూ ఒకరు,అక్కడ సాధారణ కట్టు , కుట్లు వేయడానికి చాలా ఖర్చవుతుంది అని మరొకరు తమ అనుభవాల్ని పంచుకున్నారు. రెండు దేశాల్లో వాటి ప్లస్‌లు మైనస్‌లూ ఉన్నాయి. కానీ చిన్న పిల్లలున్న కుటుంబాలకు ఇండియాలో మంచి ఆరోగ్య వ్యవస్థ ఉందన్నారు. ఎక్కడా పెర్‌ఫెక్ట్‌గా ఉండదు. కానీ మీకు మంచి జీవితం ఉండాలని భావిస్తున్నాను అని ఒకరు వ్యాఖ్యానించారు. వీడియో 10.6 లక్షలకు పైగా వీక్షణలు మరియు వందలాది వ్యాఖ్యలను సంపాదించింది.

## డ్రోన్‌ల ద్వారా తో పాక్ ఆయుధాలు..

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలోకి అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న భారీ స్మగ్లింగ్ రాకెట్‌ను దిల్లీ పోలీసులు ఛేదించారు. పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో వీటిని దేశంలోకి తీసుకొస్తున్న ముఠాను పట్టుకున్నారు. పాక్ ఐఎస్ఐతో ప్రత్యక్ష సంబంధాలున్న వీరి నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలో కొంతమంది భారీగా అక్రమ ఆయుధాలు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి క్రైమ్ బ్రాంచ్‌కు సమాచారం అందించింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు పలు ప్రాంతాల్లో నిఘా ఉంచగా.. రోహిణిలో ఈ ఆయుధ మాడ్యూల్ గుట్టు బయటపడింది. నిందితులు డ్రోన్‌లను ఉపయోగించి పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పంజాబ్ సరిహద్దుల నుంచి తీసుకొచ్చిన ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్ బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.నిందితుల నుంచి విదేశాల్లో తయారైన 10 అత్యాధునిక సెమీ ఆటోమెటిక్ పిస్టల్స్‌తో పాటు 92 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. లభ్యమైన ఆయుధాలు తుర్కియే చైనా లో తయారైనవిగా తెలిపారు. ఈ మాడ్యూల్‌కు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెట్‌వర్క్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఆయుధాలను ఎవరికి విక్రయించారు, నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే వివరాలు తెలుసుకునేందుకు అధికారులు కూపీలాగుతున్నారు. నిందితులకు చెందిన మొబైల్ ఫోన్లు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు.

## ఆహార వృధా అంత ఎక్కువేం లేదు



**న్యూఢిల్లీ:**ప్రజల్లో అనుకుంటున్నట్టు మన దేశంలో ఆహార వృధా అంత ఎక్కువేం లేదని నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ వ్యాఖ్యానించారు. పాలకు సంబంధించి వృధా కేవలం 0.5 శాతమే ఉన్నట్టు పేర్కొన్నారు .ప్రస్తుతమున్న ఆహార వృధాలోనూ చాలా వరకు అరికట్టొచ్చని చెబుతూ.. ఇలా చేస్తే అది గోదాముల్లో పెట్టుబడులకు సైతం ప్రోత్సాహకరంగా మారుతుందన్నారు.దేశ వ్యవసాయ రంగం వచ్చే పదేళ్ల పాటు 4 శాతం వృద్ధి రేటును సులభంగానే సాధిస్తుందని రమేష్ చంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. గోదాముల వసతులను పెంచుకోవాల్సి ఉందన్నారు. పీహెచ్‌డీ సీసీఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఏటా 2.5 శాతం చొప్పున పెరుగుతున్నట్టు చెప్పారు. కనుక 4 శాతం వృద్ధి సాధ్యమేనన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో (క్యూ1) వ్యవసాయ రంగంలో వృద్ధి 3.7 శాతంగా ఉండడం గమనార్హం "కానీ, వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఈ స్థాయిలో పెరగడం లేదు. కనుక ఈ ఉత్పత్తులను పరిశ్రమలు వినియోగించాలి. లేదంటే ఎగుమతి చేయాలి. ఎగుమతి మార్కెట్‌ను గుర్తించడం మెరుగైన ఆప్షన్ అవుతుంది"అని రమేష్ చంద్ పేర్కొన్నారు.బియ్యం, గోధుమలకు కావాల్సిన నిల్వ వసతుల్లో (గోదాములు) ఎలాంటి వ్యత్యాసం లేదంటూ.. అదే మొక్కజొన్న విషయంలో మాత్రం భిన్నంగా ఉంటుందన్నారు. నిర్ణీత పరిమాణానికి మించి నిల్వ చేయకూడదన్న చట్టం ఉంటే.. అలాంటి నియంత్రణలు గోదాముల నిర్మాణంపై పెట్టుబడులను ప్రభావితం చేస్తాయన్నారు.

# ఆర్‌జీపీయస్ జాతీయ కన్వీనర్‌గా రాజేష్ కాశిపాక



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ రాజకీయాల్లోకి దూసుకెళ్తున్న యువ నాయకత్వానికి శనివారం రోజు అత్యున్నత గౌరవం లభించింది. విద్యార్థి దశ నుండి సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలు అందిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , కరీంనగర్‌కు చెందిన ప్రముఖ యువ నాయకులు రాజేష్ కాశిపాకను 'రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్' (ఆర్.జి.పి.ఆర్.ఎస్) జాతీయ కన్వీనర్‌గా నియమిస్తూ.. ఏఐసీసీ సంచలన నిర్ణయం తీసుకుంది. జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణు గోపాల్ ఆర్.జీ.పీ.యస్. జాతీయ ఆఫీస్ బేరర్ల నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. అందులో తెలంగాణ నుండి ఏకైక వ్యక్తిగా, రాష్ట్ర యువ శక్తికి ప్రతీకగా రాజేష్ కాశిపాక పేరు ప్రముఖంగా ప్రకటించబడింది. స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా పనిచేసే ఆర్.జీ.పీ.యస్. కార్యవర్గంలో ఈ అత్యంత కీలకమైన బాధ్యతను ఆయనకు అప్పగించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలపై ఆయనకున్న సమగ్ర అవగాహన, క్షేత్ర స్థాయిలో ఆయన చేసిన అలుపెరగని పోరాటం, పార్టీ సిద్ధాంతాలపై ఆయనకున్న విశ్వాసానికి దక్కిన అత్యుత్తమ గుర్తింపుగా భావించవచ్చు. ఈ నియామకం జాతీయ స్థాయిలో తెలంగాణ నాయకత్వానికి దక్కిన ప్రతిష్టాత్మక గౌరవంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రాజేష్ కాశిపాక ఉద్వేగంతో స్పందిస్తూ.. ఒక సాధారణ కార్యకర్తగా, తెలంగాణ మట్టి నుండి వచ్చిన తనకు సోనియా గాంధీ దార్శనికత, రాహుల్ గాంధీ అపారమైన విశ్వాసం, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ కార్కే మార్గదర్శకత్వంలో ఆర్.జీ.పీ.యస్ జాతీయ కన్వీనర్‌గా సేవ చేసే అవకాశం లభించినందుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యత కేవలం పదవి కాదని భారత ప్రజాస్వామ్య మూలాలైన స్థానిక సంస్థలను బలోపేతం చేయాలన్న దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చేందుకు దొరికిన పవిత్ర అవకాశంగా భావిస్తున్నట్టు తెలిపారు.

రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలకు పూర్తి రాజ్యాంగ అధికారాలు, నిధులు అందేలా పోరాడుతానని అన్నారు. అంకితభావం, నిజాయితీతో తెలంగాణ రాష్ట్రం గర్వించేలా పనిచేస్తానని రాజేష్ తెలిపారు. రాజేష్ కాశిపాక నియామకాన్ని టీపీసీసీ అధ్యక్షులు బోమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ అడ్లూరి, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లు సహా పార్టీ అగ్ర నాయకత్వం అభినందించింది. ఆయన నాయకత్వంలో స్థానిక వ్యవస్థలు సరికొత్త శక్తిని పుంజుకుంటాయని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ధృఢంగా విశ్వాసం వ్యక్తం చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మార్కెట్ యార్డులో ఆధునిక వసతులు
- 55 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**బోయిన్ పల్లి నవంబర్ 2 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్ పల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కవర్ షెడ్ల నిర్మాణం రైతు ఎద్దుల బండి విగ్రహాల నిర్మాణం కోసం శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే మెడికల్ సత్యం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రైతులకు ఆధునిక వసతులతో మార్కెట్ యార్డులో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర, సన్నబియ్యానికి బోనస్, రైతుబంధు పథకాలు అమలు చేస్తూ రైతులను రాజులను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయినీ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి ,పిఎసిఎస్ చైర్మన్లు సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, తాసిల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల ,ఏపీఓ ప్రణీత, ఎంపీఓ శ్రీధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి , మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాబు, రమేష్, సతీష్, శేఖర్ రెడ్డి, వెంకటేష్, అజయ్, ప్రదీప్, మహేష్, నాయకులు కౌడగాని వెంకటేష్, సంభ లక్ష్మి రాజం, ఏనుగుల కనకయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

**అధికారిక ఉత్తర్వులు..**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధమైంది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలుపడంతో సర్పంచ్, వార్డ్ మెంబర్ల రిజర్వేషన్లకు విధి విధానాలను ఖరారు చేస్తూ శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో నెం.46 ను విడుదల చేశారు.దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేశారు.ప్రస్తుతం ఇచ్చిన జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ మహిళలకు రొటేషన్ పద్ధతిలో సీట్లును కేటాయిస్తారు.ఆదివారం, సోమవారం జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.రిజర్వేషన్ల కేటాయింపు తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఈ నెల 24 న రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసి విచారణ ముగించాలని కోరనుంది.హైకోర్టు ఇచ్చే ఉత్తర్వుల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

# లేబర్ కోడ్‌ల రద్దునకు కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలి

**టీసీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్**



**గోదావరిఖని, జనంసాక్షి :** మోడీ ప్రభుత్వం నిరంకుశంగా కార్మికవర్గాన్ని అణిచివేసే ధోరణితో తీసుకున్న నిర్ణయాలు సరైనవి కావని..లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మికులకు హక్కు కల్పించే విధంగా చూడాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్,కార్యదర్శి రాచకట్ల భాస్కర్, కమటం సందీప్ అన్నారు.అతి తక్కువ జీతాలతో కష్టపడుతూ శ్రమను కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టే విధంగా నరేంద్రమోడీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.లేబర్ కోడ్లు తగ్గిస్తే సహించేది లేదని, కార్మిక క్షేత్రం ఏకతాటిపైకి వచ్చి ఉద్యమాలు చేస్తుందని పేర్కొన్నారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలుల్లోకి తెస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఆధునికరించి అమలు చేసేందుకే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధమని తెలిపారు. ఇప్పటివరకు ఏదైనా కర్మాగారం లేదా కంపెనీ లే-ఆఫ్ చేయాలన్నా,లాకౌట్ చేయాలన్న 100 మంది అంతకుమించి కార్మికులు ఉంటే ఆ సంస్థ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నారు.ఇప్పుడు ఆ షరతు 300 మంది కార్మికులు ఉన్న కంపెనీలకు, ఫ్యాక్టరీలకు వర్తించే విధంగా మార్చారన్నారు. 300 లోపు కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలు, కంపెనీల యజమానులు ఇష్టానుసారం పరిశ్రమలను లే-ఆఫ్ లేదా లాకౌట్లు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఈ లేబర్ కోడ్లను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూ 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.భారత కార్మిక వర్గమంతా ఐక్యంగా మోదీ ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## 'జాతీయస్థాయి సి.బి.ఎస్.ఇ సైన్స్' ఛాలెంజ్‌లో పారమిత హెరిటేజ్ విద్యార్థి ప్రతిభ

**పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు**



**కరీంనగర్, నవంబర్ 22 (జనంసాక్షి) :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎద్యుకేషన్ (సి.బి.ఎస్.ఇ) బోర్డు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సైన్స్ ఛాలెంజ్ 2025 పోటీలలో భారతదేశ వ్యాప్తంగా 23వేలకు పైగా పాఠశాలల నుండి 1.50వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఈ పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి అన్నాడి ఆశ్రిత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయిలో 4వ ర్యాంకు సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ తెలిపారు. సి.బి.ఎస్.ఇ బోర్డు సైన్స్ ఛాలెంజ్ 2025లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చిన ఆశ్రిత్ ను ఈ ఘనత సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం పట్ల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనూకర్ రావు, వినోదరావు, వి.యు.యం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## ధాన్యం వెంటనే తీసుకోండి..హమాలీ కొరత రాకూడదు

- మిల్లర్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు
- రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటలో తనిఖీలు
- కుప్పలు, తేమ శాతం పరిశీలన



**గంభీరావుపేట, నవంబర్ 22 (జనంసాక్షి) :**కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని రైసు మిల్లర్లు ఎప్పటికప్పుడు ఎత్తుకెళ్లాలని, హమాలీ కొరత ఏర్పడకుండా చూడాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శనివారం గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 14 కొనుగోలు కేంద్రాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంభీరావుపేట మండలంలో సముద్రలింగాపూర్, గజసింగవరం, గోరంటాల, గంభీరావుపేట, లింగన్నపేట, ముస్తఫానగర్‌లలోనూ, ఎల్లారెడ్డిపేట మండలంలో వెంకటాపూర్, పదిర, రాగట్లపల్లి, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, తిమ్మాపూర్, కిషన్‌దాస్‌పేట కేంద్రాల్లోనూ ఆయన పర్యటించారు. ధాన్యం కుప్పలు, తేమ శాతం, నిల్వల స్థితిగతులు పరిశీలించారు. మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోకపోతే రైతులు ఇబ్బంది పడతారని, అందుకే వెంటనే ఎత్తుకెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హమాలీల కొరత వల్ల ఆలస్యం జరగకూడదని, తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లూ సక్రమంగా చేయాలని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో జాగృతిని బలోపేతం చేస్తాం

- రాష్టానికి కవితక్క నాయకత్వం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.
- జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాలో జాగృతి మండలాల వారిగా కమిటీల ఎన్నికలను త్వరలోనే పూర్తి చెయ్యాలని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని జాగృతి కమిటీలు ఎన్నుకోవాలని వారు అన్నారు. శనివారం రోజు కరీంనగర్ లో జాగృతి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ... కరీంనగర్ జిల్లాలో జాగృతి బలోపేతానికి త్వరలోనే జిల్లాలో అన్ని మండల కమిటీలు పూర్తిచేయాలని ఆయా కమిటీల ఎన్నికల కోసం అన్ని మండలాలకు ఇంచార్జ్ లను నియమించడం జరిగిందని వారు అన్నారు. మండల ఇంచార్జ్ లు ఉన్న నాయకులు రేపటి నుండి వారికి కేటాయించిన మండలాలకు వెళ్ళి అయా మండలాల్లో ఉన్న జాగృతి పాత, కొత్త నాయకులను కలుపుకొని మండలాల, గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజలు పడుతున్న దీర్ఘకాలిక ఇబ్బందులను సమస్యలు తెలుసుకుని జిల్లా జాగృతికి నివేదించాలని వారు అన్నారు. గ్రామాలలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులను, కుల సంఘాల నాయకులను, స్వచ్ఛంద సంస్థలలో పనిచేసే నాయకులను, సమాజ హితం కోసం ఆలోచించే మేధావులను, మహిళలను, విద్యార్థులను, యువకులను కలిసి వారి ఆలోచనలను, సూచనలు, సలహాలను తీసుకుని జాగృతి బలోపేతానికి కృషి చెయ్యాల న్నారు. మండలంలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం కోసం పనిచేసి మంచి కమిటీల ఎన్నుకునే బాధ్యతలు ఇప్పుడు మండల ఇంచార్జ్ లపైన ఉంటుందన్నారు.

**కరీంనగర్ జిల్లాలో జాగృతి మండల ఇంచార్జ్‌లు**

చొప్పదండి రంగరవేణి లక్ష్మణ్, చిగురుమామిడి మేకల తిరుపతి, తిమ్మాపూర్ గుండేటి తిరుపతి, యాకూబ్, మానకొండూర్ కొత్తూరు రఘు, హుస్సేన్, వంగల విరాచారి, రామడుగు అంకం శివరాణి, గీత రెడ్డి, గంగాధర శ్రీరాముల రమేష్, గర్షకుర్తి విద్యాసాగర్, గన్నేరువరం గాలిపెల్లి రత్నాకర్, దుర్శేట్టి లక్ష్మణ్, హుజురాబాద్ బుడిగె పర్శారం గౌడ్, జమ్మికుంట పెండ్యాల మహేష్, శంకరపట్నం చంటి శ్రీనివాస్, సైదాపూర్ రాజ్ కుమార్, సురేందర్ రెడ్డి, ఇల్లందకుంట ఎండి సల్మా, పోతల రూప, బండ అశోక్, వీణవంక కుతాడి శ్రీనివాస్, కరీంనగర్ అపర్ణ, రోజా రెడ్డి, నౌశీన్, కొత్తపల్లి ఎంఎ రాజీ, పుసాల పవన్తదితరులను మండల ఇంచార్జ్‌లుగానియమించినట్లు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు.

# ఆయిల్ పామ్ పంటపై అవగాహన సదస్సు



**రామగుండం, జనంసాక్షి :** పామాయిల్ పంట సాగు విస్తీర్ణం పెంచ డం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ.ఉద్యాన శాఖ. సహకార శాఖ ఆధ్వర్యంలో.అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిధి రైతువేదికలో.శనివారం ఆయిల్ పామ్ పంట సాగుపై మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారులు సతీష్. ప్రకాష్ లు మాట్లాడుతూ.గ్రామాలలో రబి కాలానికి 100 ఎకరాలలో పామాయి ల్ పంట సాగు చేపడుతామని. రైతులు కొత్తతరం పామాయిల్ పంటను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని తన సొసైటీ పరిధిలో ఉన్న రైతులు ముందుకు రావాలని.ఆయిల్ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని. పండించిన పంటను అమ్ముకోవడానికి ఎటువంటి ఇబ్బందులు ఉండని. అంతర్గాం మండలం లో 112 ఎకరాలకు పైగా పామాయిల్ పంట సాగు చేపడుతున్నారని.భవిష్యత్తులో అధికంగా రైతులు సాగు చేయాలని సూచించారు. మండల ఉద్యాన విస్తరణాధికారి రాము మాట్లాడుతూ. ఉద్యానవన శాఖ నుండి రైతులకు 90 శాతం సబ్సిడీతో మొక్కలుఅందిస్తున్నామని. 100 శాతం సబ్సిడీతో ఎస్సీ. ఎస్టీ రైతులకు డ్రిప్పు పరికరాలు. సన్న చిన్న కారు బీసీ రైతులకు 90 శాతం సబ్సిడీతో ఆయిల్ పామ్ పంటకు డ్రిప్పును అందిస్తున్నామని.ఆయిల్ పామ్ పంట సాగు చేసే రైతులకు నాలుగు సంవత్సరాలు.ఉద్యాన శాఖ నుండి ప్రతి ఏటా ప్రోత్సాహం అందిస్తామని.పండించిన పంట అమ్ముకోవడానికి 6 నుంచి 8 నెలల్లో ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ప్రారంభమవుతుందని.ప్రస్తుతం మార్కెట్లో టన్ను గెల ధర 19700 ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో. ప్రాథమిక సహకార సంఘం కార్యనిర్వాహక అధికారి రమేష్. అసిస్టెంట్ రిజిస్టర్ నరేష్.ఎ ఈ ఓ లో హరీష్, రమేష్, శ్రీకాంత్ తిరుమల ఆయిల్ ఫామ్ అధికారి ప్రశాంత్, రాకేష్ రైతులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లిలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



**బోయినపల్లి, నవంబర్ 22 (జనం సాక్షి):** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.బోయినపల్లి రైతు వేదికలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు.స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు.సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు.200 యూనిట్ ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డులు ఇస్తున్నామని

సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఎక్కడైతే మహిళలు సంతోషంగా ఉంటారో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల, ఏపీఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎవరు సహకరించకపోయిన ఈఎస్ఐ నిర్మాణం ఆగదు

- ఢిల్లీలో తీవ్ర కృషి చేసిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ
- ఏర్పాట్ల విషయంలో ఎంపీ అసంతృప్తి



**రామగుండం, జనంసాక్షి :** రామగుండంలో ఈఎస్ఐ అస్పత్రి నిర్మాణ విషయంలో ఎవరు సహకరించినా.. సహకరించక పోయినా ఈఎస్ఐ అస్పత్రి నిర్మాణం అగదని..ప్రజల సహకారంతో నిర్మించి తీరుతానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.రామగుండంలోని ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని శుక్రవారం రాత్రి సందర్శించి మాట్లాడారు.కాగా స్థల పరిశీలనకు ఎంపీ వస్తున్న విషయం తెలిసినప్పటికి అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవటం, ప్రోటోకాల్ పాటించక పోవటంపట్ల అయన అసంతృప్తిని వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇక్కడ ఈఎస్ఐ నిర్మాణం కొరకు ఏడాది కాలంగా ఢిల్లీలో మంత్రి వివేక్‌వెంకటస్వామితో పాటు తాను తీవ్రకృషి చేశానని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్‌మాల్యతో అనేకసార్లు విన్నవించామన్నారు. అయన సహకారంతో రూ.150 కోట్ల నిధులతో నిర్మాణానికి టెండర్లు కూడా ప్రకటించారన్నారు.తాను ఇంత కృషి చేస్తున్న ఇక్కడ ఒక్క అధికారి కూడా నోరుమేదపటం లేదని, తన తండ్రి వివేక్‌వెంకటస్వామితో పాటు తనను ప్రజలు ఆశీర్వదించారని, తాను ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న నన్ను నమ్మిన ప్రజల కోసం నిరంతరం పనిచేస్తానన్నారు.లక్షల మంది కార్మికులకు ఉపయోగపడే ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కట్టి తీరుతానన్నారు. అయన వెంట కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ. ఆర్డిఓ గంగయ్య. తహసీల్దార్ శ్రీపాదఈశ్వర్.డాక్టర్లు కగేశ్వర్‌రావు,అన్వేష్‌కుమార్, కిరణ్‌కుమార్, రైల్వే డిఆర్‌యు సీసీ సభ్యులు అనుమాస శ్రీనివాస్,గుమ్మడి కుమారస్వామి,దుబ్బాసి మల్లేష్,బొంకూరి మధు, రాచకొండ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

**ప్రోటోకాల్ పాటించలేదని దళిత నేతల అగ్రహం:**

రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి స్థల పరిశీలనకు శుక్రవారం రాత్రి గడ్డం వంశీ కృష్ణ వచ్చిన సందర్భంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవటంపై దళిత సంఘాల నేతలు గుమ్మడి కుమారస్వామి,బొంకూరి మధు, దుబ్బాసి మల్లేష్, రాచకొండ వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీపై ఆగ్రహం వ్యక్తం చేసారు.ఎంపీ దళితుడైనందునే వివక్షచూపిస్తూ ప్రోటోకాల్ పాటించటం లేదని తీవ్రంగా మండిపడ్డారు.ఈఎస్ఐ ఆసుపత్రి సందర్శనకు ఒకరోజు ముందే జిల్లా కలెక్టర్‌కు సైతం తెలిపారని, అయిన టెంట్లు, కుర్చీలు, చీకటిపూట లైట్లు ఏర్పాట్లు చేయలేదని, చిమ్మ చీకట్లో ఒక ఎంపీ ఎలా సందర్శిస్తారని. ఇకముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని అన్నారు.

# ప్రభుత్వ జేబు సంస్థగా డెడికేషన్ కమిటీ

- సర్పంచ్ రిజర్వేషన్ స్థానాల్లో కనిపించని పారదర్శకత
- బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (జనంసాక్షి) :** డెడికేషన్ కమిటీ ప్రభుత్వ జేబు సంస్థగా మారిందని బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్ ఆరోపించారు. వేములవాడ అర్బన్ మండలంలో 11 గ్రామపంచాయతీలు ఉండగా మూడు ఎస్సీ, రెండు బీసీలకు కేటాయించడం ఏ ప్రాతిపదికన చేపట్టారని అధికారులను నిలదీశారు.వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీలకు నాలుగు ఎస్సి లకు కేటాయించారన్నారు. 23 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా ఎక్కడ పారదర్శకంగా వ్యవహరించలేదన్నారు.సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయాలనుకున్న బీసీ ఆశవాహులను ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తమకు ఇష్టం వచ్చినట్లుగా రిజర్వేషన్లను అధికారుల ద్వారా కల్పించారన్నారు.42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ బీసీ ప్రజానీకాన్ని మోసం చేసిందని ఎద్దేవా చేశారు. సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ ప్రాంతంలో పొరపాట్లు జరగకూడదు

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**మహేశ్వరం, నవంబర్ 22 (జనంసాక్షి) :** గ్లోబల్ సమ్మిట్ ప్రాంతంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు.శనివారం కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ గ్రామ రెవిన్యూ పరిధిలో డిసెంబర్ 8,9 తేదీలలో జరిగే గ్లోబల్ సమ్మిట్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ...అధికారులు ప్రతి ఒక్కరూ తమ విధిని బాధ్యతగా నిర్వహించాలన్నారు.గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.వి.రాజు,కందుకూరు తహశీల్దార్ గోపాల్, విద్యుత్ శాఖ అధికారులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



- రేవ్ పార్టీలు, వీకెండ్ జల్సాలతో చిందులు, విందులు
- గొల్లగూడెం రోడ్డులో ఇళ్ల మధ్యలోనే విశృంఖల చేష్టలు
- యువ నేత అండాదండలు.. ఇక అనుమతులతో పనేంటి.?

# "కావేరీ" ప్రవాహం..
# అనాగరిక పోకడ!

## ఖమ్మం నడిబొడ్డున రాజధాని తరహా సంస్కృతి

**ఖమ్మం నగర జనం ఆలోచన వేగంగా మారుతోంది.. అభివృద్ధి దిశగా కాదండోయ్.! జల్సాల వైపుగా..!! మందు వేసి చిందులతో పసందు చేయడమంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు చెప్పండి..? అందుకే మెల్ల మెల్లగా ఖమ్మం నగరానికి నయా సంస్కృతి దిగుమతి అవుతోంది.. రాజధాని హైద్రాబాద్ తరహా పార్టీలకు మనోళ్లు కూడా ఉర్రూతలూగుతున్నారు.. అందుకే ఖమ్మంలో ఓ పేరు మోసిన పెద్దాయన ఈ పోకడను క్యాష్ చేసుకునేందుకు ముందడుగు వేశాడు.. శృంగేరీ.. "కావేరీ" నదుల్లా మద్యాన్ని పారించేందుకు ఓ రిసార్ట్స్ ను నెలకొల్పి యువతతో చిందులు తొక్కిస్తున్నాడు.. ఆ కథా కమామిషు ఏమిటో తెలుసుకుందాం రండి.!**

**ఖమ్మం నవంబర్ 22 (జనంసాక్షి) :** ఖమ్మం గొల్లగూడెం రోడ్డులో ఇటీవల ఓ రిసార్ట్స్ వెలిసింది. అది టీ, టిఫిన్లు అమ్మే రిసార్ట్స్ కాదండోయ్.! ఒళ్ళు తెలియకుండా ఫుల్లుగా మందేసి చిందేసే రిసార్ట్స్. వీకెండ్ జల్సాలు, రేవ్ పార్టీలు ఇప్పటిదాకా హైద్రాబాద్ వంటి మహా నగరాలకు మాత్రమే పరిమితమని భావించాం. ఇక ఇప్పుడు ఖమ్మం నగరానికి కూడా ఈ విష సంస్కృతి దిగుమతి అయ్యింది. అది కూడా ఖమ్మంలో చాలా కాలంగా ఓ బార్ అండ్ రెస్టారెంట్ నడుపుతున్న ఒక ప్రముఖ వ్యక్తి పుణ్యమాని. ఈయన ఘనకార్యం వల్లే ఆ రిసార్ట్స్ లో మద్యం "కావేరీ" నదిలా పారుతోంది. గొల్లగూడెం రోడ్డులోని ఒక ఎకరం భూమిలో ఏర్పాటైన ఈ రిసార్ట్స్ లో సూర్యాస్తమయ సమయానికి విందులు, వినోదాలు షురూ అవుతున్నాయి. ఇక మరో విశేషం ఏమిటంటే ఈ రిసార్ట్స్ చుట్టూ ఇళ్లు ఉండటమే. కాదు కాదండోయ్.!! ఇళ్ల మధ్యనే ఈ రిసార్ట్స్ ఉండటం. అంటే ఇళ్ల మధ్యలోనే రిసార్ట్స్ నెలకొల్పిన మన ఘనతగాంచిన పెద్దాయనకు హ్యాట్సాఫ్ చెప్పాలి కదా మరి.

**అనుమతులతో పనేంటి..?**

నలుదిక్కులా విస్తరిస్తున్న ఖమ్మం నగరంలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా ప్రభుత్వ పరమైన అనుమతులు తప్పనిసరి. రాజధాని హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న ఈ నగరంలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణమైనా చేపట్టడం అసాధ్యమే అవుతుంది. అలాంటిది నయా విష సంస్కృతిని ఖమ్మం నగరం దిగుమతి చేసిన ఈ రిసార్ట్స్ కు ఎలాంటి అనుమతులు లేకపోవడమే శోచనీయం. ఖమ్మం నగర కార్పొరేషన్ అనుమతులు ఏ నిర్మాణానికైనా తప్పనిసరి అయితే ఈ రిసార్ట్స్ ఎలాంటి పర్మిషన్స్ లేకుండా ఇళ్ల మధ్యలోనే వెలసి విచ్చలవిడిగా నడుస్తోంది. విచిత్రం ఏమిటంటే అధికారికంగా ఎలాంటి అనుమతులు కాగితంపై ఇవ్వని ఈ రిసార్ట్స్ కు విద్యుత్ శాఖ విద్యుత్ సరఫరా చేయడమే. హైదరాబాద్ తరహా సంస్కృతిని దిగుమతి చేస్తూ ఖమ్మం నగర యువతలో విష బీజాలు నాటుతున్న ఈ రిసార్ట్స్ లో నిత్యం వెలుగులు నింపుతున్న ఆ విద్యుత్ శాఖ అధికారులకు కూడా హాట్సాఫ్ చెప్పాల్సిందే కదా..! ఇక ప్రతినిత్యం పొద్దుపోయిన తర్వాత ఈ రిసార్ట్స్ లో కార్యకలాపాలు సాగుతూ ఉంటాయి. అయితే దీని చుట్టుపక్కల అప్పటికే ఇళ్లు నిర్మితమై ఉండడంతో ఇందులో జరిగే అల్లరికి విసిగిపోయిన ఓ వ్యక్తి ఇటీవల గ్రీవెన్స్ డే లో ఫిర్యాదు చేశాడు. ఇళ్ళ మధ్యలో ఏర్పాటు చేసిన రిసార్ట్స్ లో అడ్డగోలు చేష్టలు మితిమీరుతున్నాయని, అర్ధరాత్రి దాకా విందులు, చిందులతో జన జీవనానికి ఆటంకం కలిగిస్తున్నారని మొర పెట్టుకుంటూ జిల్లా అధికారులకు ఈ ఫిర్యాదు అందింది. వెంటనే మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగి ఆ రిసార్ట్స్ అంతు చూస్తారని అందరూ భావించారు. అయితే అలా ఏమాత్రం జరగలేదు. పైగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సంబంధిత అధికారులకు అధికార పక్షానికి చెందిన ఓ యువ నేత నుంచి బెదిరింపులు రావడం విస్మయం కలిగించే విషయం. ఇలా "కావేరి" ప్రవాహంలా మద్యాన్ని పారిస్తూ యువతతో చిందులు వేయిస్తున్న సదరు బడా వ్యాపారవేత్తకు అనుమతులతో పనేముంటుంది చెప్పండి.!!




# కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సరైన సమయమిది

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 22(జనం సాక్షి) :** కేవలం అబద్దాలతోనే కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ పార్టీకి సర్పంచ్ ఎన్నికల సందర్భంగా తగురీతిలో బుద్ధిచెప్పాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పిలుపుని చ్చారు. ఇబ్రహీంపట్నం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులు, మహిళలు, యువత కాంగ్రెస్ పార్టీ తమకిచ్చిన హామీలను గుర్తు చేసుకొని సమాధానం చెప్పడానికి ఇదే సరైన సమయమని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా దశలవారీగా ప్రతి దళిత కుటుంబానికి పది లక్షల రూపాయల సాయం అందించడానికి కృషి చేసిందని, నాడు అందరికీ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన కాంగ్రెస్ ఒక్క కుటుంబానికి కూడా సాయం చేయలేదని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం పేరిట అన్ని దళిత కుటుంబాలకు 12 లక్షల ఆర్థిక చేయూత అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మరిచిపోయారని దుయ్యబట్టారు. కేసీఆర్ కిట్ , అమ్మఒడి తదితర పథకాలను రద్దు చేసారని, గర్భిణిలు, పిల్లల పౌష్టికాహారం పథకానికి తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఉద్యోగులు పిఆర్సీ , ఆరు పెండింగ్ డిఎలు , రిటైర్మెంట్ బెనిఫిట్స్ అడిగితే వారిని ప్రజా వ్యతిరేకులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కేసీఆర్ పాలనలో గాడిలోపడిన వ్యవసాయ రంగం, కాంగ్రెస్ పాలనలో మళ్లీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎన్నికల కోసం చీరలు పంచడం తిరిగి మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికలలో కీలెరిగి వాతలు పెడితే కాంగ్రెస్ పార్టీకి తాను చేసిన మోసం ఏమిటో తెలుస్తుందన్నారు. మాజీ ఎంపిపి కృపేష్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిట్ల వెంకట్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు దేరంగుల నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి భాస్కర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, మాజీ సర్పంచులు కాలె గణేష్, బల్వంత్ రెడ్డి, యాదగిరి, బీరప్ప, దానయ్య గౌడ్, మాజీ ఎంపిటిసిలు అచ్చన శంకర్, రవీందర్, మైసయ్య, సొసైటీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీలలో జడ్పీహెచ్ఎస్

# చిన్నకాపర్తి విద్యార్థుల అద్భుత ప్రతిభ



**నల్లగొండ, నవంబర్ 22 (జనం సాక్షి) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నకాపర్తి చిట్యాల మండలం విద్యార్థులు మత్స్యగిరి, అఖిల, విశ్వ సాయి ప్రత్యూష ,సిరి ,ఇందు,మహాలక్ష్మి ,నితీష్ కుమార్, శరత్ నల్లగొండ జిల్లాస్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాలలో యోగా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కాబడి కరీంనగర్ జిల్లా జడ్పీహెచ్ఎస్ వెలిశాలలో నిర్వహించబడిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా చిట్యాల మండల విద్యాధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సైదా నాయక్ గారు యోగా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ అందరు విద్యార్థులు కూడా శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి ప్రతిరోజు యోగా చేయాలని కోరారు. అదేవిధంగా వివిధ ఆటల పోటీలలో మరియు ప్రతిభా పరీక్షలలో జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, బాలకృష్ణ, నయీముద్దీన్, రేవతి,అష్రఫ్,మాధవి, సాయిబాబా చంద్రశేఖర్, గఫార్ ,శ్రీలత నవ్య మరియు శిరీష అభినందించారు.



# అధికారి లేక రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం

- ఇబ్బందులు పడ్డ క్రయవిక్రయదారులు
- నవాబ్ పేట్ తహసీల్దార్ కార్యాలయంలో ఈ పరిస్థితి

**వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి):** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడి క్రయవిక్రయదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.శనివారం 14 భూ రిజిస్ట్రేషన్స్ దరఖాస్తులు రాగా అందులో 6 రిజిస్ట్రేషన్స్ కాగా మిగిలిన 8 మాత్రం పెండింగ్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసే అధికారి డిప్యూటీ తహసీల్దార్ నవీన్ రెడ్డి వెళ్లిపోయారు. దింతో భూ క్రయ విక్రయం, సక్సెషన్ కోసం వచ్చిన వారు ఎదురు చూసి భూ రిజిష్టర్ అధికారి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.భూభారతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వానికి చలాన్ల రూపంలో లక్షలాది రూపాయలు చెల్లించి. రిజిస్ట్రేషన్ల కోసం వస్తే రిజిస్టర్ చేసే అధికారి లేదని సిబ్బంది చెప్పడంతో క్రయ విక్రయ దారులు అధికారులు లేదని ముందుగా సమాచారం ఇవ్వాలి కదాఅని ప్రశ్నించారు. ఇటీవలే ఇక్కడ విధులు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దార్ కూడా తాను విధులకు ఈ రోజు రావట్లేదు మరో రోజుకు మీ స్లాట్ బుకింగ్ మార్చుకోగలరని వాట్సాప్ లో మెసేజ్ చేయించినట్లు తెలుస్తుంది.రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు ఆ అధికారి వస్తాడని సాయంత్రం వరకు వేచి చూచి ఆ అధికారి రాకపోవడంతో ఇంటి బాట పట్టారు.గతంలో భూ రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ జయరాంకు ఉండగా ఆయన బదిలీ కావడంతో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు భూ రిజిస్ట్రేషన్ లాగిన్ ఇవ్వడం జరిగింది.తాసిల్దారుగా బుచ్చయ్య బాధ్యతలు చేపట్టిన సుమారు 5 నెలలు దాటుతున్న ఇప్పటివరకు ఆయనకు లాగిన్ ఇవ్వకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ తహసీల్దార్ బదిలీ అయి మరో డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతలు తీసుకున్న ఆయనకే భూ రిజిస్ట్రేషన్ లాగిన్ ఉంది.దీంతో ఆ భూ రిజర్వేషన్ అధికారి వచ్చిన రోజే రిజిస్ట్రేషన్ లేకుంటే రిజిస్ట్రేషన్లు మరో రోజుకు బదిలీ అయ్యే పరిస్థితి నవాబ్ పేట్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పడింది.

# నాణ్యమైన చీరలతో ఆడపడుచులకు గౌరవం

## ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**యాలాల నవంబర్ 22 (జనంసాక్షి) :** నాణ్యమైన చీరలతో ఆడపడుచులకు గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం యాలాల మండల కేంద్రంలో మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.31,03,596/- విలువ గల కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు "ఇందిరమ్మ చీరలను" పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు.



# ఆదరణ పెరిగినా...
# బోధనేది..!

## 507 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులు

- మేడ్చల్ జిల్లాలో 3 వేలకు పైగా టీచర్లకు ప్రస్తుతం ఉన్న టీచర్లు 2,700 మాత్రమే
- ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అసరమైన టీచర్లు 3,270 పైన్నే
- ఈ విద్యాసంవత్సరంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు 2,823
- కరోనా తర్వాత నుంచి 2025 వరకు చేరిన విద్యార్థుల సంఖ్య 16,504
- అదనంగా 600 టీచర్ల కోసం ఉన్నతాధికారులకు విద్యాశాఖ నివేదిక
- ఉపాధ్యాయులను భర్తీ చేయని పక్షంలో విద్యా వాలంటర్ల నియామకానికి కసరత్తు

### ప్రభుత్వ బడులకు ఆదరణ పెరిగినా..

మేడ్చల్-మల్కాజిగిరిలో ప్రభుత్వ బడులకు గణనీయమైన ఆదరణ పెరుగుతోంది. జిల్లాలో 2021 నుంచి 2025 విద్యాంవత్సరంలో 16,504 మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారు. 2021-22 విద్యాసంవత్సరం (కరోనా సమయం)లో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. 2022-23లోజిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 1,976 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య 1,194 కాగా, రెండో తరగతి నుంచి 10వ తరగతిలో చేరిన విద్యార్థులు 782 మంది ఉన్నారు.2024-25 విద్యాసంవత్సరంలో 2,823 మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కూడా ఈ సంఖ్య అత్యధి కంగానే కనిపిస్తోంది.



*కరోనా తర్వాత గ్రేటర్‌తో సహా శివారు సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ప్రవేశాలు పెరిగినా.. అందుకు తగ్గట్టుగా బోధన వసతులు కరువయ్యాయి. టీచర్ల కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు బోధకులు లేకపోవడంతో..ఫలితాల్లో ఆ పరిస్థితి స్పష్టమవుతోంది. ముఖ్యంగా బయోలాజికల్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, హిందీ వంటి సబ్జెక్టులకు ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో బోధన అంతంత మాత్రమే సాగుతోంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో సుమారు 600ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ మేరకు విదాశాఖ వర్గాలు కూడా ఉన్నతాధికారులకు ఇదే విషయమై నివేదికలను సమర్పించినట్లు తెలుస్తోంది.*

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబర్ 22(జనంసాక్షి):**

**మేడ్చల్ జిల్లాలో ఇలా...**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు మంది విద్యార్థులు చదువుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో 2,823 మంది విద్యార్థులు చేరారు. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో 3 వేల మందికి పైగా టీచర్లు పని చేయాల్సి ఉన్నప్పటికిని, ప్రస్తుతం 2,700 మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తుండటంతో ..మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఇంగ్లీషు మీడియం బోధన కూడా కొనసాగుతుండటంతో అదనంగా టీచర్లు అవసరమని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

**-విద్యా వాలంటర్ల తొలగింపుతో...**

కరోనా తర్వాత విద్యా వాలంటీర్లను ప్రభుత్వం తొలగించింది. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించి దాదాపు ఆరు నెలలు కావస్తున్నా.. విద్యా వాలంటర్లను ఇప్పటి వరకూ నియమించలేదు. గతంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 400 మంది విద్యావాలంటీర్లు పని చేసేవారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో.. విద్యావాలంటర్లు లేని లోటు స్పష్టమవుతోంది జిల్లా విద్యాశాఖ వర్గాలు మాత్రం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించామని పేర్కొంటున్నాయి.అలాగే, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 600 మంది ఉపాధ్యాయులు అవసరమని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. సకాలంలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయని పక్షంలో విద్యా వాలంటర్లను నియమించాలని కొరినట్లు సమాచారం.జిల్లాలో కొన్ని చోట్ల ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమం చేసినప్పటికిని, ఎక్కడవేసిన గొంగడి అక్కడే చందంగా టీచర్ల కొరత తీవ్రంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

**విద్యార్థుల తల్లిదండ్రుల్లో పెరిగిన నమ్మకం**

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న గణనీయమైన మార్పుల వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది. కరోనా కష్ట కాలం నుంచి మొదలుకొని.. ప్రైవేట్,కార్పోరేట్‌ల్లో ఫీజులు..పుస్తకాల మోతతో పేద ,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది.ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించటం తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావటంతో... ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు.పైగా ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం సర్కారు తీసుకుంటున్న చర్యలు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లేలా చేస్తోంది.

**ప్రైవేట్‌కు దీటుగా ...**

శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా అన్నీ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టారు.గతంలో మనబడి -మన ఊరు-మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మత్తులు ,మౌలిక వసతుల కల్పన వంటి చర్యలు తీసుకున్నారు. సీఎస్ఆర్ నిధులతో కూడా 35 ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అధ్వర్యంలో రూ.12.50 కోట్లతో 286 ప్రభుత్వ బడుల్లో మరమ్మత్తు పనులు చేపట్టారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ ,మధ్యాహ్నం భోజన పథకం వంటి సదుపాయాలను కల్పిస్తున్న అంశాలపై జిల్లా విద్యాశాఖ విస్తృతంగా కల్పిస్తున్న ప్రచారం ఫలితం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా చేస్తోంది.

# దక్షిణ అండమాన్ మధ్యలో అల్పపీడనం

- ఎపికి వాతావరణ శాఖ భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**అమరావతి /హైదరాబాద్, నవంబర్22 (జనంసాక్షి) :** మలక్కా- దక్షిణ అండమాన్ సముద్రం మధ్య అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి ఈ నెల 24న ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాయుగుండం మరింత బలపడే సూచనలు ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. 48 గంటల్లో రాయలసీమ, దక్షిణకోస్తాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప, జిల్లాల్లో తేలికపాటి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.ఇటీవల మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. అనేక జిల్లాల్లో వర్ష బీభత్సం కొనసాగింది. ఆ పరిస్థితులను నుంచి ప్రజలు కోలుకుంటున్న తరుణంలో మరోసారి వర్షాలు ఏపీని ముంచెత్తనున్నాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ ఈనెల 24 సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాలు రానున్న నేపథ్యంలో రైతులకు విపత్తుల నిర్వహణ సంస్థ పలు ముఖ్య సూచనలు చేసింది. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు వెంటనే కుప్పలు వేసుకోవాలని తెలిపింది. తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ సూచనలు చేసింది.

### అల్పపీడనంతో తెలంగాణకు వర్ష సూచన

తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మలక్కా జలసంధిలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఉదయం 8.30 గంటలకు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తర్వాతి 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం సైతం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పొడి వాతావరణం ఉంటుందని వివరించింది.

# మహిళల ఆత్మగౌరవం ఇనుమడించే కార్యక్రమం

- ఇందిరమ్మ చీరల పంపిణీపై సలహాదారు సుదర్శన్ రెడ్డి
- నిజామాబాద్ కలెక్టరేట్‌లో ప్రారంభం



**నిజామాబాద్, నవంబరు 22 (జనంసాక్షి) :** మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ కలెక్టరేట్ లో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్దంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితవు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని, నిపుణులైన ఉపాధ్యాయులు, మెరుగుపడిన సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని సూచించారు. కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన వారందరికీ చీరలు పంపిణీ జరిగేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి చేరుకున్న ఉపరాష్ట్రపతి

- ఘనంగా స్వాగతం పలికిన సిఎం, మంత్రులు



**పుట్టపర్తి, నవంబరు 22 (జనంసాక్షి) :** సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగు తున్నాయి. పుట్టపర్తిలో సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ సహా అనేక రంగాల ప్రముఖులు హాజరవుతున్నారు. శనివారం ఉదయం వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. తాజాగా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత, అధికారులు పుట్టపర్తి విమానాశ్రయం వద్ద ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి పూర్ణచంద్ర ఆడిటోరియం వద్దకు చేరుకున్నారు. శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వారితోపాటు ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ టెస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తిలకించారు. సత్యసాయి బాబా మహా సమాధిని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దర్శించుకున్నారు.

# పెళ్లి కాకముందే తల్లయిన యువతి

- పుట్టిన బిడ్డను అమ్మేందుకు యత్నించి భంగపాటు

**కరీంనగర్, నవంబర్22 (జనంసాక్షి) :** ఈ మధ్య కాలంలో శిశువు విక్రయాలు ఎక్కువయ్యాయి. అక్రమ సంబంధం ద్వారా పుట్టిన బిడ్డను అమ్మేసేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు మహిళలు. మరికొన్ని చోట్ల బిడ్డను పోషించే స్థోమత లేక అమ్మకానికి పెట్టేస్తున్నారు. ఇఓ మహిళ కూడా ఇలాంటి దారుణానికే పాల్పడింది. అప్పుడే పుట్టిన బిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించి చివరకు ఊచలులెక్కబెడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో యువతి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ యువతి ఓ వ్యక్తిని ప్రేమించింది. ప్రేమికుడి కారణంగా గర్భవతి అయిన యువతి.. మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ అతడు మోసం చేయడంతో బిడ్డను ఎలా పోషించాలో తెలియక దారుణ నిర్ణయిం తీసుకుంది. తనకు పుట్టిన బిడ్డను అమ్మకానికి పెట్టింది. ఏకంగా ఆరు లక్షలకు శిశువును విక్రయించేందుకు బేరం కుదిరింది. బిడ్డను విక్రయించేందుకు కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకినివానిపల్లెకి చెందిన రాయమల్లు, లత దంపతులకు శిశువు విక్రయానికి ఒప్పందం కుదిరింది. విషయం తెలిసిన బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన కరీంనగర్ టూ టౌన్ పోలీసులు.. శిశువు విక్రయాన్ని అడ్డుకున్నారు. శిశువును అమ్మేందుకు సహకరించిన 15 మందిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్రంలో మహిళలకు నాణ్యమైన చీరలు

- ఇందిరమ్మ చీరల పంపిణీలో మంత్రి శ్రీహరి



**మక్తల్, నవంబరు 22 (జనంసాక్షి) :** ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణంలో మహిళలకు శనివారం ఇందిరమ్మ చీరలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను నాణ్యమైన చీరలు అందజేస్తుం దన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. డిసెంబర్ ఒకటిన రూ.4,500 కోట్ల బ్జడెట్‌తో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. మక్తల్- నారాయణపేట 4 లేన్ ల రహదారికి, నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు

# 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**హైదరాబాద్, నవంబరు 22 (జనంసాక్షి) :** తెలంగాణలో తొమ్మిది మంది నాన్ క్యాడర్ ఎస్పీలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్ ఎస్పీలుగా పీ కరుణాకర్, ఎస్వీఎన్ శివరామ్, ఆర్ జగదీశ్వర్‌రెడ్డిని బదిలీ చేసింది. సైబరాబాద్ ఎస్‌బీ డీజీపీగా వైవీఎస్ సుధీంద్ర, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా సాయిశ్రీ నియామక మయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా వి అరవింద్ బాబు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా ధార కవిత, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా ఎం రవీందర్‌రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఎన్ అశోక్ కుమార్ బదిలీ నియామకమయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం ప్రభుత్వం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టింది. 32 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# యాంటీబయోటిక్స్ వాడవద్దు

- వైద్యులు సూచిస్తేనే వాడాలి
- ఆదిలాబాద్‌లో రిమ్స్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ




**ఆదిలాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి) :** అతిగా యాంటీ బయోటిక్స్ వాడితే ప్రమాదమని వైద్యులు హెచ్చరించారు. తమకు తెలిసిన మందులను వైద్యుల సలహా లేకుండా వాడరాదన్నారు. ఇది ఇతర వ్యాధులకు దారితీస్తుందని అన్నారు. 'ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారంను పురస్కరించుకొని శనివారం రిమ్స్ మైక్రో బయాలజీ విభాగం, వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ.. రిమ్స్ నుంచి కలెక్టరేట్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ మాట్లాడుతూ.. యాంటీబయోటిక్స్ వాడకం వల్ల ఏర్పడే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. అధికంగా యాంటీబయోటిక్స్ వినియోగంతో ప్రజల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. వైద్యుల సూచనల మేరకు వాటిని వినియోగించాలన్నారు.అయితే ఇది తెలియక ఎవరికి వారుత తమకు తోచిన మందులను వాడేస్తున్నారని అన్నారు. ఇది ప్రమాదమో తెలుసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ దీపక్ పుష్కర్, ఎన్‌సీడీ కార్యక్రమాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీఏ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నవంబరు 22 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

# నేడు భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు

**విజయవాడ, నవంబరు 22 (జనంసాక్షి) :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఆదివారం దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ ప్రతినిధి అభయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో.. నిరాయుధులైన హిడ్మా, అతడి భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులను ఏపీ పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకుని ఆ తరువాత మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కాల్చి చంపి, దానిని ఎన్‌కౌంటర్‌గా చెప్పుకున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా చికిత్స కోసం విజయవాడకు వచ్చారని, విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐబీ పోలీసులు అతన్ని పట్టుకుని.. 15న అరెస్ట్ చేసి, 18వ తేదీన హిడ్మాను బుటకపు ఎన్ కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ప్రతినిధి అభయ్ ఆరోపించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ సంఘం సీనియర్ నాయకుడు మనీష్ కుంజా కూడా ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. తాడిమెట్ల, జీరంఘాట్ ఘటనల్లో మాద్వి హిడ్మా ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాకు చెందిన కొంత మంది పార్టీకి చెందిన నాయకులే హిడ్మా కదలికలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో దేవ్‌జీ పాత్ర ఉందని తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఎన్ కౌంటర్ ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భారత్ బంద్‌కి పిలుపునివ్వడంతో.. భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ఏరియాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రజా ప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాలను విడిచి మైదాన ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు సూచనలు చేశారు.

# సున్నం చెరువు పునరుద్దరణలో తొలిగిన అడ్డంకి

- ఎఫ్‌టిఎల్‌లో ఉన్న గుడి, ప్రార్థనా స్థలం తరలింపునకు ఓకే




**హైదరాబాద్, నవంబర్22 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని సున్నం చెరువు పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్న హైడ్రా అధికారులు శనివారం స్థానికులతో కీలక సమావేశం నిర్వహించారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆంజనేయస్వామి గుడి, ముస్లింల ప్రార్థనా స్థలం 'చిల్లా' మార్పు గురించి ఇరుపక్షాల అభిప్రాయాలను హైడ్రా కమిషనర్ స్వయంగా నివాసితులతో మాట్లాడి తెలుసుకున్నారు. చెరువు పునరుజ్జీవనంలో భాగంగా ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను గట్టు వైపు మార్చాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించగా, రెండు వర్గాల స్థానికులూ ఈ నిర్ణయానికి అంగీకారం తెలిపారు. సున్నం చెరువు కూడా హైడ్రా చేపట్టిన ప్రధాన పునరుద్ధరణ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉన్నందున, చెరువు అసలు పరిమితిని కాపాడటం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ఆక్రమణలను తొలగించడం వంటి కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియలో ఆంజనేయుని గుడి, చిల్లా ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుండటంతో, వాటి పునర్వ్యవస్థీకరణపై గత కొంతకాలంగా సమీక్ష జరుగుతోంది. శనివారం జరిగిన ఈ సమాలోచనలో ఇరువర్గాల నివాసితులు పూర్తిగా సహకరిస్తామని హైడ్రాకు హామీ ఇవ్వడం ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యకు తెరపడింది. పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ముందుకు సాగేందుకు ఈ అంగీకారం ఎంతో సహాయకారి అవుతుందని హైడ్రా అధికారులు తెలిపారు. చెరువు భద్రత, అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో ప్రజల సహకారం అత్యంత కీలకమని కమిషనర్ సమావేశంలో పేర్కొన్నారు.

# నియోజకవర్గం కోసం కలిసి పనిచేస్తున్నా

### స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ, నవంబర్22 (జనం సాక్షి) :** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈ నెల 23వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చినట్లు స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ నోటీసులపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తానని వెల్లడించారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. కడియం శ్రీహరి భయపడడు. ఉప ఎన్నికలు వచ్చిన పక్షంలో కచ్చితంగా మళ్లీ పోటీ చేస్తా. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకు ఉందని కడియం అన్నారు. ఇందులో రాజకీయం లేదన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370